# భాగవతంలోని గజేంద్రమోక్షం - ప్రతీకాత్మకత

BHAGAVATHAM LONI GAJENDRA MOKSHAM - PRATEEKATMAKATHA

ఎం.ఫిల్. డిగ్రీకోసం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి

సమర్పించిన లఘు సిద్ధాంత గ్రంథం


పరిశోధకుడు

**బి. ఈరనారప్ప**

ఎం.ఎ; టి.పి.టి.

పర్యవేక్షకుడు

**డా. ఎన్.ఆర్. సదాశివరెడ్డి**

ఎం.ఎ; పీహెచ్.డి

తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురం - 515 003


నవంబరు - 2020

# స్పష్టీకరణ పత్రము

"భాగవతంలోని గజేంద్రమోక్షం - ప్రతీకాత్మకత " అనే ఈ లఘు సిద్ధాంత వ్యాసాన్ని నేనే స్వయంగా రూపొందించాననీ, దీన్ని ఏ విద్యాపట్టానికి కానీ, మరే ఇతర బిరుదులకోసంకానీ, ఇంతకు ముందు ఏ విశ్వవిద్యాలయానికి కానీ, ఏ ఇతర సంస్థలకు కానీ సమర్పించలేదని ప్రకటిస్తున్నాను.

బి. ఈరనారప్ప
పరిశోధకుడు

స్థలం :
తేది :

డా॥ ఎన్.ఆర్. సదాశివరెడ్డి
సహాయాచార్యులు
తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం,
అనంతపురము.

# ధ్రువీకరణ పత్రము

"భాగవతంలోని గజేంద్రమోక్షం – ప్రతీకాత్మకత" అనే ఈ లఘు సిద్ధాంత వ్యాసాన్ని బి. ఈరనారప్ప స్వయంగా నా పర్యవేక్షణలో రూపొందించారు. దీన్ని ఏ విద్యాపట్టాకోసంకానీ, మరే ఇతర బిరుదులకోసం కానీ, ఇంతకు ముందు ఏ విశ్వవిద్యాలయానికి కానీ, ఏ ఇతర సంస్థలకు కానీ సమర్పించలేదని ధ్రువీకరిస్తున్నాను.

డా॥ ఎన్.ఆర్. సదాశివరెడ్డి
పర్యవేక్షకుడు

స్థలం :
తేది :

# కృతజ్ఞతాంజలులు

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖలో పరిశోధనకు అవకాశం కల్పించిన అప్పటి శాఖాధ్యక్షులు ఆచార్య జి. బాలసుబ్రమణ్యంగారికి, ఇప్పటి శాఖాధ్యక్షులు ఆచార్య జి.నరసింహన్‌గారికి ప్రత్యేక నమస్సులు. నిరాడంబరత్వం, నిజాయితీ, నిస్వార్థసాహితీసేవ, సమాజాభివృద్ధి సహజగుణాలు కలిగిన గురువు నా పరిశోధనా పర్యవేక్షకులైన **డా॥ నీలకంఠాపురం ఆర్. సదాశివరెడ్డిగారికి,** నా పాదాభివందనాలు. ఆయన గురువుగా లభించడంతో నా పరిశోధనకు మార్గం సుగమమైంది. గురువుగారు ఎంతో వాత్సల్యంతో నిరంతరం సమాజసేవవైపు, సాహిత్యంవైపు, పరిశోధనవైపు నా ఆలోచనలను మళ్ళించి నాచేత ఈ పరిశోధన పూర్తిచేయించారు. నా పరిశోధన పట్ల ఎంతో ప్రేమను ప్రదర్శించే గురువుగారికి సదా కృతజ్ఞతలు.

నా పరిశోధనకు వెన్నుదన్నుగా నిలిచి, జేఆర్ఎఫ్ ఫెలోషిఫ్‌ను అందించి సహకరించిన విశ్వవిద్యాలయం నిధుల సంఘం (యూజీసీ)వారికి, నా నమస్సులు.

తెలుగుశాఖ బోధనేతర సిబ్బందికి, పరిశోధక విద్యార్థులు కొంకా మల్లికార్జున, ఎం. హరికృష్ణ, డి. రమణ, వి.కె. లక్ష్మినారాయణ, జె.శివశంకర్, జి. బాలచంద్ర, కె. మునిస్వామి, కె. సంగాలు తదితరులకు ....

నిరంతరం నా అభివృద్ధిని కాంక్షించిన **మా అమ్మానాన్నలు శ్రీమతి బి. నారమ్మ, శ్రీ బి. నారాయణస్వామిలకు**, నాకన్నా ఎక్కువగా నా పరిశోధన గురించి తాపత్రయపడిన **నా శ్రీమతి బి.గంగాదేవిగారికి**, నా తోబుట్టువులు అన్న బి. శివయ్య, వదినమ్మ బి. శివమ్మ, అక్క బావలు పి. మల్లక్క–పి. నాగప్ప, డి. పార్వతి–డి.బాలలింగమయ్యలకు, వారి చిన్నారులకు....

మా పిల్లలు సాయిమహేశ్, హేమంత్‌కుమార్, లక్షిత, వినోద్, నరేందర్‌లకు ....

పరిశోధన నిమిత్తం అవసరమైన గ్రంథసామాగ్రిని సమకూర్చిన విశ్వవిద్యాలయ గ్రంథాలయం మరియు మా ఆర్ట్స్ కళాశాల గ్రంథాలయం సిబ్బందికి....

పుత్రవాత్సల్యంతో నన్ను ఆదరించి అన్నం పెట్టిన మా గురువుగారి శ్రీమతి డా॥ కె.ఎస్. శకుంతలగారికి నా సహస్రాభివందనాలు. గురువుగారి కుమారుడు, నా సోదరుడు చిరంజీవి ధృవకు.... స్నేహాభివందనాలు.

నా పరిశోధన గ్రంథాన్ని ఎంతో చక్కగా డి.టి.పి. చేసిన సోదరుడు డా॥ బత్తల అశోక్‌కుమార్‌కు....

కృతజ్ఞతా సుమాంజలులు.

**బి. ఈరనారప్ప**

**పరిశోధకుడు**

# విషయ సూచిక

# విషయ సూచిక

**1. శ్రీమద్భాగవత వైశిష్ట్యం 1-21**

1.1. స్కాంధ పురాణం

1.2. పద్మపురాణం

1.3. చతుశ్లోకీ భాగవతం

1.4. భాగవతం – దశలక్షణాలు

1.5. భాగవతం – భాగవతుల ధర్మాలు

1.6. భాగవతం – భగవంతుని స్వరూపం

**2. భాగవతం భక్తి తత్త్వం మార్గాలు 22-52**

2.1. శ్రవణ భక్తి

2.2. కీర్తనం

2.3. స్మరణం

2.4. పాదసేవనం

2.5. అర్చనం

2.6. వందనం

2.7. దాస్యం

2.8. సఖ్యం

2.9. ఆత్మనివేదనం

**3. తెలుగు సాహిత్యంలో ప్రతీకలు 53-73**

3.1. రామాయణం

3.2. భగవద్గీత – ప్రతీకాత్మక

3.3. మహాభారతం – నన్నయ

3.4. తిక్కన భారతం

3.5. ఎఱ్ఱన - హరివంశం

3.6. తెనాలి రామలింగడు - పాండురంగ మహాత్మ్యం

3.7. పెద్దన - మనుచరిత్ర

3.8. తిమ్మన - పారిజాతాపహరణం

3.9. సూరన - కళాపూర్ణోదయం

**4. గజేంద్ర మోక్షం ప్రతీకాత్మకత 74-98**

4.1. ఉపోద్ఘాతం

4.2. సంక్షిప్త కథ

4.3. త్రికూట పర్వత వర్ణన

4.4. త్రికూటమందలి గజములు

4.5. కరి - మకరిల పోరు

4.6. గజేంద్రుని దీనాలపములు

4.7. విష్ణువు ఆగమనం

4.8. శింశుమార చక్రం

4.9. కరి - మకరుల పూర్వజన్మ

# మొదటి అధ్యాయం

# 1. శ్రీమద్భాగవత వైశిష్ట్యం

వెనుకటి రోజుల్లో తెలుగు వారు భారత, భాగవత, రామాయణాలను అనునిత్యం పారాయణం చేసుకునేవారు. అందలి ఘట్టాలను తమకు వివిధ విపత్కర పరిస్థితుల్లో ఊరటనిచ్చేవిగానే కాకుండ అనేక ప్రయోజనాలను కలిగించే మంత్రాలుగా భావించేవారు. ఈ పురాణ ఇతిహాసాలలోని అనేక శ్లోకాలు, పద్యాలు, వారి నాలుకలపై తాండవించేవి. ఇష్టాగోష్ఠులలో, సభావేదికలలో మైమరచిపోయి తాదాత్మ్యంగా వందల పద్యాలు వాటిలోనివి అప్పజెప్పేవారు. కవుల జయంతులో, ఆయా గ్రంథాల సప్తాహాలో జరుపుకొని కవుల ఆత్మీయతను, గ్రంథాల్లోని వెలుగును దర్శించేవారు.

దీనికి సాక్ష్యంగా పూర్వకాలంలో ఒక శ్లోకం ఈ విధంగా వినవస్తోంది.

"ప్రాతర్ద్యూద ప్రసంగేన మధ్యాహ్నే స్త్రీ ప్రసంగక
రాత్రౌచోర ప్రసంగేన కాలో గచ్ఛంతి ధీమతా:"

ఈ శ్లోకం పైకి విరుద్ధార్థాన్నిస్తోంది. కానీ మాటతీరును మాటు చేసి చెప్పే కళాధర్మాన్ని ఆశ్రయించిన మన పూర్వులు ఈ శ్లోకానికి ఉద్దేశించిన అర్థం ఇది కాదు. జూదమాడి అడవుల పాలైన పాండవుల కథ భారతం ఉదయంపూట చదువుకొమ్మన్నారు. స్త్రీ వ్యామోహంంతో అయిన రావణున్ని చంపిన రాముని కథ రామాయణాన్ని మధ్యాహ్నాస్త్రం అధ్యయనం చేయండన్నారు. వెన్న దొంగ అయిన శ్రీకృష్ణుని గాథ భాగవతం రాత్రిపూట పఠించండని సెలవిచ్చారు. ఇది ఆనాటి ఆరోగ్యకరమైన ఆలోచనల్లో తేలియాడే సహృదయ పాఠకుల వాతావరణం.

కానీ కాలం మారింది. పారిశ్రామిక యుగంలో పరుగులు తీస్తున్నారు మానవులు. వినోదం కోసం అథమ పద్ధతుల్ని ఆశ్రయిస్తున్నారు. మట్కా మహమ్మారి, కుటుంబంతో చూడడానికి వీలులేని సినిమాలు యువకుల్ని నిర్వీర్యం చేస్తున్నాయి. వారిలో రకరకాల బలహీనతల్ని రెచ్చగొడుతున్న టి.వి. ఛానళ్ళు మనిషిని మానవత్వానికి దూరంగా ఈడ్చుకు పోతున్నాయి. మళ్ళీ పురాణాల గుబాళింపుల్ని అంతట విరజిమ్మవలసిన అవసరం ఆసన్నమైంది. వాటికి ప్రాణం పోసే సదసద్వివేక చర్చలు, సదస్సులు ఏర్పడాలి.

భారతీయ ఆధ్యాత్మిక సంపదకు మూలకందములు వేదాలు, ఉపనిషత్తులు,

ధర్మశాస్త్రేతిహాసములు. ఇవి మన ప్రాచీన సాంస్కృతిక ఔన్నత్యాన్ని చాటి చెప్పగలవు. ఇవి చతుర్విధ పురుషార్థ సాధనలో ప్రముఖపాత్ర వహించినవి కాగా ఇవి సర్వ సులభ సాధ్యాలు కావు. అట్లుగాక కథోపాఖ్యానాల వల్ల వేదవేదాంగాల సారవంతమైన విషయాలను సామాన్యునికి సైతం స్పష్టం చేయగలవి పురాణాలు మాత్రమే. సంఘం నైతికంగా పతనమై ధర్మవ్యతిరేకమై, కింకర్తవ్య విమూఢమై భీతావహ దశలో ఉన్నప్పుడు మిత్రుని వలె ధైర్యం చెప్పి బోధించగల సామర్థ్యం గలవి పురాణాలే. ఇట్టి పురాణాల్లో భాగవతానికి ప్రత్యేక స్థానం కలదు. దీని కర్త వ్యాసమహర్షి. వక్త శుకయోగి, శ్రోత పరమ భాగవత శ్రేష్ఠుడైన పరీక్షిత్తు.

వేద విహిత ధర్మాలు దెల్పుచు, భారతాఖ్యానం రచించినప్పటికీ, అశాంతికి లోనైన వ్యాసుణ్ణి ఊరడిస్తూ నారదుడు ఇలా అంటాడు.

ఉ॥ "అంచితమైన ధర్మచయ మంతయు చెప్పితి విందులోన నీ
వించుక గాని విష్ణుకథలేర్పడ జెప్పవు ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే? గుణ విశేషము లెన్నిన గాక నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరికోరి నుతింపమి ఆర్య పూజితా" (1-39 భాగవతం)

తెలివి తేటలు చూడు మనుట కంటే, హృదయశుద్ధి గమనింపుమనుటయే గొప్ప. కేవలం ధర్మబోధన గాక భక్త కథనంలోనే శాంతియున్నదనుట తెల్లము. ఇట్టి నారద సందేశాను సారము వ్యాసుడు భాగవతం రచించి శాంతి సంధానుడైనాడు. ఆ నారదుడే...

కం॥ "నిగములు వేము చదివిన
సుగమంబులు గావు, భక్తి సుభగవతమున్
సుగమంబు భాగవతమను
నిగమంబు పఠింప ముక్తి నివసనము బుధా!"

అంటూ భాగవత పఠనం పునర్జన్మ రాహిత్య కారణంగా పేర్కొన్నాడు.

(పోతన భాగవతం – తి.తి.దే ప్రచురణ)

వ్యాస భాగవతాన్ని ఇంచుమించు భారతదేశంలో అన్ని భాషలలో కూడా అనువదించారు. వరదరాజు అయ్యంగారు తమిళంలో విశిష్టాద్వైత సాంప్రదాయానుగుణంగా రచించాడు. చాటు

విఠలనాథుడు కన్నడంలో భామినీ షట్పదీ వృత్తాలతో సంగ్రహంగా రచించారు. ఎజుత్తచ్చన్ మళయాలంలో కొన్ని స్కంధాలు మాత్రం రచించాడు. ఏకాత్రమనాథుడు అనే మహాభక్తుడు మహారాష్ట్రంలో కీర్తన సదృశాలైన పద్యాలతో రచించి పేరు గాంచాడు. గుజరాతి భాషలో రత్నేశ్వరుడు అనే కవి సంక్షిప్తీకరించాడు. జగన్నాథదాసు ఒరియా భాషలో వంగదేశ వైష్ణవ సంప్రదాయానుసారంగా అనువదించాడు. అంతగా ప్రచారానికి నోచుకోక పోయినప్పటికీ బెంగాలీ భాషలో మాలధార దాసు రచించాడు. శంకరదేవుడు అస్సామీ భాషలో అనువదించాడు. సూరదాసు "సూరసాగర్" అనే పేరుతో హిందీభాషలో కృష్ణకథా ప్రియత్వం చాటుతూ రచించాడు. అలాగే సదాసఖిపాల్ అనే కవి భాగవతం ఆమూలాగ్రంగా గద్యానువాదం చేశాడు.

ఎవరెన్ని రీతులుగా ఏఏ భాషలలో రచించినప్పటికీ తెలుగులో పోతన అనువాదంతో ధీటురాగల గ్రంథం మరొక్కటి లేదు. పోతన భాగవతం మాధుర్య గుణ భూషితమై, భక్తి తాదాత్మ్యాన్ని ఆత్మగా గలదియై ఉన్నది. ఈ విధంగా భాగవతం భారతజాతిని భక్తితో కుదిపి వేసినది అనుటలో అతిశయోక్తి లేదు.

భాగవతంలో శక్తివంతమైన భాగం శ్రీకృష్ణ చరితం. శ్రీకృష్ణుని జీవితాన్ని సంతరించడంలో భాగవతం ఉత్తమ మానవున్ని దివ్యునిగా చేయుట కాదు, దివ్యున్ని మానవునిగా సమకూర్చింది. అత్యుత్తమ స్థాయిలో కుమారునిగా, క్రీడాశక్తునిగా, వీరుడుగా, దుష్టశిక్షకునిగా, వైదిక దైవములందు సౌమ్యునిగా, రాజతంత్రజ్ఞునిగా, సాంఘిక మత ప్రవర్తకునిగా శ్రీకృష్ణున్ని భాగవతం ప్రదర్శించింది. దేవునియొక్క విశేషాలు అందునా ఎక్కువగా విష్ణువు అనబడే శ్రీకృష్ణావతారతత్త్వం చెప్పడానికి వ్యాసునిచే భాగవతం వ్రాయబడిందనడంలో సందేహం లేదు. అయితే అవతార ప్రసంగం ఎందుకు కల్పించబడింది? ఆ అవతార రహస్యం ఏమిటి? అనేది తెలుసుకుంటే తప్ప భాగవత వైశిష్ట్యం, అందులో ప్రతిపాదింపబడిన పరమాత్మ తత్త్వం అర్థం కాదు.

స్వయంప్రకాశకబ్రహ్మానంద స్వామి ఇలా అంటారు. "దేనికీ కర్తగాక, ఎట్టి మార్పులు లేకుండా ఉండేది పరమాత్మ. ఈ పరమాత్మతత్త్వం తప్ప అనంత విశ్వంలో మరొకటి లేదు. నామాలకి, రూపాలకు గుణాతీతుడైన పరమాత్మ లోక రక్షణార్థం మాయా, మనుష రూపంలో ఆవిర్భవించాడనీ, అతని లీలలే అవతార విశేషాలని భాగవతంలో తెలియజేయబడింది. పరమాత్మకు

లోకులవలె సంసారాన్ని అంటగట్టి, జనన మరణాదులు, శత్రుత్వం, మిత్రత్వం, సుఖాలు, దు:ఖాలు, శోకమోహాలు, దయా కాఠిన్యాలు అంటించడం తప్పు. అలా చేయడం వేద విరుద్ధం. కర్మబద్ధులైన జీవుల మధ్య కొందరు పూర్వజన్మ పుణ్యాన ప్రజ్ఞ ఎక్కువ కలవారుగా ఉంటారు. ఇలాంటి విశిష్ట జ్ఞానైశ్వర్యం కలవారు తదనంతర కాలంలో భగవంతుని అవతారాలుగా భావించబడి పూజలు అందుకుంటారు''

భాగవతంలోని అనేక ఉపాఖ్యానాలు చాలా స్పష్టంగా అందిస్తున్న ఆదర్శాన్ని ఒంటబట్టించుకోవడంలో కూడా చాలా ప్రయోజనం కలదు. జీవన్ముక్తుడు కావలసిన భక్తుడు వయస్సు, లింగం, వర్ణాదులతో నిమిత్తం లేకుండా భగవంతుని యొక్క అనుగ్రహం పొందవచ్చునని భాగవతంలోని ధ్రువోపాఖ్యానం, రుక్మిణీ కల్యాణం అనే ఉపాఖ్యానాలు సాక్ష్యం ఇస్తున్నాయి. శరీర సంపుటీకరణ విషయాన్ని పురంజనోపాఖ్యానం తెలియజేస్తున్నది. కొన్ని జన్మలు గడచిపోయినా కర్మ తొలగిపోయి ముక్తి లభిస్తుందనే విషయాన్ని జడభరతోపాఖ్యానం తెలుపుతుంది. భగవంతుడి నామాన్ని ఉచ్చరించడం భవతారకమని అజామిళోపాఖ్యానం ద్వారా తెలుస్తుంది. పుత్రులు, మిగతా కుటుంబ సభ్యుల సంబంధాల గురించి చిత్రకేతోపాఖ్యానం వివరిస్తున్నది. అలాగే జనన మరణాలు, దు:ఖ కారణాలనే విషయాన్ని సుయజ్ఞోపాఖ్యానం తెలియజేస్తున్నది. అహంకారాన్ని అణచివేయాలని, నీతిని ప్రతిష్ఠింపచేయాలనే విషయాన్ని అంబరీషోపాఖ్యానం ప్రకటిస్తున్నది. పూర్వజన్మ చెడువాసనల వల్ల కలిగిన దరిద్రరూపం నుండి భగవంతున్ని దర్శించి ఆయన స్పర్శచేత విముక్తి లభిస్తుందని కుచేలోపాఖ్యానం తెలియజేస్తుంది. సంపూర్ణ శరణాగతి భక్తితో భగవంతున్ని వేడుకోవడంతో ఆపదల నుండి బయటపడవచ్చునని గజేంద్రమోక్షం కథ ద్వారా తెలుస్తున్నది. సంప్రదాయం విశ్వసించే వారి మేడల్లోనే కాకుండా భక్తితో కొలిచే పూరి గుడిసెల్లో కూడా భాగవతం పూజలందుకుంటోంది అంటే భాగవతం యొక్క గొప్పతనం అలాంటిది.

“గుడులు కట్టించె కంచర్ల గోపరాజు
రాగములు కూర్చె కాకర్ల త్యాగరాజు
పుణ్యకృతి చెప్పె బమ్మెర పోతరాజు
రాజులీ ముప్వురును భక్తి రాజ్యమునకు” అని కరుణశ్రీగారన్నట్లు కంచర్ల గోపన్న

అనే భక్తుడు కొండల్లో, గుట్టల్లో శ్రీరామునికి గుడి కట్టించాడు. బమ్మెర పోతన భాగవతం రచించి తెలుగు వారి గుండెల్లో భక్తితో శ్రీకృష్ణునికి అనేకమైన మందిరాలు నిర్మించాడు. త్యాగయ్య దశరథనందున్ని తన తంబురా తీగలపై ఊరేగించాడు. ఆడంబరాలకు వెళ్ళని రాజు పోతరాజుగారు, అహంకారాన్ని తనదగ్గరకు కూడా రానీయని పోతరాజు, అసలు రాజ్యమే లేని రాజు పోతరాజు, రాజభోగాలను ఆశించకుండా తన కవిత్వాన్ని దైవాంకితం చేసిన కవిరాజు పోతన. అయన 'బాలరసాల సాల' మధుపల్లవమైన ఊయలపై 'కరుణా పయోనిధున్ని' ఊయలు ఊగించాడు. అంతటి గొప్ప భక్తకవి, సహజకవి పోతనామాత్యుడు. పోతనపై కోపంతో కొంతమంది రాజులు భాగవతాన్ని భూమిలో పూడ్చిపెట్టినా 'బాల రసాల సాలయై' ఆ మహాగ్రంథం పైకి వచ్చినది. అందుకే చాలామంది సాహితీవేత్తలు ఆ కృష్ణుడు పోతన రచించిన భాగవతం వదలి వెళ్ళడానికి ఇష్టపడలేదు అంటారు.

ఆకాశంలోని ఇంద్రజాలం లాగా, తెలుగు ప్రజల ప్రతి ఇంట్లోనూ పోతనామాత్యులు రచించిన భాగవతం ఉంటుంది. "ఇందు గలడందు లేడని సందేహము వలదు" అన్నట్లు అన్నిచోట్లా పోతనగారి భాగవతమే కనబడుతుంది. ఏమిటో ఇది విచిత్రమో, కలయో లేక కృష్ణ పరమాత్మ యొక్క వైష్ణవ మాయలాగానో వుంది.

శుకమహర్షి చేసిన భాగవత ప్రవచనమును పరీక్షిత్తు మహారాజు ఏడు రోజులు భక్తితో విన్నాడు. తనకు మరణం తప్పదని తెలుసుకున్న పరీక్షిత్తు భాగవతం అంతా విని దాని ఫలితం ఏమిటో తెలుసుకున్నాడు. ఆ ఫలితాన్ని తెలుసుకొని గొప్ప జ్ఞానంతో ఈ విధంగా పలికాడు. "ఈ శరీరం చనిపోతుంది. కానీ నాకు బెంగలేదు. **ఆత్మకు మరణం లేదని, శరీరం మాత్రమే శిథిలమవుతుందన్న** సత్యాన్ని తెలుసుకున్నానన్నాడు.

నేను అనేక రకాల యజ్ఞాలు చేసినా, అనేక రకాల మంచి పనులు చేసినా, మునులు లాగా తపస్సు చేసినా, ధనస్సు పట్టుకొని వీరుని లాగా దేవతల పక్షాన నిలబడి యుద్ధం చేసినా, ఇలాంటివి మంచి పనులు ఎన్ని చేసినా కూడా నా శరీరం పడిపోతుంది అని పరీక్షిత్తు అన్నాడు. ఎవని శరీరం అయినా పడిపోవలసినదే కానీ భ్రమతో నా శరీరం పడదు అని అసత్యముతో, భయంతో జీవిస్తుంటాము, ఈ భ్రమ వల్లనే లోకములో చేయకూడని పనులన్నింటిని చేయడానికి

పూనుకుంటాము.

ఏదైనా, ఎంత మంచిదైనా, ఎంత గొప్పదైనా, చివరకు ప్రాణం అయినా తన కాలం తీరాక వెళ్ళిపోతుంది. వెళ్ళి తీరాలి. వెళ్ళకుండా ఉండునది అది ఎప్పటికీ వెళ్ళదు. కావున శరీర **"భ్రాంతిని వదిలి ఆత్మ స్పృహతోటి ఎప్పటికీ వెళ్ళదు, చిరకాలం ఉంటుంది"** అన్న స్పృహతోటే ముందుకు సాగాలి. అలాగే నేను అనేది శరీరం అయితే చచ్చిపోతుంది. కావున ఉన్న సత్యవస్తువు అనే ఆత్మను పట్టుకుంటే మరణ భయం లేదు. ఈ మరణభయంతో సమస్తమైన అజ్ఞానం ఉంది. భయం ఉంది. కాబట్టి వీటిలో ఏది పట్టుకుంటావు అంటే సత్యమును పట్టుకోవాలి. సత్యమును పట్టుకోవడం అంత తేలికైన విషయం కాదు. భాగవతం తెలిసినవాడు, విన్నవాడు మాత్రమే తేలికగా సత్యమును పట్టుకొనగలడు. వ్యాసుడు భాగవతంలో సత్యవస్తువును పట్టుకొనేటట్లు ప్రతిపాదన చేశారు. ఎవరు భాగవతం చదువుతున్నారో, ఎవరు భాగవతం వింటున్నారో వారికి సత్యము పట్ల దృష్టి కలుగుతుంది. అలాంటి వారికి ఈశ్వరుని పట్ల భక్తి కలుగుతుంది. భగవంతుని పాదాలు పట్టుకున్నవాళ్ళు తెలిపే తరించారో ఇలాంటి కథలు భాగవతంలో చాలా ఉన్నాయి. అందుకే తెలుగువారికి భాగవతం చాలా ప్రీతికరం అయినది.

ఏడు రోజుల భాగవత ప్రవచనం విన్న పరీక్షిత్తుకు మరణం వచ్చింది. కానీ ఆ ఏడు రోజులు గడచి పోయిన తర్వాత "ఈ నా శరీరానికి మరణం వచ్చినా నాకు బెంగ లేదు ఇప్పుడు నేను ఆత్మగా నిలబడ్డాను" అని పరమ ధైర్యంతో అన్నాడు. ఆయన తెలుసుకున్న సత్యం తెలుసుకోలేక మనం కొన్ని కోట్ల జన్మలు ఈ విశ్వంపై తిరుగుతూనే ఉన్నాము. **"మహామాయా విశ్వంభ్రమియసి పరబ్రహ్మమహిషీ"** (సౌందర్యలహరి-17) అంటారు భగవత్పాదులు ఆదిశంకరాచార్యులు సౌందర్యలహరి అనే గ్రంథంలో. అంతా మాయని, ఆ మాయలో పడి తిరుగుతూనే ఉన్నామని తెలిపారు. ఇలాంటి గొప్ప సత్యమును భాగవతం తెలియజేస్తుంది. అందుకే భాగవతం అంతటి గొప్పతనం పొందినది.

ఇలాంటి భాగవతంను శుకబ్రహ్మ చెప్పారు. అందుకే పెద్దల ఇలా అంటారు.

**"నిగమ కల్పతరోర్గళితం శుక ముఖాదమృత ద్రవ సంయుతం!**

**పిబత భాగవతం రసమాలయం మహొరహో రసికాభువి భావుకా:"** అని.

భాగవతం వినేవాళ్ళు భాగవతం నేను వింటున్నాను అని చెపుతూ ఎప్పుడూ వినకూడదు. పిబత భాగవతం అంటే భాగవతంను తాగేయాలి. త్రాగడం ఎలా సాధ్యం. భాగవతంను త్రాగడం ఎలా? తాగడం నోటిపని, వినడం చెవి పని. కానీ నోటికి ఒక లక్షణం కలదు. నోరు తన పని చేస్తున్నప్పుడు మనసు బయటి విషయాలపై మళ్ళినప్పుడు కూడా నోరు తన పని తాను చేస్తుంది. నోటితో త్రాగేటువంటి వాటిలో ఏదైనా వ్యర్థం ఉన్నా కూడా నోరు కడుపులోకి పంపిస్తుంది. తాగాలనుకున్న పదార్థంలో తీసిపారేసేది ఉండదు. భాగవతం కూడా అంతే. ఇందులో తీసి పారేయవలసినది ఏదీ ఉండదు. అంతా తాగెయ్యాలి.

మహాభారతం మాదిరిగా భాగవతం కూడా మూడు దశలుగా విస్తరించింది. మొదటి దశ వేదవ్యాసుడిచేత రాయబడింది. రెండవదశలో శుకయోగీంద్రులచే పరీక్షిత్తు మహారాజుకు చెప్పబడింది. మూడవ దశలో సూతుని చేత శౌనకాది మహామునులకు చెప్పబడింది.

భాగవతము కేవలం భక్తి ప్రాధాన్యమైన గ్రంథం. ఇందులో వివిధ రకాల భక్తి మార్గాలను తెలియజేశాడు. అసలు భక్తి అంటే ఏమిటి? అనే విషయం కొన్ని వేల సం॥ల క్రితం వేదవ్యాసుల వారు భాగవతంలో తెలిపారు. అలాంటి భాగవతం మనకు చదవడానికి గానీ, వినడానికి గానీ సమయమూ, తీరిక లేవు. మనకు తెలిసినదే వేదము అని అజ్ఞానంతో ప్రవర్తిస్తాము. భక్తికి కావలసినది నిర్మలమైన మనస్సు, భగవంతుడి మీద విశ్వాసము. "నీవేతప్ప ఇతం పరంబెరుగ" అనే విధంగా భగవంతుడికి శరణాగతితో వేడుకోవడం ఇది భక్తి అంటే. ఆడంబరాలు, ఆర్భాటాల వల్ల భక్తి రాదు. భక్తికి ధనం అవసరం లేదు. అహంకారాన్ని వీడి భగవంతున్ని శరణు వేడుకోవడమే భక్తి. ఇలాంటి భక్తి గురించి భాగవతంలో అనేక ఉపకథల ద్వారా తెలియజేయబడింది.

భక్తి మనుషులలోనే కాదు జంతువులకు కూడా ఉంటుందని భాగవతంలోని గజేంద్రమోక్షం కథ ద్వారా పోతనామాత్యుడు తెలియజేశాడు. గజేంద్రుడు ఒక ఏనుగు. అది తన పరివారంతో అడవిలో విహరిస్తూ, మడుగులోకి దిగింది. అప్పుడు ఆ మడుగులోని మొసలి ఏనుగు కాలును పట్టుకొంది. ఈ రెండు జంతువులు వెయ్యి సం॥లు పోరాడాయి. మొసలి ధాటికి ఏనుగు తట్టుకోలేక పోయింది.

గజేంద్రుడు మొదట కొంత సందేహంతో 'కలదు కలండనెడి వాడు కలడో లేడో అనే

సందేహాన్ని వెలిబుచ్చాడు. సందేహం ఉంది అంటే సంపూర్ణమైన శరణాగతి కాదు. కాబట్టి భగవంతుడు కూడా స్పందించలేదు. చివరికి 'నీవేతప్ప ఇత: పరంబెరుంగ' అంటూ సంపూర్ణమైన శరణాగతితో శ్రీమహావిష్ణువును ప్రార్థించిన వెంటనే భార్యతో ఏకాంత మందిరంలో వినోదిస్తున్న శ్రీమహావిష్ణువు తన భార్యకు కారణాన్ని కూడా చెప్పకుండా, తన పరివారం వెంట లేకుండా వచ్చి ఆ గజరాజును కాపాడాడు. అంటే భగవంతుని దృష్టిలో భార్యకు కూడా లేని స్థానం భక్తునికి ఉంది. నీవు సంపూర్ణమైన శరణాగతితో భగవంతున్ని పిలిస్తే భగవంతుడు ఎక్కడ, ఎలాంటి పరిస్థితిలో ఉన్నప్పటికీ, భక్తునికోసం పరుగెత్తుకొని వస్తానడనడానికి ఈ గజేంద్రమోక్షం ఘట్టం ఉదాహరణ.

ఈ సంపూర్ణమైన శరణాగతి మానవులే కాదు జంతువులు కూడా శరణాగతితో పిలేస్తే శ్రీమన్నారాయణుడు వస్తాడని ఈ కథలోని సారాంశం.

### 1.1. స్కాంధ పురాణం :

భాగవతం గొప్పతనం గురించి స్కాంధ పురాణంలోని విష్ణుఖండంలో శ్రీ మహావిష్ణువు బ్రహ్మదేవునికి వివరించాడు. భాగవత పురాణం చాలా ప్రఖ్యాతమైనదని, దీనిని ఎవరైనా శ్రద్ధగా చదివితే నాకు మిక్కిలి సంతోషం కలిగిస్తుందని విష్ణువు తెలిపాడు. అంతేకాకుండా ఎవరైతే భాగవతం ప్రతిరోజు పఠిస్తారో వారికి కపిలగోవును దానం చేసిన ప్రతిఫలం కలుగుతుంది. భాగవతంలోని ఒక శ్లోకాన్ని పఠించినా, లేదా శ్లోకంలోని అర్ధభాగం పఠించినా, చివరకు ఒక పాదాన్ని పఠించినా వేయి గోవులను దానం చేసిన పుణ్యం వస్తుంది. భాగవతంలోని ఒక శ్లోకాన్ని ప్రతిరోజూ పఠిస్తే, అష్టాదశ పురాణాలు చదివిన ఫలితం కలుగుతుంది. శ్రీమహావిష్ణువు కథలు చదివినా, విన్నా వారి పాపాలు తొలగిపోతాయి. భాగవతాన్ని ఎవరైతే వారి ఇళ్ళలో ఉంచి ప్రతిరోజూ పూజిస్తారో వారికి ఏ పాపాలు అంటుకోవు. వీరికి కలి బాధలు కూడా రావు. భాగవతాన్ని ఎవరైతే ప్రతిరోజు అర్చిస్తారో వారిని దేవతలు కూడా అర్చిస్తారు. ఇంతటి గొప్పతనం భాగవతం కలిగి వుంది.

మానవుల ఇళ్ళల్లో భాగవతాన్ని పూజించినన్ని రోజులు వారి పితృదేవతలు ఎక్కడ ఉన్నా తేనె, నెయ్యి, పాలు, తియ్యని నీళ్ళు తాగుతారు. భాగవతం ఉండిన ఇంట్లోని వారు అనేక

సం॥లు వైకుంఠంలో నివసిస్తారు. ఎవరి ఇంట్లో అయితే భాగవతం ఉండదో వారిని యమధర్మరాజు తన పాశాలతో పీడిస్తాడు. భాగవతాన్ని చదివేవాడు మిగతా సర్వశాస్త్రాలు చదవక పోయినా ఫర్వాలేదు వీడికి ఎటువంటి హానీ జరుగదు.

భాగవతాన్ని ఎవరు చదువరో వారు చండాలురు. నన్ను (శ్రీమహావిష్ణువు) ఎవరైతే సంతృప్తి పరచాలనుకుంటారో వారు తమ వద్దనున్న ధనాన్ని దానంగా పంచి, ప్రతిరోజూ భాగవతాన్ని పారాయణం చేయాలి. కలియుగంలో భాగవతం ఎక్కడ ఉంటుందో, అక్కడ మిగతా దేవతలందరితో కలిసి నివసిస్తాను. భాగవతం ఉండే చోట సకల పుణ్యక్షేత్రాలు, నదులు, సరస్సులు, యజ్ఞాలు, సర్వ తీర్థాలు, సప్త నగరాలు (అయోధ్య, మధుర, మాయ(హరిద్వార్) కాశీ, కాంచీ, అవంతిక (ఉజ్జయిని), ద్వారక) పవిత్ర పర్వతాలు ఉంటాయి. మోక్షం కోరుకునేవారు, పాపాలను పోగొట్టుకోవాలనుకునేవారు, కీర్తి, జయం, ధర్మం కావాలనుకునేవారు ప్రతిరోజు భాగవత పురాణాన్ని ధర్మబుద్ధితో వినాలి లేదా పఠించాలి. అలాగే భాగవతాన్ని చదివినా, విన్నా పుణ్యంతోపాటు ఆయుష్షు, ఆరోగ్యం కూడా లభిస్తాయి. ఎవరైతే భాగవతాన్ని వినరో, విని కూడా సంతోషంగా ఉండరో అలాంటి వారు యముడి అధీనంలో ఉంటారు.

ఏకాదశినాడు భాగవతాన్ని పఠించనివాడు, విననివాడు మహాపాపాత్ముడు. భాగవతం రాయబడిన ఇంట్లో నేను ఉండి వారికి సకల ఐశ్వర్యాలు కలుగజేస్తాను. భాగవతం చదవడం వల్ల సకల పుణ్యనదుల్లో స్నానం చేసిన పుణ్యం కలుగుతుంది. భాగవతం పారాయణం చేయడం వల్ల నాలుగు ఆశ్రమ ధర్మాలలో ఉన్న సాధువులను సేవించిన పుణ్యం కలుగుతుంది.

భాగవతం వినబడే ప్రాంతానికి దూడను వెతుకుతూ వెళ్ళే ఆవులుగా శ్రీ మహావిష్ణువైన నేను వెళతాను. భాగవత కథల వల్ల సంతృప్తి పొందే వారిని, నా కథలు వినే వారిని, నా కథలు చదివే వారిని నేనెప్పుడూ విడిచి పెట్టను. భాగవత పురాణాన్ని చూసి కూడా భక్తితో నమస్కరించని వారు సంవత్సరంలో వారు సంపాదించినంత పుణ్యాన్ని పోగొట్టుకుంటారు. భాగవతాన్ని చూసి, నమస్కరించే వారిని చూసి నేను ఆనందపడతాను. దూరం నుండి భాగవతం కనపడగానే దగ్గరకు వెళ్ళి నమస్కరిస్తారో వారికి అశ్వమేధయాగం చేసిన పుణ్యం లభిస్తుంది. భాగవతాన్ని నిలబడి భక్తితో ఎవరు నమస్కరిస్తారో వారికి మంచి భార్యను, మంచి కుటుంబాన్ని, మంచి

సంపదను కలుగజేస్తాను. రాజోపచారాలతో భాగవతాన్ని పూజించి, పఠించి, వినిపిస్తారో వారికి నేను వశం అవుతాను. మంచి రోజులలోను, దేవతా ఉత్సవాలలలోనూ దానం చేసి, తర్వాత భాగవతాన్ని పూజించి, ధూప దీపాలతో అర్చించేవారు పతివ్రత భర్తను వశం చేసుకున్నట్లు మహావిష్ణువునైన నన్ను వశం చేసుకుంటారు. ప్రతిరోజూ భాగవతమును పఠించేవారికి సమస్త పుణ్య ఫలాలు లభిస్తాయి అని శ్రీమహావిష్ణువు తన కుమారుడైన బ్రహ్మదేవునికి భాగవతం గొప్పతనాన్ని తెలియజేశాడు.

### 1.2. పద్మపురాణం :

పూర్వం నైమిశారణ్యంలో శౌనక మహర్షి, సూత పౌరాణికుణ్ణి విష్ణుభక్తులందరూ భక్తి, జ్ఞాన, వైరాగ్యాల వల్ల మాయను తొలగించుకుంటున్నారు. అది ఏ విధంగా సాధ్యం, సాధారణంగా ఈ కలియుగంలోనివారు రాక్షసత్వంతో ఉంటారు, ఇలాంటి వారు ఆపదలలో తరించుటకు ఏమైనా ఉందా? వారిని కృష్ణున్ని చేరుటకు సాధనంగా ఏమైనా ఉందా? కోరిన సంపదలు ఇచ్చేది కల్పవృక్షం, కోరిన సుఖాలను ఇచ్చేది చింతామణి, యోగులకు వైకుంఠాన్ని ఇవ్వగల శక్తి, సద్గురువులకు మాత్రమే కలదు కదా అని ప్రార్థించాడు.

సూత మహర్షి సమాధానం చెబుతూ, కాలమనే నల్లత్రాచు సర్పముచే కరవబడిన సంసారికి సుఖాలను ఇచ్చేది శుకమహర్షి చెప్పిన భాగవతం. ఇది ఎన్నో జన్మల్లో పుణ్యం చేసిన వారికి మాత్రమే లభిస్తుంది.

పరీక్షిత్తుకు, భాగవత శ్రవణం వల్ల వచ్చిన మోక్షాన్ని చూసి, ఆశ్చర్యంతో బ్రహ్మ సత్య లోకంలో భాగవత కథను ఒకవైపు, మోక్షాన్ని ఇచ్చే సాధనాలను మరోవైపు త్రాసులో వుంచి తూకం వేయగా భాగవతమే బరువై తూగింది. భాగవతం శ్రీమహావిష్ణువు స్వరూపం. కాబట్టి భాగవతాన్ని చదివినా, విన్నా ఆయన నివాస స్థానం వైకుంఠప్రాప్తి కలుగుతుంది. భాగవతాన్ని భక్తితో ఏడురోజులపాటు పారాయణం చేస్తే, తప్పకుండా మోక్షం కలుగుతుంది.

ఒకసారి సనకసనందాదులు విశాల నగరానికి వచ్చిన నారదమహర్షిని చూసి, నీవెందుకు బాధపడుతూ వేగంగా ఎక్కడికో వెళ్ళిపోతున్నావు అని అడిగారు. దానికి సమాధానంగా నారదుడు భూలోకం చాలా గొప్పదని నేను అక్కడకు వెళ్ళాను. రామేశ్వరం, కాశీ, శ్రీరంగం, ప్రయాగ,

హరిద్వార, కురుక్షేత్రం, గోదావరి మొదలైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను దర్శించాను. భూలోకం అంతా తిరిగి వెదికినా అక్కడ సత్యం, ధర్మం లేవు. ప్రజలందరూ మందబుద్ధితో జీవిస్తున్నారు. అక్కడి ఇళ్ళల్లో ఆడవారిదే పెత్తనం, ఆడపిల్లల్ని కూడా అమ్ముకుంటున్నారు. అక్కడ యోగులు కానీ, జ్ఞానులు కానీ, సత్కర్మలు చేసేవారు లేరు. ఇంకో విచిత్రం ఏమిటంటే అక్కడ అన్నాన్ని కూడా అమ్ముకుంటున్నారు. ఇదంతా కలియుగ మహిమ అని చెప్పాడు.

యమునా నదీ తీరంలో నేను ఒక అద్భుతం చూశాను. అక్కడ యౌవ్వనవతి అయిన ఒక స్త్రీ కనపడింది. ఆమె పక్కన ఇద్దరు ముసలివారు చలనం లేకుండా పడిఉన్నారు. ఆ స్త్రీ ఆ ముసలివారికి సేవచేస్తూ, వారిలో చలనం కలిగించాలని ప్రయత్నం చేస్తున్నది. అలాంటి ఆమెను వందమంది స్త్రీలు సేవిస్తుండగా, ఆమె వద్దకు వెళ్ళి నేను ఆశ్చర్యంతో వివరాలు అడిగాను ఆమెను. ఆమె తన పూర్వపు కథను ఈ విధంగా చెప్పింది. "ఓ నారద మహర్షి! నా పేరు భక్తి, ఇక్కడ ఉన్న ఇద్దరు ముసలివారు జ్ఞానుడు, వైరాగ్యుడు అనే పుత్రులు. నాకు సేవ చేసే ఈ స్త్రీలు అందరూ భూమిమీద ఉండే గంగ, యమున మొదలైన నదులు. నేను ద్రావిడ దేశంలో పుట్టి, కర్నాటకలో పెరిగి, మహారాష్ట్రలో కొంతకాలం ఉండి, చివరకు ఘూర్జర దేశం చేరాను. నాకు ఎక్కడా శాంతి లేదు. ఈ స్థితిలో నా కుమారులకు దూరమయ్యాను. కొన్ని రోజులకు బృందావనం చేరగానే అక్కడున్న మహిమ వల్ల నాకు నూతన యౌవ్వనం వచ్చింది. కానీ నా బిడ్డలు మాత్రం ముసలివారు అయ్యారు. కాబట్టి నారదా నువ్వు యోగివి, బుద్ధిమంతుడివి కదా, మేము ఈ స్థితికి రావడానికి కారణం ఏమని అడగగా", నేను నా దివ్య దృష్టితో అంతా చూసి ఇలా చెప్పాను. ఈ కలికాలం చాలా చెడ్డది. కలి ప్రవేశించగానే తపస్సు చేసే వారు, యోగులు, సదాచారం అన్నీ లోపించాయి. అందువల్ల జనులందరూ పాపాత్ములై రాక్షసుల వలె దుర్మార్గాలు చేస్తున్నారు. అందుకే భూదేవి భారం మోయలేకపోతోంది, ఆదిశేషునికి కూడా భూభారం మరింత ఎక్కువైనది, కాబట్టి ఓ భక్తీ నిన్ను, నీ పుత్రులైన జ్ఞాన, వైరాగ్యాలను కలియుగంలో ఎవ్వరూ పట్టించుకోవడం లేదు". ఈ బృందావనం శ్రీకృష్ణుని యొక్క పరమ భక్తితో నిండిపోయినది కనుక నీవు మారిపోయావు. నీ కుమారులను ఎవ్వరూ తెలుసు కోవాలని ప్రయత్నం చేయకపోవడం వల్ల ముసలివారు అయ్యారు. శ్రీకృష్ణుడు భూలోకం వదిలిపెట్టి ఈ వైకుంఠాన్ని చేరగా కలి భూలోకంలో

ప్రవేశించాడు. కలియుగంలో ఇంక తపస్సులు, యజ్ఞాలు, యాగాలు, జ్ఞాన వైరాగ్యాలకు స్థానం లేదు. నారాయణుడి నామాన్ని స్మరించడం వల్ల మోక్షాన్ని పొందుతారు. కలియుగంలో ధర్మం వృద్ధిచెందాలంటే బ్రాహ్మణులు ఇంటింటా భాగవతం చదవాలి. విష్ణుభక్తి ఈ లోకంలో తగ్గిపోవడం వల్ల ఎవరిని నిందించినా ప్రయోజనం లేదు. ఇదంతా కలియుగ ధర్మం. దీన్నంతటినీ బృందావనంలో ఉండే కృష్ణుడే చక్కబరుస్తాడు.

ఓ భక్తీ! నీవు ఎందుకు విచారించడం, శ్రీకృష్ణుని పాదపద్మాలను స్మరించడం వల్ల నీ దు:ఖాలు అన్నీ తొలగిపోతాయి. పూర్వం కౌరవులు ద్రౌపది వస్త్రాలను హరించే ప్రయత్నం చేస్తుండగా శ్రీకృష్ణుడు ద్రౌపది మానాన్ని కాపాడాడు కదా? అలాంటిది భక్తివి నీవు, నీలాంటి భక్తి అంటే కృష్ణునునికి మక్కువ ఎక్కువ. కలియుగంలో ప్రధానమైనది భక్తి మార్గమే. కలికాలం నాస్తికులచే పీడించడం వల్ల ముక్తి వైకుంఠాన్ని చేరింది. కాబట్టి భక్తీ నువ్వు పిలిస్తే కచ్చితంగా ముక్తి భూలోకానికి వస్తుంది. నీ కుమారులైన జ్ఞానుడు, వైరాగ్యుడు కలియుగంలో కలిచే పీడింపబడి ముసలివారు అయినారు. విచారం మాని ఈ ఇద్దరినీ నీవే పోషించు. ఒక విధంగా చూస్తే కలియుగం చాలా గొప్పది. మానవులు ఎంత పాపాత్ములైనా నీ భక్తి వల్ల కృష్ణమందిరంలోకి అడుగు పెడుతున్నారు. తమ మనసులో భక్తి ఉండే వారికి ఆపదలు ఉండవు అని చెప్పి నారదుడు భక్తి కుమారులను తన చేతితో తాకి, ఓ జ్ఞానుడా, వైరాగ్యుడా అని వారి చెవుల వద్ద గట్టిగా అరచి వారిని మేల్కొలిపినాడు.

వేదాల వల్ల భగవద్గీత వల్ల వారు బలవంతంగా నిద్రలేచిన ముసలివారైన జ్ఞానుడు, వైరాగ్యుడు కొంతసేపటికి వారు నిద్రలోకి దిగారు. ఆ సమయంలో నారదుడు దిక్కు తోచక నారాయణ మంత్రాన్ని స్మరించాడు. అప్పుడు “నీ ప్రయత్నం ఫలిస్తుంది. నీవు సత్కర్మలు ఆచరించు” అంటూ నారదునితో ఆకాశవాణి పలికింది. ఎలాంటి సత్కర్మలు చేస్తే ఆ ఇద్దరూ తిరిగి మేల్కొంటారని నారదుడు ఆలోచిస్తూ అనేక క్షేత్రాలు తిరుగుతూ చివరకు బదరీక్షేత్రం చేరాడు. అక్కడ జ్ఞానుడు, వైరాగ్యుడు మేల్కొనే సత్కర్మల కోసం తపస్సు చేయాలనుకున్నాడు. ఇంతలోనే ఆ ప్రాంతంలో సనకసనందాదులు అనే బ్రహ్మచారులు ఎదురుపడ్డారు. నారదుడు వారిని ప్రార్థించి జ్ఞానవైరాగ్యాల గురించి తెలిపాడు. వీరిని మేల్కొలిపే సత్కర్మలు తెలుపమన్నాడు. అప్పుడు

సనకసనందాదులు భాగవతం గొప్పతనాన్ని వివరిస్తూ అన్ని యజ్ఞాలలోకెల్లా జ్ఞానయజ్ఞం గొప్పది. జ్ఞానయజ్ఞం అనగా భాగవతం మాటిమాటికి పఠించడమ. భక్తి, జ్ఞాన వైరాగ్యాలకు కలిగిన కష్టం తొలగిపోయి భక్తికి సుఖం కలుగుతుంది. భాగవతాన్ని చదవడం వల్ల సకల పాపాలు తొలగిపోతాయి.

సమస్త వేదాంతాల్లోని సారం ఈ భాగవతం. భాగవత శ్రవణం మొదటి నుండి చివరి దాకా సారవంతమైంది, అలాంటి భాగవతాన్ని ఆస్వాదించకపోతే ప్రత్యేక ఫలం దొరకదు. చెరుకుకు పై నుంచి కింది వరకు తీపి ఉంటుంది. దాన్ని ప్రత్యేకంగా తిన్నప్పుడే ఆ రుచి కలుగుతుంది అలాగే భాగవతాన్ని సంపూర్తిగా వింటే గొప్ప ఫలితం లభిస్తుంది. ఆనందం అనే పేరుగల పవిత్రమైన ప్రదేశం గంగాద్వారం దగ్గర కలదు, అక్కడ అనేకమంది గొప్పవాళ్ళు ఉన్నారు. ఈభాగవత యజ్ఞాన్ని అక్కడ నిర్వహిస్తే జ్ఞానవైరాగ్యాలతో పాటు భక్తి కూడా అక్కడకు వస్తుంది అని ఉపదేశించారు.

నారదుడు, సనత్కుమారాది మునులు ఆ పవిత్ర స్థలం చేరారు. వీరితో పాటు విష్ణుభక్తులు, వసిష్ఠుడు, భృగువు మొదలైన మునులు వారి గణంతో పాటు అక్కడకు వచ్చారు. వేదవేదాంతాలు, మంత్రతంత్రాలు తమ రూపం ధరించి ఆనందతీర్థం చేరుకున్నారు. గంగ మొదలైన నదులు అనేక పుణ్యక్షేత్రాలు భాగవతం వినడం కోసం అక్కడికి వచ్చాయి. దేవతలు, గంధర్వులు వచ్చారు. రాక్షసులను వెంటబెట్టుకొని శుక్రాచార్యుడు కూడా భాగవత శ్రవణానికి వచ్చాడు.

నారదుడు భాగవత ప్రవచనం చేస్తున్నాడు. దేవతలు, ఋషులు, పుణ్యతీర్థాలు, విద్యలు, నాలుగు దిక్కులలో కూర్చున్నారు. ఎంతో ఆనందంతో జయజయధ్వానాలతో సభ మారుమ్రోగిపోయింది. ఆ ప్రాంతం అంతా పూలవాన కురిసింది. ఆక్కడకు వచ్చిన కొందరు భాగవతం గొప్పతనం వివరించారు. వారు అందరూ కూడా భాగవతం ఒక్కటే మోక్షశాస్త్రం అని భాగవతాన్ని పొగిడారు. వేదం, పురుషసూక్తం, శాస్త్రం, ద్వాదశాక్షరమంత్రం అన్నీ కూడా భాగవతమే. మరణానికి దగ్గరగా ఉండే వాళ్ళు భాగవతాన్ని స్మరిస్తే వైకుంఠం పొంది ముక్తి లభించి విష్ణుసాయిజ్యం లభిస్తుంది.

ఈ విధంగా ఏడురోజుల పాటు నారదుడు చేసిన భాగవత ప్రవచనాన్ని అందరూ భక్తితో

విన్నారు. ఈ ప్రవచనాన్ని భక్తి తన కుమారులు జ్ఞానుడు, వైరాగ్యులతో వచ్చి వినింది. ఇలాంటి గొప్ప భాగవతంలో శ్రీమహావిష్ణువు తన తేజస్సును ప్రవేశపెట్టాడు. ఇలాంటి భాగవత శ్రవణం వల్ల భక్తి, జ్ఞానుడు, వైరాగ్యుడు మారిపోయి క్రొత్తగా వచ్చారు. అలాంటప్పుడు భక్తి బ్రహ్మచేత అనుగ్రహింపబడినదై భాగవత శ్రవణంవల్ల కలి నాశనం అయినందు వల్ల నేను ఇప్పుడు ఎక్కడ ఉండాలి అని భక్తి, బ్రహ్మదేవుడిని వేడుకొంది. అప్పుడు ఆయన భక్తీ నీవు నారాయణ స్వరూపం కాబట్టి నిత్యమూ శ్రీమహావిష్ణువు భక్తుల హృదయాలలో నివసించడం వల్ల కలి దోషాలు నీకు అంటవు అని బ్రహ్మ చెప్పగా అప్పటి నుండి భక్తి బ్రహ్మ ఆజ్ఞానుసారం విష్ణుభక్తుల హృదయాల్లో కొలువైనందున ఈ భక్తికి మెచ్చి గోవిందుడు కూడా వైకుంఠాన్ని వదిలి భక్తుల హృదయాలలో నివాసం ఉంటున్నాడు.

నారదుడు చేసిన భాగవత యజ్ఞం వల్ల అక్కడ ఉన్న మునులు సమాధి స్థితిలోకి వెళ్ళగా వీరందరినీ చూసి నారదుడు భాగవతం కంటే ఈ లోకంలో ఆత్మశోధనకు పవిత్రమైనది ఏదీ లేదు. ఇంకా ఈ భాగవత యజ్ఞం వల్ల ఇక్కడ ఉన్న అనేకమంది పాపాత్ములు, పశుపక్ష్యాదులు కూడా తమ పాపాలను పోగొట్టుకున్నాయి. ఇలాంటి సర్వ పాపాలను పోగొట్టి మోక్షాన్ని ప్రసాదించే కథ మరొకటి లేదు అని నారదుడు తెలిపాడు.

గోకర్ణోపాఖ్యానంలో ఆత్మదేవుడు, తన కుమారుడు ధుంధుకారి చేసే దుర్మార్గాలను తలచుకొని బాధపడతాడు. తల్లిదండ్రుల ఆస్తిని అంతా ఖర్చుచేసి, అదీ చాలక దొంగతనం చేస్తూ విలాసాలతో దుర్మార్గంగా జీవిస్తున్నాడు ధుంధుకారి. ఇవన్నీ భరించలేని ఆత్మదేవుడు ప్రాణత్యాగం చేసుకోవాలని అడవికి బయలుదేరాడు, అప్పుడు గోకర్ణుడు వచ్చి తన తండ్రికి సంసారం నిస్సారం అని జ్ఞానాన్ని బోధించాడు. తండ్రీ నీ బాధలు తొలగి పోవాలంటే భాగవతాన్ని పారాయనం చెయ్యడం వల్ల నీవు ముక్తిని పొందుతావు అని గోకర్ణుడు తెలిపాడు. ఆత్మదేవుడు అడవుల్లో నివసిస్తూ భాగవతములోని దశమస్కంధాన్ని నిత్యం పఠిస్తూ నారాయణుడిని స్మరిస్తూ ఉండడం వల్ల ఆత్మదేవుడు శ్రీకృష్ణుడిలో ఐక్యం అయ్యాడు.

ధుంధుకారి దుర్మార్గాలు ఎక్కువయ్యాయి. తన తల్లిని చంపి బావిలో పడవేశాడు. అలాగే భోగకాంతలను ఇంట్లో పెట్టుకొని వారికి కావలసినవి అన్నీ దొంగతనం చేసి తెచ్చి పెట్టేవాడు.

ఆ వేశ్యలు ధుంధుకారిని చంపి గోతిలో పాతిపెట్టగా మరణానంతరం అతడు ప్రేతమై గాల్లో తిరుగుతూ ఉండేవాడు. ఈ విషయం అంతా సోదరుడైన గోకర్ణునికి తెలిసింది. సోదరుని విషయంలో చాలా బాధపడిపోయాడు. ధుంధుకారి భయంకర ప్రేతరూపంలో గోకర్ణుడిని కూడా భయపెట్టాడు. గోకర్ణుడు ఆ ప్రేతాత్మపై నీళ్ళు చల్లగా పాపాలు పోయినా, ప్రేతత్వం పోలేదు. దీని పోగొట్టడానికి గోకర్ణుడు ఎందరో మునులను ఉపాయాన్ని అడుగగా, ఎవరూ ఏమీ చెప్పలేకపోయారు.

గోకర్ణుడు తన యోగమహిమతో సూర్యున్ని ఆపి, నమస్కరించి ధుంధుకారి ప్రేతాత్మకు మోక్ష ఉపాయం చెప్పమనగా సూర్యుడు, ఏడు రోజుల పాటు భాగవతాన్ని పారాయణం చేయమని చెప్పాడు. గోకర్ణుడు భాగవతాన్ని పారాయణం చేయడం మొదలు పెట్టగా ధుంధుకారి ఏడు కణుపులతో ఉన్న వెదురు చెట్టులో దూరి భాగవతం వింటూ ఉన్నాడు. మొదటిరోజు సాయంకాలం భాగవత పారాయణ ప్రవచనం ముగిసింది. వెదురు చెట్టు కణుపు పగిలి పెద్ద శబ్దం వచ్చింది. అలా ఏడు రోజుల పాటు వెదురు చెట్టు ఒక్కో కణుపు పగిలి పోయాయి. గోకర్ణుడు భాగవతం మొత్తం పారాయణం చేయగా, ఈ కథను అంతా విన్న ధుంధుకారి ప్రేతత్వం పోయి తులసిమాలను, పీతాంబరాన్ని ధరించి, కవచ కుండలాలతో నీలమేఘశ్యాముడై వచ్చాడు.

గోకర్ణునుకి నమస్కరించి, నీవు చెప్పిన భాగవత కథల వల్ల నా ప్రేతత్వం పోయి విష్ణుతత్త్వం వచ్చింది. నీ భాగవత పారాయణం వల్ల నాకు వైకుంఠ ప్రాప్తి లభించిందని, విష్ణు విమానం ఎక్కి వైకుంఠానికి వెళ్ళిపోయాడు ధుంధుకారి. భాగవతం అంత గొప్పది.

భాద్రపద, ఆశ్వయిజ, కార్తీక, మార్గశిర, జేష్ఠ, శ్రావణ మాసాలలో భాగవత పారాయణం, భాగవత సప్తాహాలు చేయడానికి చాలా మంచి రోజులు. భాగవతం వినడం వల్ల సకల పాపాలు, సకల రోగాలు పోతాయి. దరిద్రులు ధనవంతులవుతారు, సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. ఇది భాగవతం యొక్క గొప్పతనం. దీన్ని విన్నా, చదివినా పాపాలు తొలగిపోయి, విష్ణుసాయిజ్యం పొంది మోక్షాన్ని పొందుతారు.

### 1.3. చతుశ్లోకీ భాగవతం :

మొదట శ్రీమన్నారాయణుడు భాగవతాన్ని హవగ్రీవ రూపంలో భాద్రపద మాసంలో ఉ

పదేశించాడు. తర్వాత బ్రహ్మ నారదునికి ఉపదేశించగా, నారదుడు కార్తీక మాసంలో వ్యాసునికి ఉపదేశించాడు. వ్యాసమహర్షి మార్గశిర మాసంలో శుకుడికి ఉపదేశించగా, శుకమహర్షి పరీక్షిత్తు మహారాజుకు మాఘమాసంలో ఉపదేశించారు. భాగవతం ఉపదేశ రూపమైన సత్యపరమైన గ్రంథం.

సృష్టి ఆరంభంలో బ్రహ్మ విష్ణువును ప్రార్థించగా విష్ణువు ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకో అనగా సర్వమూ నీవే ఉన్నావు, నీ మహిమను గురించి తెలుసుకునే మార్గాన్ని సూచించమని అడిగాడు. సృష్టిని సృష్టించే సమయంలో నాలో అహంకారం కలుగుతుంది, దీనిని తొలగించే మార్గం చెప్పమని బ్రహ్మ విష్ణువును – వేడుకొనగా, అప్పుడు శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవునికి చెప్పిన పరమార్థ బోధయే ఈ నాలుగు శ్లోకాలలో గల భాగవతం. ఈ నాలుగు శ్లోకాలు భాగవతానికి రహస్య నిధులు అవి

1. శ్లో॥ అహమేవాస మేవాగ్రే నాన్యద్య త్మదసత్పరమ్।
పశ్చాదహం యదేతచ్ఛయో వశిష్యేత సో స్మ్యహమ్॥

2. శ్లో॥ ఋతేర్థం యత్ప్రతీయేత, న ప్రతీయేత చాత్మని।
తద్విద్యా దాత్మనో మాయాం, యథా భాసోయథా తమ:॥

3. శ్లో॥ యథా మహాంతి భూతాని భూతే షూచ్చా వచే ష్వపి।
ప్రవిష్టాన్య ప్రవిష్టాని తథా తేషు న తేష్వహమ్॥

4. శ్లో॥ ఏతావదేవ జిజ్ఞాస్యం తత్త్వజిజ్ఞాసునాత్మన:।
అన్వయ వ్యతిరేకాభ్యాం యత్ స్యాత్ సర్వత్ర సర్వదా॥

(సంస్కృత భాగవతం – ద్వితీయ స్కందం, 33–36 శ్లోకాలు)

మొదటి శ్లోకంలో మొదట ఆత్మ మాత్రమే "నేను, నేను" అనే చైతన్యస్ఫురణతో ఉంది. దానికంటే ముందు ఉన్న దానికి స్థితే లేదు. ఈ విధంగా చూస్తే ఆత్మకన్నా భిన్నమైన మాయా

ప్రపంచం లేనేలేదు. జ్ఞాన స్వరూపమైన ఆత్మే శాశ్వతంగా మిగిలి ఉంది. అదే యదార్థ స్వరూపం అని నారాయణుడు బోధిస్తున్నాడు.

రెండవ శ్లోకంలో ఆత్మ కాకుండా మిగిలిన ఏ మాయ – అజ్ఞానులకు కలదో అది ఆత్మయందు లేనే లేదు. అజ్ఞాన దృష్టితో చూడటం వల్ల ఆత్మయందు మాయాపదార్థం కనిపిస్తుంది. వెలుగులోకి రాగానే చీకటి తొలగిపోయినట్లు, జ్ఞానం కలుగగానే మాయ తొలగిపోతుంది. అంటే జ్ఞానం కలిగే వరకు మాయ చేత కప్పబడి ఉంటాము. జ్ఞానం కలుగగానే అంతవరకూ ఉన్న మాయ అంతా భ్రాంతి అని తెలుస్తుందని తెలిపాడు.

మూడవ శ్లోకంలో ఆకాశంలో దానికంటే చిన్నదైన వాయువు, వాయువులో అగ్ని, అగ్నిలో నీరు అంతర్గతంగా ఉండినట్లు, 'నేను' అనేది అన్నింటిలోనూ ఉంటుంది. కానీ ఆత్మ విలీనం కాదు. పంచ భూతాలలో ఆకాశం అన్నింటికీ ఆధారమైనట్లు 'నేను' అనేది జగత్తు అంతా ఉంది కానీ, జగత్తు ఆధారంగా ఆత్మ ఉండడం లేదు. అన్నింటికీ ఆత్మే ఆధారం. జగత్తు ఉన్నప్పుడు ఆధారమైన ఆత్మ ఉంది. జగత్తు లేనప్పుడు కూడా ఆత్మ ఆకారం లేకుండా నిత్యమై ఉంది.

నాలుగవ శ్లోకంలో ఆత్మతత్వాన్ని తెలుసుకోవాలనే వారికే ఈ ఆత్మ అర్థమవుతుంది. జగత్తు ఉంది అని భ్రమలో ఉన్నప్పుడు కూడా ఆత్మ ఉంది. జ్ఞానదృష్టి కలిగినప్పుడు భ్రాంతి తొలగి అన్నింటికీ ఆధారంగా ఆత్మ ఉన్నదని అర్థమవుతుంది అని గోవిందుడు తెలిపాడు.

అన్ని దిక్కులకు వ్యాపించి అన్నింటికంటే పెద్దది అయినందువల్ల పరమాత్మ బ్రహ్మం అనబడుతుంది. సృష్టిలో వినాశం లేకుండా ఎప్పటికీ ఉండేది ఆత్మ ఒక్కటే. ఆత్మే చైతన్యం గల వస్తువు. అన్ని జీవుల యొక్క యదార్థ స్వరూపం లేకుండా ఆత్మ భ్రమ వల్ల మనం జీవాత్మ అయిన ప్రపంచాన్ని అజ్ఞానంతో ఆత్మగా భావిస్తున్నాం కానీ, జ్ఞానాన్ని సంపాదించినవాడు జగత్తు మొత్తాన్ని పరమాత్మ స్వరూపంగానే భావించి దర్శిస్తాడు.

ఆకాశం అన్నింటికీ అవకాశం ఇస్తుంది. ఇందులోనే వాయువు, అగ్ని, జలం, భూమి అనే భూతాలు ఏర్పడుతున్నాయి. అన్నింటిలోనూ ఆకాశతత్త్వం వ్యాపించే గుణం ఉంది కాబట్టి 'ఆకాశ శరీరం బ్రహ్మ' అని పరమాత్మకు శరీరంగా ఆకాశం కలదని వేదాలు చెపుతున్నాయి. శ్రీమహా విష్ణువును నీలమేఘశ్యాముడిగా పిలవడానికి కారణం ఆకాశ శరీరం కావడమే.

ఆత్మను ఈశ్వరుడు అంటారు. అనగా మాయను తెలిసినవాడు, మాయతో కూడి ఈ సృష్టిలోనే ఉండడం ఈశ్వరుని విలాసం. ఇలా ఉండడాన్నే దైవయోగం అంటారు. మాయను ఈశ్వరుడు అధిష్టించడం వల్ల మహత్తు పుడితే దీనివల్ల కాలం, గుణం పుట్టాయి. ఈ రెండింటి వల్ల మూడు గుణాలు పుట్టాయి. దీన్నే పరిణామం అంటున్నారు. ఇది జీవులకు తెలియకుండానే జరిగిపోతూ, ఈ మార్పుల వరుస కార్యకారణ సంబంధంగా ఏర్పడుతుంది. దీన్నే కర్మ అంటారు. దీనివల్లనే జీవులు జన్మిస్తున్నారు.

భగవంతుడు బ్రహ్మాండంలో అనేక రూపంలో ఉంటాడు. జ్ఞానులు ఈ సృష్టిలో భగవంతుని రూపాలను అనేక వాటితో దర్శిస్తున్నారు. ఈ రూపం కేవలం యోగ చేత మాత్రమే దర్శించగలరు. లోకం సమస్తం భగవంతుని అవయవాలే. జ్ఞానులకు ఈ విషయం అర్థమవుతుంది. కాబట్టి జగత్తు ఉన్నా లేకున్నా ఎల్లప్పుడూ ఉండేది ఆత్మ ఒక్కటే అనే విషయాన్ని జ్ఞానులు తెలుసుకుంటారు. జ్ఞానులకు జగత్తు అంతా మిథ్య, బ్రహ్మం మాత్రమే సత్యం అనే విషయాన్ని తెలసుకుంటారు. ఆత్మ నిత్యమైంది, స్వయం ప్రకాశమైనది, పరిణామం లేనిది, అన్నింటికి ఆధారంగా ఆత్మ ఉంటుంది.

ఈ సృష్టిరహస్య జ్ఞానమే 'చతుశ్లోకీ భాగవతం'గా వెలువడింది. ఈ జ్ఞానం మొదట సృష్టికర్త బ్రహ్మదేవునికి శ్రీమన్నారాయణ చేత బోధించబడింది. ఎందుకంటే అతనికి తెలియడం వల్ల ఈయనచే సృష్టించబడే అన్ని జీవులకు అలాంటి జ్ఞానం వస్తుంది. ఇదే భాగవత హృదయం, ఇదే జ్ఞానానందమయం. ఇలాంటి జ్ఞానాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నవాళ్ళు కైవల్యం పొందుతారు. వాళ్ళు పునర్జన్మ నుండి రక్షించబడుతారు. దు:ఖాలకు, అశాంతికి కారణం ఈ ఆత్మజ్ఞానం లేకపోవడమే. దివ్య స్థితిని పొందడానికే భాగవతాన్ని భక్తితో పఠించి, శ్రవణం చేయాలి.

### 1.4. భాగవతం – దశలక్షణాలు :

"సర్గశ్చాథ విసర్గశ్చ వృత్తి రక్షాంత రాణిచ ।
వంశో వంశాను చరితం సంస్థాహేతురపాశ్రయ:"॥

(12–7–9)

అష్టాదశ పురాణాలు అన్నీ పంచలక్షణాలు కలవి. కానీ భాగవత పురాణం మాత్రమే దశలక్షణాలను పేర్కొనింది. ఈ దశ లక్షణాలను వివరించడమే భాగవతం. ఈ దశ లక్షణాలే భాగవతాన్ని మిగతా పురాణాల కంటే విశిష్టంగా నిలిపింది.

1. సర్గం – సూక్ష్మ భూతాలను సృష్టించేది
2. విసర్గం – స్థూల పంచ మహాభూతాలను, జీవులను సృష్టించడం
3. వృత్తి – జీవుల జీవనానికి ఏర్పడిన సామాగ్రిని తయారు చేయడం
4. రక్ష – భగవంతుడు దశావతారాలతో దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించడం
5. అంతరాలు – మన్వంతరాలు
6. వంశం – రాజులు, ఋషుల యొక్క వంశాల గురించి తెలిపేది
7. వంశాను చరితం – రాజులు, ఋషుల యొక్క చరిత్రను తెలిపేది
8. సంస్థ – ప్రళయాన్ని గురించి తెలిపేది
9. హేతువు – సృష్టియొక్క సృష్టి – స్థితి – లయానికి కారణం అయినది
10. అపాశ్రయం – జీవ వృత్తులకు వ్యతిరేకమై ఉన్న పరబ్రహ్మం

### 1.5. భాగవతం – భాగవతుల ధర్మాలు :

శ్రీమన్నారాయణుని భక్తులు ఏవిధమైన ధర్మాలు కలిగి ఉండాలో భాగవతం తెలిపింది. అవి,

1. గురువులకు సేవ చేయడం
2. సమస్తమైన ఫలితాన్ని భగవంతునికి అర్పించడం
3. సజ్జనులతో స్నేహం చేయడం
4. శ్రీమహావిష్ణువు యొక్క విగ్రహారాధన చేయడం
5. శ్రీమన్నారాయణుని కథలను వినడం
6. వాసుదేవుడైన శ్రీకృష్ణున్ని మననం చేయడం
7. నారాయణుడి సంకీర్తనలను పాడడం
8. శ్రీమహావిష్ణువు పాదాలను ధ్యానించడం

9. శ్రీహరిని నిత్యం దర్శించడం

10. శ్రీహరికి ప్రతిరోజు పూజ చేయడం

### 1.6. భాగవతం - భగవంతుని స్వరూపం :

భాగవతంలో భగవంతుని స్వరూపం వివిధ స్కంధాలలో ఏఏ భాగం ఎక్కడ కలదో వివరించింది.

శ్లో॥ పదాది జాను పర్యంతం ప్రథమ: స్కంధ ఈరిత:।
తదూర్ధ్వం కటి పర్యంతం ద్వితీయ స్కంధ ఉచ్చత్॥
తృతీయో నాభిత్యుక్త శ్చతుర్థ ఉదయం స్మృతమ్।
పంచమో హృదయం ప్రోక్తం షష్ఠ: కంఠం సభాహుకమ్॥
సర్వలక్షణ సంయుక్తం సప్తమో ముఖ ముచ్చత్।
అష్టమశ్చక్షుషే విష్ణో: కపోలో భ్రకుటి: పర: ॥
దశమో బ్రహ్మరంధ్రశ్చ మన ఏకాదశ: స్మృత:।
ఆత్మాతు ద్వాదశ: స్కంద: శ్రీకృష్ణస్య ప్రకీర్తిత:॥

(కౌశిక సంహిత 25-8)

1. ప్రథమ స్కంధం - శ్రీకృష్ణుని పాదాల నుండి మోకాళ్ళ వరకు
2. ద్వితీయ స్కంధం - కటి (మొల) పర్యంతం
3. తృతీయ స్కంధం - బొడ్డు (నాభి)
4. చతుర్థ స్కంధం - ఉదర భాగం
5. పంచమ స్కంధం - హృదయం
6. షష్ఠమ స్కంధం - కంఠం
7. సప్తమ స్కంధం - ముఖం
8. అష్టమ స్కంధం - కన్నులు
9. నవమ స్కంధం - కనుబొమ్మలు, బుగ్గలు
10. దశమ స్కంధం - బ్రహ్మ రంధ్రం

11. ఏకాదశ స్కంధం - మనస్సు

12. ద్వాదశ స్కంధం - ఆత్మ

ఈ విధంగా భాగవతం గొప్పతనం గురించి అనేకమంది గొప్పవాళ్ళు తెలియజేశారు. "భాగవతం వింటే బాగవుతాం" అని భాగవతం తెలియజేసింది. భాగవతానాం చరితం భాగవతం అంటే భగవంతుని యొక్క భక్తుల చరిత్రయే భాగవతం.

# రెండవ అధ్యాయం

## 2. భాగవతం భక్తి తత్త్వం మార్గాలు

భక్త్యా భాగవతం జ్ఞేయం అంటే భక్తి వల్లనే భగవంతుని తత్త్వం బోధపడుతుంది. పోతనచే రచించబడిన భాగవతం భక్తికి భాండాగారం వంటిది. అందువల్ల పోతన భాగవతాన్ని శ్రీకైవల్య పద దృష్టితో రచించాడు. భాగవతంలో చెప్పబడిన వస్తువు శ్రీకృష్ణ పరబ్రహ్మం భాగవతం వల్ల పలశ్రుతి కైవల్యం పొందడం.

క॥ హరిమయము విశ్వమంతయు,
హరి విశ్వమయుండు, సంశయము పని లేదా
హరి మయము గాని ద్రవ్యము,
పరమాణువు లేదు వంశపావన వింటే (2-17 పోతన భాగవతము)

ఇదే పోతన భాగవత పరమార్థం. పోతన భాగవతాన్ని ధనం కోసం రచించలేదు. హరి విశ్వమంతా వ్యాపించి ఉన్నాడని తెలియజేయడానికి విశ్వశ్రేయస్సు కోసం రచించాడు.

తే॥ చేతులారంగ శివుని పూజింపడేని,
నోరు నొవ్వంగ హరికీర్తి నుడవడేని
దయము సత్యంబు లోనుగా దలపడేని
కలుగ నేటికి తల్లుల కడుపు చేటు (1-259- పోతన భాగవతము)

హరిని కీర్తించడం, హరున్ని పూజించడం దురితాలను దూరం చేస్తాయని, సుకృతాలను ఫలింపజేస్తాయని భాగవతం తెలియజేస్తుంది. శివకేశవుల భేదం చూడకుండా మన కీర్తన-అర్చన కొనసాగాలి. అవే మనకు భుక్తిని, ముక్తిని కలుగజేస్తాయి. పరమత సహనమే కాదు, పర దేవాతా సహనం, పరగురు సహనంకూడా ఉండాలని తెలియజేస్తుంది. సత్యాన్ని స్మరించని కొడుకు తల్లికి పుట్టడం దండుగని పెద్దలు అంటారు. ఇటువంటి వారి వల్ల భూమికే భారమని పోతన ఉద్దేశ్యం.

సేవించుట అను క్రియ వలన భక్తి అనుపదము ఏర్పడినది. సర్వేశ్వరున్ని మనసుతోనూ, వాక్కుల చేతను, కర్మల వలన సేవించుటను భక్తి అని అందురు. జనన మరణముల నుండి అమృతం ముక్తి కలిగించునట్లు, సకల బాధలనుండి భక్తి ముక్తి కలిగిస్తుంది. అమృతం అంటే మోక్షము అని

కూడా అర్థం కలదు. సుఖదు:ఖముల నుండి, జన్మ మృత్యువు నుండి మోక్షము కలిగించే అమృతం వలె భక్తి కూడా వీటినన్నింటిని తొలగించును.

హరివార్తలెఱుగు వారికి

హరి పదములు దలచువారిక కనవరతంబున్

హరి కథలు వినెడి వారికి

మరణాగత మోహసంభ్రమము లేదనఘా" (1-403, భాగవతం)

శ్రీమన్నారాయణుడిని భక్తితో కొలచిన వారికి, భక్తితో ఆయన కథలు విన్నవారికి ఆయన పాదాలను సేవించిన వారిని నరకం నుండి మోక్షము ప్రసాదిస్తాడని భాగవతం తెలుపుతున్నది. భగవంతునియందు సరియైన భక్తిగలవారికి మోక్షం కలుగుతుంది. ద్వేషమునకు విరోధి కావడం వల్లభక్తి రాగ స్వరూపమైనది భాగవతంలోని గోపికల భక్తి రాగరూపముగా ఉన్నది. కర్తచేత ప్రయత్నం చేయించునది, జ్ఞానము వలె భక్తి ఆచరణమైనది. అనంతుడైన పరమేశ్వరున్ని పొందటమే భక్తికి అనంతఫలమని భావం.

భక్తిని కలిగిన వారు కార్యసిద్ధిని పొంది, అమృతంతో సమానమైన తృప్తిని పొందుతారు. ఈ భక్తి వల్ల ఇంకేమి కోరుకోడు. దు:ఖించడమే. ఇతరులను ఎవ్వరినీ ద్వేషింపరు. దేన్నైనా పొందుటను సంతోషించడు అన్నింటిని సమానంగా చూస్తారు. ఈ భక్తి వల్లనే శాంతివంతుడయి ఆత్మయందే విహరించును. భక్తులు ధనమును, సంతానం, స్వర్గం, మోక్షమును కోరుకోకూడదు. కోరికలతో కూడిన భక్తి ఉత్తమ భక్తి కాదు. భగవంతుడు స్వయంగా వచ్చి మోక్షం ఇచ్చినను వాటిని ఇష్టపడకూడదని భాగవతం తెలుపుతున్నది.

జ్ఞానము, యోగము భక్తికి అంగములుగా భావించబడుట వల్ల భక్తి ముఖ్యమైనది. "భక్త్యా జానాతీతి చేన్న అభిజ్ఞాస్త్యా సామర్థ్యాన్" (భగవద్గీత-12వ అధ్యాయం,7వ శ్లోకం) అనే గీతలోని వాక్యమును బట్టి భక్తి మోక్ష సాధనమని తెలియును. భక్తి సర్వశ్రేష్టము కావడం చేత, కర్మ చేయు వారికంటే, జ్ఞానులకంటే, యోగుల కంటే భక్తుడు శ్రేష్టుడు, గొప్పవాడని భగవద్గీత తెలుపుతున్నది. అర్జునుడి ప్రశ్నల ద్వారా భగవంతుని సమాధానాల ద్వారా భగవద్గీతలో భక్తి యొక్క గొప్పదనం తెలియజేయబడింది. ఈశ్వరుని పట్ల పరమ ప్రేమను చూపుట భక్తి.

భక్తి లక్షణములను వర్ణించు సందర్భంలో నారదుడు ఇతర ఆచార్యుల అభిప్రాయాలను పేర్కొన్నాడు. పూజాదుల అనురాగమే భక్తి అని పరాశరముని తెలిపాడు. భగవంతుని కథలను వినుటయే భక్తి అని గర్గుడు తెలిపాడు. కానీ నారదుడు భక్తిని గురించి తెలుపుతూ ఈశ్వరుని యందు సమస్త విషయములను సమర్పించుటయే భక్తి అని తెలిపాడు. ఈశ్వరున్ని భోగ సుఖముల కొరకు ప్రార్థించే వాడు అర్థార్థి. జ్ఞానం కొరకు భగవంతున్ని ప్రార్థించేవాడు జిజ్ఞాసువు. కానీ ఆర్తుడు దు:ఖపూరితమైన హృదయంతో గజేంద్రుని వలె భగవంతుణ్ణి ప్రార్థించును.

సాధనా సమయంలో భగవంతునితో సంబంధంను స్థాపించుకొనుట వల్ల భక్తి ధృడమగును. ఈ స్థితిలో సాధన కూడా సహజంగానే సులభమగును. సాధనములో ప్రథమ అంతరాయం మాయ లేక అజ్ఞానము. ఈ మాయను సాధకుడు, కర్మత్యాగియును, త్రిగుణాతీతుడు తరింపగలడు.

సర్వ భూతములను తనవలె, తనను సర్వభూతముల వలె భావించుట ధర్మాచరణము. ఇట్టి ఆచరణయే భక్తిలోగల విశిష్టతను తెలియజేసింది. జ్ఞానమార్గమునకు, భక్తి మార్గమునకు పరస్పర సంబంధం లేదని ఈ ధర్మాచరణము తెలిపింది.

పురుషార్థ సాధనకు కర్మ, జ్ఞాన, భక్తి యోగములను శ్రీకృష్ణుడు ప్రతిపాదించాడు. వర్ణాశ్రమ ధర్మ రూపమైన కర్మయోగం ద్వారా అంత:కరణం శుద్ధి అగును. కానీ మానవులకు భగవంతుని కథలను వినుట ద్వారా భాగవత ధర్మములపై ఒక విధమైన శ్రద్ధ బయలుదేరును. ఈ శ్రద్ధయే భక్తి. అంత:కరణమును పరిశుద్ధం చేసుకొని, భగవంతుని ఆకారమును మనస్సులో నిలిపి ఏకాగ్రతతో ఆధ్యాత్మిక తత్త్వమును ధ్యానించుటయే భక్తి. యోగాభ్యాసములో మనసును స్వాధీన పరుచుకొన్న మానవులకు జ్ఞాన, భక్తి యోగములు సులభ సాధ్యములు. భక్తియోగం లేనిచో మనసుకు శాంతి ఉండదు. అనగా **జ్ఞానయోగ సంబంధం లేని భక్తి యోగము వల్ల ప్రయోజనం లేదు.** జ్ఞానాన్ని సంపాదించే సాధనముగా భక్తిని గ్రహించవలెను.

భక్తి యోగమున శ్రీకృష్ణుడు భక్తుడు ఇలా ఉండాలని నిర్వచించాడు.

"అద్వేష్టా సర్వ భూతానం మైత్ర: కరుణ ఏవచ।
నిర్మమో నిరహంకార: సమదు:ఖ సుఖ: క్షమీ॥
సంతుష్ట స్సతతం యోగీ యాతాత్మ ధృడ నిశ్చయ:।

మయ్యర్పిత మనోబుద్ధి ర్యోమద్భక్తస్సమే ప్రియ:"॥ (భగవద్గీత-12 అధ్యాయం, 8వ శ్లోకం)

సర్వ జీవుల యెడ ద్వేషం లేనివాడు, స్నేహ కరుణా భావాలు కలవాడు, అహంకారం లేనివాడు, కష్టసుఖములను సమానంగా భావించువాడు, సహనము, తృప్తి కలవాడు, యోగ యుక్తుడు, నాయందు భక్తి గల భక్తుడు నాకు ఇష్టమని కృష్ణభగవానుడు తెలిపెను. ఇంకా కోరికలు లేనివాడు, త్రికరణ శుద్ధి కలవాడు, కార్యావరణ యందు సమర్థుడు, ఎప్పుడు దిగులు చెందనివాడు అయిన భక్తులు అందరూ నాకు ఇష్టం అని తెలిపాడు. ఈ విధంగా ఆలోచనా పరుడై సత్యమును తెలిసినవాడు, స్వార్థరహితుడు, సర్వ ప్రియుడు, సమభావం కలవాడు, సేవాతత్పరుడు నా భక్తుడని గీతాచార్యుడు తెలిపెను.

నిజమైన భక్తులకు ఉన్న మంచి గుణాలలో సర్వాంతర్యామి అయిన పరమేశ్వరుని పూర్తి శరణాగతుడు అగుట, స్వార్థరాహిత్యము, కర్మఫలత్యాగం ముఖ్యమైనవి. వీటికి మూలమైనది స్వార్థ రాహిత్యము. ఈ స్వార్థ రాహిత్యము మానవులలో ఉంటే ప్రపంచంలో శాంతి సుఖములు కలుగును. ఈ భక్తి భావము, సమాన ప్రేమభావము, ప్రాచీన కాలంలోని ఋషులు వేదాలలోను, ఉపనిషత్తులలోను, బ్రహ్మసూత్రముల లోనూ, భగవద్గీతయందు వ్యక్తం చేశారు. "సర్వేజనా: సుఖినోభవంతు", "ఓంశాంతి: శాంతి: శాంతి:" అను మంగళకరమైన మాటలు పై వాటన్నింటిలోనూ, పురాణములలోనూ, భాగవతంలోనూ కనిపిస్తున్నాయి.

నిజమైన జ్ఞానము గలవానికి, ఆత్మజ్ఞానముగలవానికి భక్తి మార్గము కలుగును. జ్ఞానం, భక్తి వేర్వేరు కాదు అని ఆదిశంకరాచార్యులు లక్ష్మీనరసింహ స్తోత్రములో, భజగోవిందంలోని శ్లోకాలయందు తెలిపాడు. జ్ఞాన, భక్తి యోగాలలో ఏది మంచిది అన్న ప్రశ్న బాలునిది, అజ్ఞానులు భక్తి భావం చాలా ఉన్నతమైన సోపానమని జ్ఞానికి తెలియును. ఈభక్తి అనునది ధ్యాననిష్ట, తపస్సు కాదు. ఇది విష్ణురూపమైనది. ఇది విశ్వమానవ సోదరత్వము గలది.

"శ్రేయోహి జ్ఞాన మభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే।

ధ్యానాత్కర్మఫల త్యాగ స్త్యాగాచ్ఛాంతి రనంతరమ్"(భగవద్గీత- 4వ అధ్యాయం, 33వ శ్లోకం)

**- మూఢ అభ్యాసముకంటే జ్ఞానము గొప్పది. జ్ఞానము కంటే ధ్యానం గొప్పది. ధ్యానం కంటే కర్మఫలత్యాగము గొప్పది. త్యాగబుద్ధి వలన ప్రపంచమునకు ఆనందం చేకూరుతుందని భావం.** శ్రీమహావిష్ణువు రూపమును చూసి, ఆనంద పరవశులైనారనుటకు ప్రహ్లాదుడు,

భీష్ముడు, విభీషణుడు మొదలగు వారు ఉదాహరణ. వీరితోపాటు, భారత, భాగవత, రామాయణాలలో నారాయణుడిని సేవించిన భక్తులు ఎందరో కలరు.

విష్ణువు పట్ల సంపూర్ణమైన శరణాగతి కలిగి ఉన్నవాడు స్వార్థరహితుడు. అలాంటివాడు లోక కల్యాణం కోసం కర్మఫల త్యాగియై, పూర్తీ కర్మయోగిగా ఉండును. అలాంటి కర్మత్యాగి భగవంతునితో కూడి జీవించి ఆనందంగా ఉండును. ఎల్లప్పుడూ భగవంతుని నామమును భక్తితో స్మరించేవారు తమో, రజో, సత్త్వ గుణములు దాటి మోక్షమును పొందుదురు. ఈ భగవన్నామస్మరణ మోక్ష సాధనాలలో శ్రేష్టమైనది, సులభమైనది.

**శత్రువులు బాధించుచున్ననూ, మిత్రులు అపకారం చేసిననూ, ఎవరెన్ని విధాలుగా ఇబ్బది పెట్టినా, సహనంతో భగవంతుని నామాన్ని జపించాలి కానీ, వారిమీద దుర్బుద్ధితో నిజమైన భక్తులు ప్రవర్తించరాదు. భగవన్నామస్మరణలో సదా ఆనందం కలుగుతుంది. ఈ ఆనందంలో ఉన్నవారు మంచివారిలో మంచిని వర్ణించరు. చెడు వారిలో చెడును వర్ణించరు. అలాంటి భక్తులకు రాగద్వేషాలు ఉండవు. భక్తి వలన ప్రపంచమును వదిలి పరమాత్మను పట్టుకుంటారు.**

దైవస్మరణ  సుఖమును, గౌరవమును, శరీర సౌఖ్యమును సమకూర్చును. ధనవంతులైనను, దరిద్రులు అయినను, రోగులైనను, స్త్రీలైనను, పురుషులైనను, సన్యాసి అయినా, సంసారి అయినా పండితుడు అయినా, పామరుడైనా బంగారు సింహాసనంపై కూర్చున్న వారైనా, మట్టిదిబ్బలో కూర్చున్న వారైనా అనన్య భావంతో భగవంతుణ్ణి స్మరించనిచో సుఖమును పొందరు.

"పవిత్రానాయ సాధూనం వినాశాయ చదుష్కృతామ్

ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే"(భగవద్గీత- 4వ అధ్యాయం, 8వ శ్లోకం)

సజ్జనులను రక్షించుకొనేందుకు, దుర్మార్గులను శిక్షించుకొనుటకు, ధర్మమును నిలబెట్టుటకు భగవంతుడు ఆయా కాలములలో అవతరించుచుండెను కాబట్టి మానవులు ఏ జీవులను బాధపెట్టకుండా, తనని బాధపెట్టే వారికి భయపడకుండా, పరమాత్మున్ని నమ్మి నిర్భయంగా ఆనందంగా ఉండవలెను. బాధపెట్టు వారిని తిరిగి బాధపెడితే భగవంతుని సహాయం దూరమగును. అద్భుతాలను సృష్టించే భగవంతుడు పర్వతమును దుమ్ముగా చేయును. ధూళిని పర్వతముగా చేయును. సముద్రమును అందమైన

భూమిగా, భూమిని అందమైన సముద్రముగానూ మార్చును. గడ్డిపరకను వజ్రాయుధంగా చేయును. అదే వజ్రాయుధంను గడ్డిపరకగాను మార్చును. ఈ విధంగా ప్రకృతిని ఏ విధంగా అయినా చేయగల శక్తి భగవంతునికి కలదు.

భగవంతుని అనుగ్రహము మనపై ఉన్నచో ఎక్కడో పడిపోయిన వస్తువు కూడా లభించును. ఆయన అనుగ్రహము లేనిచో ఇంట్లో వస్తువు అయినా దూరం అగును. ఈశ్వరానుగ్రహం ఉన్నచో శకుంతల మాదిరి అడవిలో పారవేయబడిన శిశువు జీవించును, లేనిచో ఇంటిలో చక్కగా పోషించబడే శిశువు కూడా జీవించదు.

మంచు ఒకప్పుడు నీరుగాను, మరొక సమయంలో గడ్డగాను ఉన్నట్లు భగవంతుడు కూడా ఒకప్పుడు నిరాకారంగా, మరొకప్పుడు సాకరముగాను ఉండును. మనము రాజస, తామస గుణములలో ఉన్నప్పుడు దేవునికి నామరూపములను కల్పించి నిత్యమూ ఆయన నామస్మరణ చేస్తూ భక్తితో ఆరాధించుట వలన రాజస, తామస గుణముల వల్ల కలుగు దోషములను, బాధలను సులభంగా దాటగలము. మనము సాత్త్విక గుణముతో ఉన్నప్పుడు నిర్గుణ పరమాత్మను అనుభవ పూర్వకంగా దర్శించవచ్చు.

భగవంతుడు మనం చేయు పుణ్యాల వల్ల కాపాడుతాడని చేసే పాపాల వల్ల శిక్షిస్తాడని కొందరు భావిస్తారు. ఇంతేకానీ మనకు సుఖదు:ఖములను కలిగించే వాడు భగవంతుడని తెలుసుకోలేక పోతున్నారు. "కర్మయో నకులకు దేవత: కర్మయె సుఖదు:ఖములకు కారణమధిపా" అని భాగవతం చెప్పినట్లు కర్మదృష్టితో అయినా కర్మదేవత మనపై ఉన్నదని తెలుసుకోలేక పోతున్నాం. కాబట్టి స్వేచ్ఛా విహారులము కాకుండా పుణ్యపాప విచక్షణ జ్ఞానంతో ప్రవర్తించడం వల్ల క్రమముగా ఇంద్రియములు స్వాధీనం చేసుకుంటాము. దీని వల్ల నిర్గుణ స్వరూపమైన నిత్యానంద స్వరూపంను సాక్షాత్కారం చేసుకోగలుగుతాము.

అజ్ఞానముతో ఉన్న మానవులు అందరూ వారి మనోవృత్తులను అనుభవిస్తున్నారు. అనగా పాపములతో ఉన్నప్పుడు దు:ఖరూప వృత్తులను, పుణ్యంతో ఉన్నప్పుడు సుఖరూపమైన మనోవృత్తులను అనుభవిస్తుంటారు. **భక్తి జ్ఞానంచే కర్మరహితులైన మహాత్ములు మాత్రమే మనోవృత్తులకు అతీతంగా పరబ్రహ్మ సుఖమును అనుభవించుచున్నారు. మనస్సును దాటే వారికే భగవతత్త్వము తెలియును.**

భగవంతుడనగా, శాశ్వతమైన ఆనంద స్వరూపమును కలిగినవాడు. ఇలాంటి భగవంతుడు సమస్త జీవులు అందరిలోనూ వెలుగుచున్నాడు. అందువల్లనే భగవంతుని దర్శనము కావాలనుకునేవారు,

మోక్షం పొందాలనుకునేవారు, పూర్తి దు:ఖ నివృత్తి ఆనంద ప్రాప్తిని పొందదలిచినవారు ఆ భగవంతుని సర్వదా అనుగ్రహం వలన శాశ్వతమైన శాంతిని పొందుతారు.

**ప్రతిరోజు 'రామ రామ అని, శివ శివ' అని స్మరించడం భక్తి కాదు. అంతరంగంలో రాగద్వేషాలు, అహంకారము లేనివారై, సుఖదు:ఖాలకు, స్తుతి, నిందలకు చలించకుండా, భగవంతున్ని కీర్తించుట, ధ్యానించుట నిజమైన భక్తి.** ఇలాంటి భక్తిగలవారే భగవంతుని యొక్క మహిమలను, విశేషాలను అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారు. భగవంతుని మహిమలు తెలియకపోతే క్రమంగా భగవంతునిపై గల భక్తి విశ్వాసములు తొలగిపోతాయి. భక్తి, జ్ఞాన, వైరాగ్యములు కలవారికే భగవతత్త్వము తెలియును. కాబట్టి భక్తులైనవారు, మోక్షమును కోరుకునేవారు, సన్యాసులైనవారు దేనియందు కోరికలేని వారై, ధర్మాధర్మ విచారణలతో ఎల్లప్పుడూ భగవంతుని పూజించు చుండవలెను. దీనిచే భగవంతుని సాక్షాత్కారముతోపాటు, లోకంలో గొప్ప కీర్తి కూడా లభించును.

భూమిని నమ్మి సేద్యం చేయనిదే పంట పండదు కదా. యజమానికి నమ్మి సేవ చేయడం వల్ల సేవకునికి ధనం ఇస్తున్నారు. వ్యాపారస్తునికి మనం ధనం ఇవ్వడం వల్ల అతను మనకు వస్తువులు ఇస్తున్నాడు. భగవంతుడు ఆ విధంగానే చేయును

"అనన్యా శ్చింతయంతో మాం యేజనా! పర్యుపాసతే।
తేషాం నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహం॥

(భగవద్గీత–10వ అధ్యాయం, 10వ శ్లోకం)

సర్వధర్మ స్వరిత్యజ మామేకం శరణం ప్రజ
అహంత్వా సర్వ సాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ:॥"

(భగవద్గీత–10వ అధ్యాయం, 11వ శ్లోకం)

అనే భగవద్గీత శ్లోకంలో భగవానుడు కూడా ముందే నీవు నాకు సేవ చేయుము, తర్వాత నీకు నేను సేవ చేస్తానని, ఎల్లప్పుడు నన్ను శరణు పొంది ఉంటే నీ పాపములను పోగెట్టదనని తెలిపెను. అందువల్ల ప్రయత్నం లేనిదే దైవ కరుణ, మోక్షం కలుగవు.

ఎండతో బాధపడుతున్న మానవుడు నీటిలో మునగగానే చల్లబడుతున్నాడు. అలాగే సంసార దు:ఖములో ఉన్న మానవుడు భగవంతుణ్ణి ఆశ్రయించడం వల్ల దు:ఖములు అన్నింటినీ పోగొట్టును.

దేవున్ని పూజించుట, దేవుని సంకీర్తనలు పాడుట, జపధ్యానాలు చేయుట, మంచి గ్రంథములను నిత్యం పారాయణ చేయుట మొదలైన సత్కర్మలు చేయుట వల్ల భగవంతున్ని తొందరగా చేరవచ్చును.

పరమాత్మ అగు భగవంతుడు సమస్త ప్రాణులలోనూ నిగూఢంగా ఉండుట వలన అందరికీ కనపడలేదు. సూక్ష్మ దృష్టిగల జ్ఞానులు మాత్రమే ఏకాగ్రత బుద్ధితో ఆ పరమాత్మను చూచుచున్నారు. కనుక సూక్ష్మమైన ఏకాగ్ర బుద్ధికే పరబ్రహ్మ కనబడునని తెలుసుకోవాలి. పాపకర్మలు చేయకుండుట, పుణ్యకర్మలు నిష్కామబుద్ధితో నిగ్రమించుకోవడం, జప, ధ్యాన సంకీర్తనలు చేయుట మనశ్శుద్ధి, వాక్‌శుద్ధి కలుగుట భక్తి సాధనములు.

భగవంతున్ని మరచి పోవడం అన్ని తప్పులకంటే పెద్ద తప్పు అవుతుంది. తప్పులు చేసినచో వాటి ఫలము దు:ఖములు అనుభవించడం అని తెలుసుకోవాలి. **చేసిన తప్పులను సరిచూసుకోకుండా, పరులు చేసిన తప్పులను వెదకి చూపించుట భగవంతుని ధర్మమునకు వ్యతిరేకము.** "అద్వేష్టా సర్వ భూతానామ్" అనుట వలన ఇతరులపై ద్వేషము, క్రోధము, అసూయ కలిగి యుండుట తప్పు అవుతుంది. సర్వమూ దేవునిదై ఉండగా నాది, నావారు అని స్వార్థంగా ఉండుట దేవుని సొమ్మును దోచుకున్నట్లు అవుతుంది. **ఈ శరీరమే మనది కానప్పుడు శరీరం కంటే వేరైనవి మనవెట్లా అవుతాయి** కాబట్టి నిస్వార్థంతో భగవంతున్ని పూజించి సర్వమూ ఆయనకే అర్పించాలి.

దైవ చింతనలో ఉన్నప్పుడు రెండవ సంకల్పం ఏదైనా వచ్చుచున్నంత వరకు పరమాత్మను పూర్తిగా గ్రహించలేమని సాధకులు తెలుసుకోవాలి. దైవ చింతనతో, నామరూప ప్రపంచమంతా మిధ్యయని ధృడమైన వైరాగ్యంతో మనస్సును బాహ్య విషయములకు అంటనీయకుండా చేసుకోవడమే సాధకులు చేయవలసిన ముఖ్యమైన పని. కర్మలతో ఆనందించువారికి పాప దోషములు, అశాంతి, కలహములు వచ్చుచుండును. ఒక్క దైవ చింతనతోనే ఆనందించువారికి పుణ్యపాపములకు అతీతమైన బ్రహ్మానందం లభిస్తుంది.

దైవ చింతనలో తృప్తి లేదను వారి ఇంద్రియములు ప్రపంచంలో మిగతా విషయాలలో సుఖపడుటకు పరుగుపెడుతూ ఉంటుంది. ఇంద్రియములను నిగ్రహించలేని వారికి అనేక కష్టాలు రాక మానవు. దైవ చింతనలో ఉన్న వారికి అప్పుడప్పుడు కష్టాలు వచ్చి పోతుంటాయి. బాహ్య విషయములపై ఆసక్తి లేకుండా భగవంతుడిని ఒక్కడినే నమ్మి, ఆయన్నే భజించువారు నిస్సంశయంగా

సులభంగా అజ్ఞాన చీకటిని, సంసార దు:ఖమును తప్పకుండా దాటి పోగలరు.

ఎవని హృదయము నాతో బంధించబడినదో అంతటా, అందరిలోనూ అన్ని వేళలా సర్వ రూపములలో నన్ను ఎవరు చూస్తారో, అతడు, తన భక్తితో ఒక పవిత్రమైన స్త్రీ తన భర్తను వశం చేసుకున్నట్లు, నన్ను ఆ విధంగా భక్తుడు వశం చేసుకుంటాడు. అలాంటి భక్తుడే నా హృదయము, నేను అతని హృదయము అతడు నన్ను విడిచి ఉండలేడు, నేను అతన్ని ఉండలేనని భాగవతంలో శ్రీకృష్ణుడు తెలిపాడు.

నాకు తన చిత్తమును సమర్పించిన వాడు, నన్ను విడిచి బ్రహ్మదేవుని ఆధిపత్యం లభించినా సరే, దేవేంద్రుని రాజ్యం లభించినా సరే, సార్వభౌమ సామ్రాజ్యము లభించినా సరే, పాతాళ లోకాధిపత్యం లభించినా సరే, సమస్త యోగ సిద్ధులు వచ్చినా సరే, మోక్షము లభించినా సరే తీసుకోవడు. నా భక్తుడు నా సేవలోనే పరిపూర్ణంగా ఉంటాడు. అతడు నా సేవను విడిచి దేనినీ కోరుకోడు అని గీతలో భగవంతుడు తెలిపాడు.

జగత్తు అంతా ప్రకృతితో కూడుకొని ఉంది. హద్దుకు లోబడినది. కాబట్టి ఈ జగత్తును వర్ణించగలం. అనంతము, అపారము అలౌకికము నిరాకారము అయిన పరమాత్మ గురించి వర్ణించుట అసంభవము. అందువల్లే పరమాత్మను వేదములు, 'నేతి, నేతి' అని వర్ణించినవి. భగవంతుడు తన భక్తుల యోగక్షేమములు తానే చూచును. ఇంకా అతన్ని చేరశ్రీని అతనితో ఆటలాడును. భక్తుని పక్కనే కూర్చునే ఆహారము భుజించును. వారితోపాటు జీవించును.

మానవుడు తనకు అనుకూలమైన, సంసారిక భోగములు లభించినప్పుడు అది భగవంతుని దయవల్ల లభించినవని పొరపాటు పడుతుంటారు. భగవంతుని దయ నిరంతరమూ ఉంటుంది. అది అందరిపై అన్ని దశలలో ఉంటుంది. అనుకూల భోగ పదార్థములు, వానియందు అనుకూల బుద్ధి ఉ ందుట, మోహబంధనంలో బంధించడం వల్ల భగవంతుని యొక్క దయను అంచనా వేయలేకపోతున్నాడు.

"ఇదం హి పుంస: తపస శ్రుతస్య వా
స్విష్టస్య మమిక్త దత్తయో:
అవిచ్యుతోర్థ: కవిభిర్ని రూపతో
యదుత్తమ శ్లోక గుణాను వర్తనమ్" (భగవద్గీత- 3వ అధ్యాయం, 33వ శ్లోకం)

అని శ్రీమద్భాగవతం ప్రకటించింది. మానవుడు చేసే తపస్సు, వేదాల అధ్యయనం స్వాధ్యాయం, జ్ఞానాదుల వల్ల కలిగే ప్రధాన ప్రయోజనం ఉత్తమ శ్లోకుడైన పరమేశ్వరుని దివ్య గుణాలను వర్ణించడమే అని భాగవతం తెలిపింది. భగవంతుని యందు భక్తి కుదరటం మానవులకు పూర్వజన్మ పుణ్యఫలం. అందులోనూ భాగవతం నందు మనసు లగ్నం కావడం బహుజన్మల పుణ్యఫలం. సాహిత్యం అంతా ఒక యెత్తు అయితే భాగవతత్త్వ విజ్ఞానం భాగవతం మాత్రం మరొక ఎత్తు అని భాగవతం ప్రశంసించింది.

ఎవరి గుణాలు ఇంద్రియాలను సోకగానే జీవుల యొక్క తాపత్రయాలు తీరిపోతాయో, ఎవరి శుభకార్యం వీక్షించగానే కన్నులకు అఖిలలోకాలు కనబడతాయో, ఎవరి పాదాలకు సేవ చేసే ఉన్నత తత్త్వం ప్రాప్తిస్తుందో, ఎవరి నామాన్ని పఠిస్తే వారి భవబంధనాలు పటాపంచలు అవుతాయో, ఆ పరతత్త్వమే శ్రీకృష్ణభగవానుని తత్త్వం అని తెలియజేయబడింది. అలాంటి పరమేశ్వరుడు దుష్ట శిక్షణ, శిష్ట రక్షన కోసం ఎన్నోలీలలతో భూమిపై అవతరించాడు. ఆ లీలల మహాత్మ్యం తెలుసుకోవాలంటే కృష్ణుని అనుగ్రహం వల్లనే, ఆయన భక్తి కలిగి యుండుట వల్లనే తెలుసుకోగలుగుతారు.

సంగీతం, సాహిత్యం, భక్తి మూడింటిని ముచ్చటగా కలిగిన సహజ పాండిత్యం పోతనది. ప్రహ్లాదుడు తన తండ్రితో

కం॥ చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబులు నే
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ" (భాగవతం- సప్తమస్కంధం, 166వ పద్యం)

ఇక్కడ చదువులలో మర్మమెల్ల జదివినది "మహాకవి పోతనామాత్యుడే". మర్మమంటే రహస్యం, సారాంశం అని అర్థం. ఏ సత్యాన్ని కనుగొంటే మిగిలిన సమస్తం తెలుసునట్లు కాగలదో దాన్ని తెలుసుకున్నట్లు పోతన మనకు పై వాక్యం ద్వారా తెలిపాడు. మనకోసం కర్మ-జ్ఞాన-భక్త్యాదులతో భక్తి త్రోవను పరిపుష్టిగావించి సుగమం చేశారు. అందువల్ల పోతనగారి భాగవత పఠనం వల్ల శుభం చేకూరుతుంది.

సర్వవిధ భక్తి సారమంతా సంగ్రహించి ప్రహ్లాదుడు నవవిధ భక్తి రూపాలను ప్రతిపాదించాడు. వీటిని పోతన అనువదిస్తూ ఆత్మనివేదనం విశిష్టాద్వైత లక్షణం కాబట్టి "ఆత్మలో నెఱుకయున్" అని

పోతన అభేద అద్వైత భావనతో రచించాడు.

మ॥ తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్, చింతనం
బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మిస
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా"

సర్వాత్మున్ ... సత్యంబు అంటే విశ్వమంతా శ్రీమన్నారాయణ స్వరూపమున్నదని నమ్మి సజ్జనుడై ఉండాలి. అదే మనకు శ్రీరామ రక్ష అని, ఇదే సత్యమని పై పద్యం ద్వారా పోతనగారు నవవిధ భక్తులను తెలిపారు. రుక్మిణీ కల్యాణ ఘట్టంలో కూడా పోతన పరమాత్మ పరిచయ ప్రాప్తిని కలుగజేసుకోవడానికి నవవిధ భక్తి విధానలు ప్రదర్శించాడు. చివరకు మాయ నుండి విడివడి ఆత్మ – పరమాత్మలు ఒక్కటేనని తెలుసుకున్నాడు.

## 2.1. శ్రవణ భక్తి :

శ్రవణం అంటే వినడం. భగవంతుని గురించి వినడం, ఆయన గుణాలను వినడం, భగవంతుని నామాలను వినడం, చూడడం వల్ల మనకు ఆనందం కలుగవచ్చు కానీ, వినడం వల్లనే విషయ పరిజ్ఞానం కలుగుతుంది. ఈ శ్రవణ జ్ఞానమే జీవిత పురోగమనానికి నాంది అవుతుంది. మంచి మాటలను ఏకాగ్రతతో శ్రవణం చేస్తే నిజమైన జ్ఞానం లభిస్తుంది. అందుకే "భద్రం కర్ణేభి: శృణు యామ దేవా" అని వేదం తెలుపుతుంది. ఈ కారణం వల్లనే భక్తి మార్గంలో ప్రథమంగా శ్రవణ భక్తిని పోతనగారు తెలిపారు. దశమస్కంధంలోని రుక్మిణీ కల్యాణం కథా ప్రారంభంలో పోతన శ్రవణభక్తిని పరిశీలిద్దాం.

శా॥ "కల్యాణాత్మకమైన విష్ణు కథలాకర్ణించుచున్ ముక్తుండౌ
కల్యుండెవ్వడు తృప్తుడౌనని వినంగా క్రొత్త తాచుండు సా
కల్యం బేర్పడ భూ సురోత్తమ! యెఱుంగం బల్కవే! రుక్మిణీ
కల్యాణంబు వినంగ నాకు మదిలో గౌతూహలంబయ్యెడిన్"

(భాగవతం–10వ స్కంధం, 1684వ పద్యం)

బ్రాహ్మణోత్తమా! మేలు చేసే విష్ణు కథలను వినే వానికి తృప్తి లేనట్లు నాకు తృప్తి లేదు. కాబట్టి

నేను ఈ రుక్మిణీ కల్యాణాన్ని వింటాను. ఈపద్యంలో 'ముక్తుండౌకల్యుడు' అంటే పాపంతో విడువబడినటువంటి పుణ్యాత్ముడని అర్థం. నిజానికి పోతన ఇక్కడ 'ముక్తుండౌకల్యుడు' ఎందుకంటే ఈయన భాగవత రచన ఉద్దేశ్యమే 'శ్రీకైవల్య పదంబు చేరుటకు' దీనివల్ల మనకు తెలిసేది ఏమంటే పోతన తాను ఆచరించి, పాఠకులకు శ్రవణంలో ఆసక్తిని కలిగిస్తున్నాడు. సత్పురుషుల వాక్యాలు, మంచి గ్రంథాలు విన్న మానవుడు మంచి జ్ఞానిగా మారడానికి వీలవుతుంది. భక్తులు, జ్ఞానులు, విజ్ఞానులు, కర్మచేసినవారు కూడా శ్రవణం చేత ధన్యులయ్యారు. ఈ శ్రవణాభక్తి వల్ల జ్ఞానం కలుగుతుంది. ఈ జ్ఞానం వల్ల మానవునికి వైరాగ్యం, భక్తి కలుగుతాయి. జ్ఞానం, వైరాగ్యం, భక్తి వీటివల్ల మానవునికి భగవంతునిపై విశ్వాసం కలుగుతుంది. ఈ విధంగానే పరీక్షిత్తుడు భాగవతంను వినడం వల్లనే మోక్షాన్ని పొందాడు.

శ్రవణ భక్తిని పొందడానికి శ్రద్ధాపూర్వకంగా, ప్రేమ పూర్వకంగా మహాపురుషులు సాష్టాంగ వందనం చేయడం, వారికి తగిన సేవ చేయడం, వారితో నిత్యం కపటం లేకుండా ప్రశ్నలడుగుతూ సందేహ నివృత్తి చేసుకోవడం వారు చెప్పిన మార్గాన్ని అచరణలో పెట్టడానికి ప్రయత్నించడం అనేవి శ్రవణ భక్తిని పొందడానికి కావలసిన నియమాలు. శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఈ విధంగా తెలిపాడు.

"తద్విద్ధి ప్రణి పాతేన పరిప్రశ్నేన సేవయా।

ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞాని నస్త్వ దర్శిన:॥"(భగవద్గీత– 4వ అధ్యాయం, 34వ శ్లోకం)

"ఓ అర్జునా! శ్రోత్రియములు, బ్రహ్మనిష్టులు అయిన ఆచార్యుల వద్దకు వెళ్ళి వారికి చక్కగా సాష్టాంగ దండ ప్రమాణాలు ఆచరించి, వారిని సేవించి, మనస్సులో కపటాన్ని వదిలి సరళ బుద్ధితో ప్రశ్నించినచో పరమత తత్త్వాన్ని చక్కగా తెలిసికొనిన ఆ మహాత్ములు నీకు ఆ తత్త్వజ్ఞానాన్ని ఉ పదేశిస్తారు. నీవా జ్ఞానాన్ని బాగా తెలుసుకో" మహాపురుషుల ద్వారా వర్ణితమైన ఆశ్రవణ భక్తిని పొంది ప్రభువునందు అనన్యమైన ప్రేమ కలిగి ఉండడం కోసం భక్తులలో ప్రచారం చేయడమే ఈ శ్రవణ భక్తి ప్రయోజనం. మమాపురుషుల సాంగత్యం లేకుండా ఈ శ్రవణ భక్తిని సాధించడం చాలా కష్టం. అంటే సత్పురుషులతో కలువనిదే భగవంతుని కథలు లభించవు. ఆ కథలు లభించనిదే మోహము నశించదు. మోహము నశించనిదే భగవంతునిపై స్థిరమైన అనురాగం ఏర్పడదు. కాబట్టి మంచిన పొందడానికి సత్పురుషుల కలయిక మొదటి మెట్టు. సత్సంగత్వా మహాపురుషుల సాంగత్యం లభించనపుడు ఉన్నత

శ్రేణికి చెందిన సాధకుల సాంగత్యం చేయడం గానీ, మహాపురుషులు రచించిన గ్రంథాలు చదవడం తత్పురుషుల సత్సాంగత్యంలో సమానమైనది. సత్సంగత్యం వల్ల ప్రత్యక్షంగానే ప్రయోజనం సిద్ధిస్తుంది.

"సత్యంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వమ్।

నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తి:" ॥

ఎందుకంటే మనిషికి ఎలాంటి సాంగత్యం ఉంటుందో ఆ సాంగత్యాన్ని బట్టి అలాంటి ప్రభావం అతని మీద పడుతుంది. సత్సంగత్యమే శ్రవణ భక్తికి హేతువు కాబట్టి శ్రవణభక్తి సత్సంగం వల్లనే సిద్ధిస్తుంది.

భాగవతంలో మహాత్ముడైన జడభరతుడు రహూగణ మహారాజుతో ఈ విధంగా అంటాడు. మహాపురుషుల చరణ ధూళిలో స్నానమాడకుండా కేవలం తపం, యజ్ఞం, దానం, గార్హస్థ్య ధర్మ పాలనం, వేదాధ్యయనం, ఇంకా జలాగ్ని సూర్యోపాసన లాంటివి ఎన్ని చేసినా ఆ పరమ తత్త్వజ్ఞానం సిద్ధించదు. కాబట్టి సర్వ కార్యసిద్ధి మహా పురుషుల సాంగత్యం వల్లనే సాధ్యపడుతుందని తెలిపాడు.

శ్రీకృష్ణ పరమాత్ముడు భాగవతంలోనే ఉద్ధవుడితో ఇలా అంటాడు. అగ్నిదేవుని ఆశ్రయాన్ని పొంది చలి, భయము, చీకటి నాశనమైనట్లు సజ్జనులైన మహాపురుషుల సాంగత్యం వల్ల పాపరూపమైన చలి, జనన మరణ రూపకమైన భయం, అజ్ఞాన రూపమైన చీకటి నాశనమౌతాయని తెలిపాడు. ప్రాణులకు అన్నం జీవనమైనట్లు దు:ఖితులైన మానవులకు నేను (భగవంతుడు) ఆశ్రయమై ఉన్నాను. జనన మరణాలతో భయపడే మానవులకు సజ్జనులైన మహాపురుషులే పరమాశ్రయమై యున్నారు. మహాపురుషుల సాంగత్యం దుర్లభమైనది, అంతు తెలియనిది, అమోఘమైనది కాబట్టి సజ్జనులైన మహాపురుషులతో సాంగత్యం చేసి, వారి సేవ చేస్తూ వారి ఆజ్ఞలను శిరసావహించు అని తెలిపాడు.

శ్రవణ భక్తిని గురించి భాగవతంలో నారదుడు సనకాది మునులతో ఇలా అన్నాడు.

"శ్రవణం సర్వధర్మేభ్యో వరం మన్యే తపోధనా

వైకుంఠ స్థోయత: కృష్ణ శ్రమణాద్ యస్యల భృతే" (భాగవతం-6వ స్కంధం, 77వ పద్యం)

ఓ తపోధనులారా! నేను భగవంతుని గుణగానం చేసేవాళ్ళ శ్రవణాభక్తిని సర్వధర్మాలలో శ్రేష్ఠమైనదిగా భావిస్తాను. ఎందుకంటే భగవంతుని గుణగణాన్ని వినడం వల్ల వైకుంఠవాసియైన భగవంతుడు ప్రాప్తిస్తాడు. కేవలం శ్రవణ భక్తి వల్లనే భగవత్ప్రాప్తి సిద్ధిస్తుంది. దీనికి నిరూపణగా

శాస్త్రాలలో అనేక ప్రమాణాలు మనకు లభిస్తాయి.

### 2.2. కీర్తనం :

భగవంతుని నామ, రూప, గుణ ప్రభావ చరిత్రను శ్రద్ధాపూర్వకంగా, ప్రేమపూర్వకంగా పదేపదే పలుకుటనే కీర్తనం అంటారు. శరీరం పులకింతమవడం, కంఠం గద్గదమవటం, కళ్ళలో ఆనంద భాష్పాలు రాలడం, హృదయం ముగ్ధలవటం మొదలైన లక్షణాలతో విలసిల్లుటయే "కీర్తనభక్తి" స్వరూపంగా చెప్పవచ్చు.

భక్తులను ఎదురుగా కూర్చోబెట్టుకొని భగవంతుని ప్రేమన్నొత్యాన్ని గురించి వారికి వినిపించడం. ఏకాంతంలోగాని, అందరితో కలిసి భగవంతుని రూపాన్ని చూస్తూ, ఆయన నామాన్ని పలుకుతూ ఉచ్ఛైశ్వర్యంతో కీర్తన చేయడం, భగవంతునికి గుణప్రభావ చరిత్రాదులను శ్రద్ధాపూర్వకంగా, ప్రేమ పూర్వకంగా, నెమ్మది నెమ్మదిగా గాని, బిగ్గరగా కానీ, కూర్చోనిగానీ, నిలబడి గానీ, వాద్యనృత్య రహితంగా గానీ, వాద్యనృత్య సహితంగా కానీ, దివ్య స్తోత్రాలతో గానీ, పదాలతోగానీ, భగవంతున్ని స్తోత్రం చేయడమే పైన చెప్పిన కీర్తన భక్తిని సాధించడానికి చేయవలసిన పద్ధతులు. అయితే ఈ ప్రక్రియలన్నీ నామానికి సంబంధించినవి. అపరాధాలను తొలగించుకుంటూ నిరాడంబరంగా శ్రద్ధా భావనతో సహజంగా చేయాల్సి ఉంటుంది.

పైన చెప్పిన కీర్తన భక్తిని పొంది భగవంతుని యెడల అందరూ ఆయనను పొందాలన్న ఉద్దేశ్యంతో కీర్తన చేయడమే ఈ కీర్తన భక్తి ప్రయోజనం. కీర్తన భక్తి కూడా పరమాత్మ కృప వల్ల, మహాత్ముల దయవల్లనే లభిస్తుంది. భగవంతుని భక్తుల ద్వారా భగవంతుని ప్రేమ, ప్రభావ, తత్త్వ రహస్యాలు వినడం వల్ల, శాస్త్రాలను చదవడం వల్ల భగవంతుని యందు శ్రద్ధ కలుగుతుంది. అప్పుడు మానవులు పైన చెప్పిన కీర్తన భక్తిని పొందగలుగుతారు. ఈ విధమైన కీర్తన భక్తి తోడనే మానవులు పరమాత్ముని కృపవల్ల ఆయనయందు అనన్యమైన ప్రేమ కలిగి ఆయనను పొందుతారు. భగవద్గీతలో పరమాత్ముడు ఇలా అన్నాడు

"అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్...." (భగవద్గీత– 9వ అధ్యాయం, 30వ శ్లోకం)

ఎవరైనను పరమ దురాచారుడైనను, అనన్య భక్తి భావముతో నాభక్తుడై నన్ను భజించుచున్నచో అతడు సజ్జనుడుగానే పరిగణింపబడుతాడు. ఎందువల్ల అంటే అతడు యదార్థ నిశ్చయము కలిగి ఉ

న్నాడు. అనగా నా నామమును కీర్తించడాన్ని పరమేశ్వరుని భజనతో సమానమైనదని అభిప్రాయం కలవాడు, అతడు త్వరలోనే ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితి పొంది శాశ్వతమైన పరమ శాంతిని పొందును. నీవు సత్యమును నిశ్చయముగా తెలుసుకో, నాభక్తుడు ఎన్నటికీ నశింపడు అని అర్జునుడికి తెలిపెను.

ఈ కీర్తన భక్తి ప్రచారకుడు కూడా భగవంతునికి అందరికంటే ప్రియమైనవాడవుతాడని గీతలో కృష్ణభగవానుడు స్వయంగా ఈ విధంగా తెలిపాడు. "ఏ పురుషుడు అయితే నా యందు పరమ ప్రేమతో పరమ గోప్యమైన ఈ గీతాశాస్త్రాన్ని నా భక్తులకు ప్రేమ పూర్వకంగా చదివింప జేస్తాడో వాడే నన్ను పొందుతాడు. ఈ విషయంలో ఎట్టి సందేహం లేదు. అట్టివానిని మించి ప్రియకార్యములు చేసేవారు ఈ లోకంలో లేరు. వానిని మించిన ప్రియమైనవాడు ఈ భూమండలంలో భవిష్యత్తులో కూడా మరొకరు ఉండరు. ఇదే ఈ కీర్తన భక్తియొక్క ఫలం".

రామాయణ, భాగవతం సర్వభక్తి గ్రంథాలలో భగవంతుని నామగుణ కీర్తనతోనే సకల పాపాలు నశించి భగవత్ప్రాప్తి కలుగుతుందని చెప్పబడింది. శ్రీమద్భాగవతంలో ఇలా చెప్పబడింది. "బ్రాహ్మణ ఘాతకులు, పితృఘాతకులు, గో ఘాతకులు, మాతృఘాతకులు, గురు ఘాతకులు అయిన పాపాత్ములు, ఛండాలురు సైతం భగవంతుని కీర్తన వల్ల పరిశుద్ధులవుతున్నారు. సూర్యుడు అంధకారాన్ని ప్రచండ వాయువు మేఘాలను చిన్నాభిన్నం చేసినట్టుగా విఖ్యాత ప్రభావవంతుడైన భగవానుడు కీర్తింపబడినపుడు మనుషుల హృదయంలో ప్రవేశించి వారి సకల పాపాలను నిస్సందేహంగా విధ్వంసం చేస్తాడు". ఇంకా జనన మరణమనే ఘోరమైన సంసారంలో కొట్టుమిట్టాడుతున్న మానవుడు భగవంతుని నామాన్ని అనుకోకుండ కీర్తించినా వెంటనే ఆ సంసారం నుండి ముక్తిని పొందుతాడు. ఆ భగవంతుని ముందు భయము కూడా అణగి మణిగి ఉంటుంది. శ్రీకృష్ణ భగవానుని కీర్తన వల్లనే మానవులు ఆసక్తి రహితులై పరమాత్మను పొందుతారు. ఇది దోషాల నిధి అయిన ఈ కలికాలం యొక్క ఒకే ఒక మహాగుణం.

ఈ విధంగా ఈ భాగవతంలో ఇంకా అన్ని శాస్త్రగ్రంథాలలో వర్ణించబడిన శ్రీకృష్ణభగవానుని అవతారానికి సంబంధించిన పరాక్రమాలు సర్వశుభప్రదములైన బాల్య చరిత్రలను కీర్తించే మానవుడు పరమ హంసల గమ్యరూపమైన భగవంతుని యెడల భక్తిని పొందుతాడు. ఎవ్వని నాలుకపై పవిత్ర నామం ఉంటుందో అతడు ఛండాలుడైనా ఉత్తముడే అవుతాడు. ఎందుకంటే భగవంతుని నామ

సంకీర్తనం ఎవ్వరు చేస్తారో అట్టి పుణ్యపురుషులు తపం, యజ్ఞం, తీర్థస్నానం, వేదాధ్యయనం మొదలైనవన్నీ చేసినట్లే అని కృష్ణ భగవానుడు తెలిపాడు.

పూర్వ కాలంలో అనేకమంది భక్తులు ఈ కీర్తన భక్తి వల్ల తరించారు. పురాణేతిహాసాలలో ఇలాంటి అనేక దృష్టాంతాలు మనకు లభిస్తాయి. భగవంతుని నామ, గుణ, కీర్తన ప్రభావం వల్ల పూర్వకాలంలో నారదుడు, వాల్మీకి, శుకదేవుడు మొదలైనవారు ఇంకా తులసీదాసు, సూరదాసు, నానక్ లాంటి అనేక మంది భక్తులు పరమ పదాన్ని పొందారు. కాబట్టి వాన కోయిల (చాతక పక్షి) మేఘాలను చూసి నీళ్ళకోసం "పీపీ" స్వరం చేసినట్లు భగవానుని యెడల పరమ ప్రేమ కలగడానికి ఆ పరమాత్మను పొందడానికి భగవంతుని నామ, గుణ, కీర్తనలో నిత్య నిరంతరతత్పరులై ప్రాణ పర్యంతమూ కొనసాగడానికి ప్రయత్నం చేయాలి.

2.3. స్మరణం :

భగవంతుని నామ, రూప, గుణ, ప్రభావ, లీలా తత్త్వ రహస్యాదులకు సంబంధించిన అమృతమయ గాథలను శ్రద్ధగా, ప్రేమగా విని, విన్నవాటిని, చదివిన వాటిని మననం చేసుకోవడం, మననం చేసుకుంటూ భగవంతుని స్వరూపంలో లీనమైపోవడం స్మరణభక్తి స్వరూపంగా చెప్పవచ్చు. ఎంతవరకు కుదిరితే అంతవరకూ ఏకాంతంలోగానీ, పవిత్ర స్థానంలోగానీ, సుఖంగా స్థితరమైన, సరళమైన ఆసనం మీద కూర్చొని ఇంద్రియాలను విషయ రహితంగా చేసి, కోరికలను, సంకల్పాలను ప్రక్కనపెట్టి ప్రశాంతమైన వైరాగ్య భావంతో కూడిన మనసుతో నడుస్తూ, తిరుగుతూ కూర్చొని, పడుకొని తింటూ తాగుతూ ఇలా అన్ని పనులు చూసుకుంటూ సహజంగా, శుచిగా, సరళంగా భగవంతుని సగుణ, నిర్గుణ, సాకార, నిరాకార తత్త్వాన్ని తెలుసుకొని ఆ భగవంతుని రూపాన్ని చింతన చేయడం, భగవన్నామాన్ని మనసులోనే స్మరిస్తూ ఉండడం, భగవంతుని లీలలను తలచుకొని ముగ్దులవడం, భగవతత్త్వాన్ని, రహస్యాన్ని తెలుసుకోవడం కోసం ఆయన గుణ ప్రభావాలను చింతన చేయడం ఇంకా దివ్య స్తోత్రాలతో, పదాలతో మానసికంగా ప్రార్థించడం మొదలైన విధంగా స్మరణ భక్తి పొందడానికి అనేక శాస్త్రాలలో చెప్పబడింది. స్వామి (ప్రభువు) యెడల ప్రేమ కలిగి, ఆయనను పొందడమే ఈ స్మరణ భక్తి యొక్క ఉద్దేశ్యము.

భక్తుల ద్వారా నామ, రూప, గుణ ప్రభావాది అమృతమయ గాథలను శ్రద్ధాపూర్వకంగా, ప్రేమ

పూర్వకంగా వినడం, భగవత్ విషయమైన ధార్మిక గ్రంథాలు పఠనం చేయడం, భగవన్నామ జపం చేయడం, కీర్తనం చేయడం, భగవంతుని స్తోత్రాలతో, పదాలతో ఇంకా ఏవిధమైన పద్ధతిలోనైనా సరే, ధ్యానం కోసం కరుణ భావంతో స్తుతించడం, ప్రార్థించడం, భగవంతుని ఆజ్ఞలను, మహాపురుషుల ఆజ్ఞలను శిరసా వహించడం మొదలైనవి స్మరణ భక్తిని పొందడానికి కావలసిన పద్ధతులు.

పైన పేర్కొన్న స్మరణ భక్తి వల్లనే సకల పాపాలు, విఘ్నాలు, దు:ఖాలు తొలగిపోతాయి. భగవంతున్ని స్మరిస్తే మానవుడు కోరిన కోర్కెలు అన్నీ పొందగలడు. భగవంతున్ని చేరడమే పరమ శాంతిని పొందడం కూడా స్మరణ భక్తి ద్వారా అతి శీఘ్రంగా సులభంగా నెరవేరుతుంది. శ్రుతిస్మృతులు, పురాణేతిహాసాలు, సత్పురుషులు, యోగులు, మహాత్ములు, అందరూ ఏక కంఠంతో భగవత్స్మరణ (ధ్యానం) యొక్క మహిమను కీర్తించారు. అపవిత్రుడు అయినా, పవిత్రుడైనా ఏ స్థితిలో ఉన్నా, ఎవరు ఆ భగవంతున్ని స్మరిస్తారో వారు బాహ్యంగా, అంతరంగికంగా పరిశుద్ధులు అవుతారు.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఈ విధంగా పేర్కొన్నాడు. “ఏ పురుషుడు సకల భూతాలలోనూ, సకలాత్మరుడు, వాసుదేవుడగు నన్ను చూచునో, సకల భూతాలను వాసుదేవుడగు నాయందే దర్శించునో అట్టివానికి నేనెన్నడును అదృశ్యుడను కాను. అట్లే నాకు కూడా అట్టివాడు అదృశ్యుడు కానేరడు. సర్వకాల సర్వావస్థల యందు నిరంతరం నన్ను స్మరించి యుద్ధం చెయ్యి. ఈ విధంగా నాయందే అర్పింపబడిన మనోబుద్ధులు కలవాడవ నిస్సందేహంగా నన్నే చేరుకోగలవు” అని అర్జునునికి తెలిపాడు. నా భక్తులెవ్వరు పరమేశ్వరుడగు నన్ను నిరంతరం స్మరిస్తూ నిష్కామబుద్ధితో భజించి చింతన చేస్తుంటారో అట్టి భక్తుల యోగక్షేమాలను నేనే స్వయంగా ప్రాప్తింప చేస్తాను. నాయందు పరాయణులైన ఏ భక్త జనులు సమస్త కర్మలను నాకే అర్పించి నన్ను సగుణరూప పరమేశ్వరునిగా ఏకాగ్రతతో భక్తి యోగంతో నిరంతరం చింతన చేస్తూ భజించుచుందురో అట్టి భక్త జనులను, నాయందు చిత్తాన్ని లగ్నం చేసే వాళ్ళను, మృత్యుముఖ సంసార సాగరం నుండి వారిని నేను ఉద్ధరిస్తాను.

భాగవతంలో స్మరణభక్తి గురించి ఇలా చెప్పబడింది. “గోడమీద భ్రమరం ద్వారా అడ్డగించబడిన పురుగు భ్రమరం క్రోధానికి భయపడి దాన్నే స్మరిస్తూ అది భ్రమరంతో సమానమైనట్లు (పురుగు తుమ్మెద అయినట్లు) మాయ చేత మనుష్య జన్మ ఎత్తిన పరమేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుని వైరభావంతో పదేపదే చింతన చేస్తూ అనేకమంది పాపరహితులై అయన్ను చేరుకున్నారు. ఈ విధంగానే కామ, క్రోధ, భయ,

స్నేహాదులతో, భక్తితో పరమేశ్వరుని యందు చిత్తాన్ని లగ్నం చేసి అనేకమంది సాధకులు పాపరహితులై పరమ పదాన్ని పొందారు. ఏ పురుషుడు సకల కర్మలను ఆచరించేటప్పుడు భగవంతుని రూపాన్ని ఆయన నామాలను వింటూ, చెబుతూ, స్మరిస్తూ చింతన చేస్తూ స్వామి చరణార విందాల పైనే మనస్సు లగ్నం చేస్తాడో అతడు తిరిగి ఈ సంసారంలో అడుగు పెట్టడు. విషయ చింతన చేసేవాడే మనస్సు ఇంద్రియ సుఖాలపైనే మోహాన్ని పెంచుకుంటాడు. కానీ భగవంతున్ని పదేపదే స్మరించే వాడి మనస్సు నాలోనే లీనమై పోతుంది శ్రీకృష్ణ పరమాత్ముని చరణ కమలాల (స్మృతి) స్మరణ సకల పాపాలను పోగొడుతుంది. అది అంత:కరణాన్ని శుద్ధి చేస్తుంది. పరమాత్మయందు భక్తిని, విజ్ఞానాన్ని, వైరాగ్య సహిత జ్ఞానాన్ని, శాంతిని పెంపొందిస్తుందని శ్రీకృష్ణుడు భాగవతంలో తెలిపాడు.

సనకాది మునులు, ధ్రువుడు, భీష్ముడు, కుంతి మొదలైన వారు స్మరన భక్తి తోనే పరమపద ప్రాప్తిని పొందారు. వారే కాకుండా శబరి, జటాయువులకు కూడా భగవత్స్మరణ వల్ల పరమగతి లభించింది. గుణ, ప్రభావ, ప్రేమ సహితమైన భగవంతుని స్వరూప ధ్యానంతో సమానమైనది, శీఘ్రమే ఉద్ధరించేది మరే సాధనము ఈ భూ ప్రపంచంలో లేదు. సర్వ సాధనలను సదా భగవత్స్మరణమే మార్గము. అందువల్ల మన జీవితమంతా పైన పేర్కొన్న విధంగా భగవచ్చింతనలో గడపడానికి నడుం బిగించి ప్రయత్నం చేయాలి.

## 2.4. పాదసేవనం :

వజ్ర, ధ్వజ, కమలాది చిహ్నాలను కలిగి శోభాయమానమైన కాంతులతో భక్తుల హృదయంలో మహాంధకారాన్ని సంపూర్ణంగా తొలగించేటువంటి భగవచ్చరణ కమలాలను ప్రేమత, చింతన చేయాలి. ఎవరి చరణాలను ప్రక్షాలన చేయడం వల్ల వెడలిన పవిత్ర గంగాజలాలను శిరస్సున దాల్చి శివుడు శివతత్త్వాన్ని పొందియున్నాడో, ఎవరి చరణాలను ధ్యానించెడు పురుషుని అంత:కరణములు గుట్టల కొలదిగా పేరుకు పోయిన పాపపు రాశులు సైతం ఇంద్రుని వజ్రాయుధ ప్రయోగంతో పర్వతాలు ముక్కలు అయిపోయినట్లు పటాపంచలు అయిపోవునో అట్టి భగవానుని పాదపద్మాలకు నిరంతరం సేవ చేయాలి. భగవంతుని దివ్య మంగల రూపాన్ని కానీ, చిత్రపటం కానీ, లేదా మానవ మూర్తి యొక్క మనోహర చరణాలను శ్రద్ధాపూర్వకంగా దర్శించడం, పూజ చేయడం, సేవలు చేస్తూ చేస్తూ ఆ భగవంతుని ప్రేమలో తన్మయులై వర్తించటమే “పాదసేవనం”గా చెప్పవచ్చు.

పదేపదే తనివి తీరని నయనాలతో భగవంతుని చరణాలను దర్శించి, హస్తాలతో భగవంతుని చరణాలకు పూజ చేసి, తీర్థం సేవించడం, మానసికంగా (మనసా) భగవంతుని చరణాల గురించి చింతన చేయడం, ఆయన చరణ ధూళిని మనసా శిరస్సుపై ధరించడం, హృదయానికి హత్తుకోవడం, భగవంతునిచే స్పృశింపబడిన భగవంతుని శయ్యాసనాదులను పుణ్యక్షేత్రాల కన్నా గొప్పగా భావించి గౌరవించడం, అయోధ్య, చిత్రకూటం, బృందావనం, మధుర, శ్రీశైలం, తిరుపతి, కాశీ వంటి క్షేత్రాలను ఇంకా భగవంతుడు అవతారమెత్తి అందరికీ ప్రత్యక్షమైన ప్రదేశాలను, ఆయన పాదాలతో ఏర్పడిన చిహ్నాలను పరమ పుణ్యక్షేత్రాలుగా భావించి, అక్కడి ధూళిని సాక్షాత్తు భగవత్పాద ధూళిగా ఎంచి, శిరస్సున దాల్చడం, భగవంతుని చరణ స్పర్శను పొందిన ప్రతి వస్తువును ఆదరించడం, ఇంకా, పవిత్ర గంగా జలాలను భగవంతుని పాదోదకంగా భావించి ఆ జలాలకు వందనాలు అర్పించడం, పూజలు చేయడం, వాటిలో పవిత్రస్నానమాచరించడం, ఇలా చేసే సేవలన్నీ "పాదసేవభక్తి"కి కావలసిన పద్ధతులు.

అరిషడ్వర్గాలను తొలగించుకొని స్వామి చరణాలపై ప్రేమను పొందే ఉద్దేశ్యంతో పాదసేవ భక్తి ఆచరించబడుతుంది. భగవంతుని యెడల సాటిలేని భక్తులైనవారి సాంగత్యం వల్ల, వారి చరణసేవ వల్ల తత్త్వ, రహస్య, ప్రభావాదులు తెలుసుకొని, వినే అవకాశం కలుగుతుంది. అప్పుడు దానియందు శ్రద్ధ ఏర్పడి భక్తి లభిస్తుంది. కేవలం ఈ పాదసేవన భక్తితోనే మనుష్యుల దురాచారాలు, దుర్గుణాలు, దు:ఖాలన్నీ తొలగిపోయి భగవంతుని యెడల సహజంగానే శ్రద్ధ, ప్రేమ కలిగి చివరకు అత్యంత ప్రశాంత స్థితి లభిస్తుంది. ఇలాంటి వారికి ఏదీ దుర్లభం కాదు.

భగవచ్చరణాలను ఆశ్రయించడం వల్ల మానవునికి సకల దోషాలు, నశించి, వాని సర్వ విపత్తులు నశించి తొలగిపోతాయి. అనేక కష్ట నష్టాల నుండి సులభంగా బయట పడగలుగుతాడు. శ్రీమద్భాగవతంలో పాదసేవనం గురించి ఈ విధంగా చెప్పబడింది. "మానవులు నా అభయ చరణ కమలాలను స్వచ్ఛమైన హృదయంతో ఆశ్రయించకుండా ఉండినంత వరకు ధనము, ఇల్లు, మిత్రులు మొదలైన వాటి కారణంగా భయము, శోకము, పరాజయము, మహాలోభము ఇవన్నీ కలుగుతుంటాయి. సకల దు:ఖాలకు మూలము 'ఇదినాది' అనే భ్రమ కలుగుతూనే ఉంటుంది. భగవంతుని చరణాలను ఆశ్రయించగానే అవన్నీ తొలగిపోతాయి. సత్పురుషలకు ఆశ్రయనీయుడు, పవిత్ర శోభవంతుడు అయిన

భగవంతుని చరణాలు అనే నౌకను ఆశ్రయించిన వారికి ఈ సంసార సాగరం ఆవుదూడ పాదమంత అవుతుంది. అలాంటి వారికి ప్రతి అడుగులోను పరమపద ప్రాప్తి కలుగుతుంది. కాబట్టి వారికి ఎప్పుడూ అట్టి ఆపదలు కలుగవు".

నిరంతరంగా, ప్రతిక్షణం ప్రభు చరణాలను దర్శిస్తూ పరిచర్యలు చేయడంలో ఏవిధంగా ఆనంద హృదయము కావాలో, అది తెలుసుకోవడానికి సీతాదేవినే మనం ఆదర్శంగా తీసుకోవాలి. అరణ్యవాసంలో సీతాదేవి శ్రీరామచంద్రునితో ఇలా అంటుంది. "ఓ ప్రభూ! నీ చరణ కమలములను తిలకించుచూ చకోర పక్షివలె రేయింబవళ్ళు ఆనందించెదను, చెట్టు నీడన కూర్చున్నప్పుడు నీ సుందర చరణాలను కడిగి, ప్రక్కన కూర్చొని వీస్తూ ముగ్ధురాలయ్యెదను. ఈ సేవకురాలు పవిత్రమైన నీ పాదసేవలో మునిగి ప్రసన్నురాలవుతుంది.

శ్రీరామ చంద్రుని చరణ చిహ్నాలను, చరణ పాదుకలను దర్శించి, పూజలు చేయడం ద్వారా భరతుడు ఎంతటి ఆనందాన్ని పొందాడో, ప్రేమతో తన్మయుక్తుడు అయ్యాడో రామాయణం ద్వారా తెలుసుకున్నాం. భగవానుని చరణ పాదధూళిని చూసిన భరతుడు ఆనంద భరితుడై ఆ చరణ ధూళిని తన శిరస్సుపైన, హృదయంపైన, కనులపై ధరించి స్వయంగా రఘునాధునితో కలిసినంతగా సంబరపడిపోయాడు. అహల్య శ్రీరామచంద్రుని (పరమాత్మని)చరణ ధూళిని తాకి కృతార్థురాలైంది. ఈమె ఈ విధంగా అంటుంది. "హే జగన్నివాసా! నీ చరణ కమలాలను చూసి నేను కృతార్థురాలినయ్యాను బ్రహ్మదేవుడు, శంకరుడు మొదలైన వారందరూ మనసు లగ్నం చేసి అన్వేషించే ఆ చరణారవిందాలను నేనిప్పుడు  స్పృశిస్తున్నాను".

భగవంతుని చరణ ధూళిని ఆశ్రయించిన భక్తులు స్వర్గాది సుఖాలే కాదు, మోక్షాన్ని సైతం తిరస్కరించి చరణ ధూళి సేవనంలో సంలగ్నులు కావడాన్ని కోరుకుంటారు. శ్రీమన్నారాయణుడి పాదాలను ఆశ్రయించిన భక్త జనులు స్వర్గాన్ని కాంక్షించరు. చక్రవర్తిత్వాన్ని అభిలషించరు, బ్రహ్మ పదాన్ని కోరుకొనరు, సంపూర్ణ భూమండలాధిపత్యం కూడా కోరుకొనరు.

భగవంతుని పాదసేవ భక్తి తోడనే భగవంతుని అనన్య ప్రేమను పొందిన అనేకమంది భక్తుల వర్ణన మనకు అనేక గ్రంథాలలో కనిపిస్తుంది. కాబట్టి మనం భగవంతుని చరణాలపై శ్రద్ధాపూర్వకంగా మనస్సు లగ్నం చేసి ఆ చరణాలకు నిత్యం పాదసేవనం చేయాలి.

## 2.5. అర్చనం :

ఈ ప్రపంచంలో భగవంతున్ని పూజించేవారు భగవంతుని యొక్క అవినాశకరమైన ఆనంద స్వరూపమైన పరమ పదాన్ని పొందుతారు. భగవంతుని గురించి భక్తుల ద్వారా విన్నటువంటి శాస్త్ర గ్రంథాలలో చదివినటువంటి, లోహాదులతో తయారు చేయబడిన విగ్రహాలుగానీ, మనస్సుకు నచ్చిన ఏదైనా భగవంతుని రూపాన్ని నిర్మించుకొని మానసిక సామాగ్రితో గానీ, లేదా సకల భూతాలలో పరమాత్మ స్థితిని భావించుకొని, శ్రద్ధాపూర్వకంగా, భక్తి పూర్వకంగా, పరమాత్మునికి సేవలు చేయడం గానీ, ఆయన తత్త్వ రహస్య ప్రభావాలను తెలుసుకుంటూ ప్రేమ నిండిన హృదయంతో ముగ్దులు కావడం "అర్చన భక్తి" అనబడుతుంది.

పత్రం, పుష్పం, చందనం వంటి సాత్త్వికమైన పవిత్రమైన ద్రవ్యాలతో భగవంతుని విగ్రహానికి శ్రద్ధాపూర్వకంగా పూజలు చేయడం, భగవత్ప్రీతి కోసం శాస్త్రోక్తమైన యజ్ఞాదులు నిర్వహించడం, సర్వులను పరమాత్మ స్వరూపులుగా భావించి తమతమ వర్ణాశ్రయ ధర్మానుసారంగా వారికి యోగ్యమైన సేవలు చేయడం, దు:ఖితులు, అనాథలు, వికలాంగుల వంటి పీడిత ప్రాణులతో ఆకలిగొన్న వారికి అన్నంతో, దప్పిక గొన్నవారికి జలంతో, వస్త్రహీనులకు వస్త్రాదులతో రోగులకు ఔషధాలతో, అనాథలకు ఆశ్రయ దానాదులతో శ్రద్ధాపూర్వకంగా సర్వులను భగవత్సరూపులుగా భావించి భగవత్ప్రీతికోసం సేవ చేయడం మొదలైనవన్నీ భగవంతుని బాహ్య పూజా విధానాలే.

శాస్త్రాలతో వర్ణించబడిన తమ మనసును అనాయాసంగా ఆకర్షించే భగవంతుని ఏదేని అలౌకిక రూప లావణ్యమైన, అనంతముగ్ధ సౌందర్యమైన పరమతోజో మండిత స్వరూపానికి ప్రత్యేక అవయవ, వస్త్ర, భూషణ, ఆయుధాలతో యుక్తమైన, హస్త పాదాదులను మంగళ చిహ్న సహితంగా మనసా చింతన చేసి ఆహ్లాదపూర్వకంగా మనస్సుతో ఆయనను ఆవాహన చేసుకొని ఇంకా నానావిధ మానసిక సామాగ్రితో అత్యంత శ్రద్ధాపూర్వకంగా పూజలు చేయడం పూజా విధానం అవుతుంది.

భగవంతుని యెడల అనన్యమైన ప్రేమను కలిగి, ఆ ప్రేమను అందరూ పొందాలనే ఉద్దేశ్యంతో శ్రద్ధాపూర్వకంగా స్వయంగా ఆచరణ చేయడం లేదా ఇతరులచే ఆచరింపజేయడం అర్చనభక్తి యొక్క ప్రయోజనం. అర్చనభక్తి స్వరూపాన్ని, దాని తత్త్వాన్ని అవగాహన చేసుకోవడానికి భగవంతుడి పరమ ప్రియభక్తుల సాంగత్యంతో పాటు వారికి పరిచర్యలు (సేవించడం) చేయడం చాలా అవసరం.

పైన పేర్కొన్న విధంగా భగవంతున్ని పూజించడం వల్ల మానవుడు తానేది కోరుకుంటే అది లభిస్తుంది. సహజంగానే అతనికి భగవత్ప్రాప్తి సిద్ధిస్తుంది. శ్రీమద్భాగవతంలో ఇలా చెప్పబడింది.

"స్వర్గాపవర్గయో: పుంసాం రసాయాం భువి సంవదామమ్:
సర్వాసామపి సిద్దీనాం మూలం తచ్చరణార్చనమ్॥"

(భాగవతం-10 వ స్కంధం, 81వ శ్లోకం)

భగవంతుని పాదాలకు అర్చన పూజలు చేయడం జీవులందరకూ స్వర్గ మోక్షాలతో పాటు మర్త్యలోక పాతాళలోకాలలోని సమస్త సంపదలకూ సర్వసిద్ధులకు మూలం.

ఏ పరమేశ్వరుని ద్వారా ప్రాణుల ఉత్పత్తి జరిగెనో, ఎవరి వలన సమస్త జగత్తు వ్యాప్తమై ఉన్నదో, ఆ పరమేశ్వరున్ని తన స్వాభావిక కర్మల ద్వారా పూజించి మనుష్యుడు సిద్ధిని పొందతున్నాడు. అంతే కాకుండా అత్యంత శ్రద్ధతో, ప్రేమతో భగవంతునికి పూజ చేసినట్లయితే ఆయనే స్వయంగా తన దివ్యమంగళ విగ్రహ రూపంతో ప్రత్యక్షమై భక్తులు భక్తితో అర్పించిన పదార్థాలను భుజిస్తాడు. ఈ విషయాన్ని భగవద్గీతలో శ్రీకృష్ణుడే చెప్పాడు

"పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యు పగృతం అశ్నామి ప్రయతాత్మన" (భగవద్గీత- 9వ అధ్యాయం, 26వ శ్లోకం)

ఏ భక్తుడు అయినా పత్రము, పుష్పము, ఫలము, జలములను నాల్గింటిలో ఏదేని ప్రేమతో నాకు సమర్పిస్తే అట్టి పరిశుద్ధ మనస్కుడు, నిష్కామ భక్తుడు సమర్పించిన ఆ పత్ర పుష్పాదులను సగుణ రూపంలో ప్రత్యక్షమై ప్రేమ పూర్వకంగా స్వీకరిస్తాను అని చెప్పాడు శ్రీకృష్ణుడు.

పృథు చక్రవర్తి, అంబరీషుడు వంటి వారెందరో వివిధోపచారాలతో, మానసికంగా, ఇంద్రియాలతో భగవంతున్ని పూజించి, సులభంగా పరమగతిని పొందారు. ఏ విధమైన ఉపచారాలు లేకుండానే కేవలం భక్తి పూర్వకంగా పూజలు చేసిన కుచేలుడు కేవలం అటుకులతో, గజేంద్రుడు పుష్పములతో, శబరి రేగు పండ్లతో పరమాత్మను సంతుష్టుణ్ణి చేసి పరమ పదాన్ని పొందారు. కాబట్టి భగవత్ప్రేమలో విహల్వులై శ్రద్ధాపూర్వకంగా తమతమ అభిరుచులకు అనుగుణంగా భావానుసారంగా భగవంతున్ని అర్చించాలి.

## 2.6. వందనం :

హే పురుషోత్తమా! హే ప్రణత పాల! సదా ధ్యానయోగ్యమైనవి, పాపాలను తొలగించేవి, సకల మనోరథాలను నెరవేర్చేవి, సర్వతీర్థాలకు ఆధారభూతమైనవి, బ్రహ్మ రుద్రాదులతచే నమస్కరింపబడేవి, శరణాగత రక్షణలో ప్రావీణ్యము గలవి, సేవకుల ఆపదలను తీర్చేవి, ఇంకా సంసార సాగరానికి నౌక వంటివి అయిన నీ చరణ కమలాలకు నేను 'వందనము' చేస్తున్నాను అని శ్రీభాగవతంలో కలదు.

శాస్త్రాలలో వర్ణించిన భగవత్ స్వరూపానికి, నామానికి ఇంకా లోహాలతో తయారు చేసిన విగ్రహానికి, చిత్రానికి లేదా మానసిక మూర్తికి శారీరకంగా లేదా మానసికంగా, శ్రద్ధా పూర్వకంగా సాష్టాంగ ప్రణామం చేయడం లేదా సమస్త చరాచర భూతాలను, పరమాత్మ స్వరూపంగా భావించి, శ్రద్ధగా, శారీరకంగా లేదా మానసికంగా నమస్కరించడం భగవంతుని ప్రేమలో ముగ్ధులు కావడం వందన భక్తి అవుతుంది.

దేవాలయాలకు వెళ్ళి శ్రద్ధాభక్తి పూర్వకంగా భగవంతుని విగ్రహానికి సాష్టాంగ ప్రణామం చేయడం, తమతమ ఇళ్ళల్లో దేవుని ప్రతిమను, చిత్రపటాన్ని, భగవన్నామాన్ని, భగవంతుని చరణాలను, భగవంతుని తత్త్వ రహస్య ప్రేమ ప్రభావాలను, భగవంతుని రూపాలుగా భావించి శ్రద్ధగా వినయ పూర్వకంగా, సభక్తికంగా, గద్గద భావంతో వందనాలు అర్పించుట వందన భక్తికి కావలసిన వివిధ పద్ధతులు.

శ్రీమద్భాగవతంలో యోగీశ్వరుడైన కవి ఇలా పేర్కొన్నాడు. "ఆకాశం, వాయువు, నరులు, సముద్రాలు, సకల ప్రాణకోటి భగవంతుని శరీరమే కాబట్టి భగవంతుని యెడల అనన్యభక్తి కలవాడు యావజ్జగత్తును భగవంతునిగా భావించి నమస్కరించవలయును" అని అన్నాడు. భగంతుని సర్వత్రా సర్వవ్యాప్తిగా భావించి ఆయనకు ఏవిధంగా నమస్కరించాలన్న విషయంలో అర్జునుడే మనకు చక్కని ఆదర్శప్రాయుడు. అర్జునుడు భగవంతునికి నమస్కరిస్తూ ఇలా అంటాడు. "హే అనంత సామర్థ్యశాలీ! నీకు ముందు వెనుక అన్ని వైపుల నుండి నా నమస్కారాలు, ఓ సర్వాత్మా అమిత పరాక్రమ శాలివైన నీవు అంతటా వ్యాపించి ఉన్నావు. అందువల్ల సర్వమూ నీకే".

భగవంతుని యెడల సాటిలేని ప్రేమను కలిగి భగవంతున్ని పొందడమే ఈ వందన భక్తి ఉద్దేశ్యము. భగవంతునికి ప్రియమైన భక్తుల సాంగత్యం చేస్తూ లబ్ధి పొందుట ద్వారా భగవంతుని

వందన భక్తిలోని రహస్య, ప్రభావ తత్త్వాలను అవగాహన చేసుకోవడం వల్ల ఈ వందన భక్తిని పొందవచ్చును. భగవంతుని రహస్యాలను తెలుసుకొని ఆయనకు నమస్కరించేవాడు సమస్త దు:ఖాల నుండి విముక్తుడు అవుతాడు. వాసుదేవ భగవానుని కంటే అధికమైన మంగళదాయకమైనది లేదు. వాసుదేవుని కంటే అధికతమమైన, పావనమైనది ఇంకొకటి లేదు. ఇంకా వాసుదేవునికంటే శ్రేష్ఠమైన మరో ఆరాధ్య దేవత లేదు. అట్టి వాసుదేవునికి నమస్కరించేవాడు ఎప్పటికీ దు:ఖితుడు కాడు అని మనుస్మృతిలో కలదు. శ్రీకృష్ణ భగవానునికి సమర్పించిన ఒక్క నమస్కారమైనా సరే అది పది అశ్వమేధయాగాలలో చేసిన అవభృత స్నానంతో సమానం అవుతుంది. అంతేకాదు దశాశ్వమేధయాగాలు చేసినవారికి మరోజన్మ ఎత్తాల్సి వస్తుందేమోగాని శ్రీకృష్ణునికి నమస్కరించిన వారికి మరో జన్మంటూ ఉండదని భాగవతంలో కలదు.

శ్రద్ధాబద్ధులై భగవంతునికి నమస్కరించే వాళ్ళ సంగతి అలా ఉంచి ఏ పరిస్థితిలో ఉన్నప్పటికీ భగవంతునికి నమస్కరించడం వల్ల సకల పాపాలు తొలగిపోతాయి. పతితుడు, స్థలితుడు, ఆర్తుడు ఏవిధంగా అయినా "హరయేనమ:" అంటూ పిలిస్తే వారు సకల పాపాల నుండి విముక్తులవుతారు, అనేకమంది భక్తులు ఈ విధంగా నమస్కరించి ముక్తులు అయ్యారు.

కాబట్టి భగవత్ప్రములో సంలగ్నులై పైన పేర్కొన్న విధంగా భగవంతునికి వందన భక్తిని నిర్వర్తించడానికి ప్రాణ పర్యంతమూ ప్రయత్నించాలి.

## 2.7. దాస్యం :

భగవంతుని గుణ, తత్త్వ, రహస్య ప్రభావాదులను తెలుసుకొని భక్తితో ఆయన సేవలు చేయడం, ఆయన ఆజ్ఞలు శిరసావహించడం దాస్యభక్తి అవుతుంది. దేవాలయంలోని దేవతా విగ్రహాలకు సేవలు చేయడం, దేవాలయాన్ని కడిగి, తుడిచి శుభ్రం చేయడం, మానసికంగా దేవునియొక్క స్వరూపాన్ని ధ్యానించి, సేవించడం, సకల చరాచరాలను స్వామి రూపంగా భావించి అందరికీ యథాశక్తిగా యథాయోగ్యంగా సేవలందించడం, భగవద్గీతాది శాస్త్రాలను భగవంతుని ఆజ్ఞగా భావించి దానిని అనుసరించి ఆచరించడం, భగవంతునికి ప్రీతికరమైనవి, సంతోషదాయకమైనవి ఆచరించడం మొదలైనవన్నీ దాస్య భక్తికి సంబంధించిన పద్ధతులు. భగవంతుని గురించి బాగా తెలిసిన జ్ఞానుల,భక్తుల సాంగత్యం ద్వారా కూడా దాస్య భక్తిని పొందవచ్చును. భగవంతుని యెడల సాటిలేని ప్రేమను

పొందడానికి ఆయనను నిత్యమూ సేవించడానికి ఆయనకు సమీపంలోనే ఉండాలనే ఉద్ధేశ్యంతో దాస్యభక్తి ఆచరించబడుతుంది. కేవలం దాస్యభక్తి ద్వారానే మానవునికి సహజంగానే భగవత్ప్రాప్తి సిద్ధిస్తుంది.

లక్ష్మణుడు, హనుమంతుడు, అంగదుడు మొదలైనవారు దాస్య భక్తికి ఆదర్శ ప్రాయులు. శ్రీరామచంద్రుడు అడవులకు వెళ్ళే సమయంలో లక్ష్మణుడు శ్రీరాముని ప్రేమకు వివశుడై, గొంతు విప్పి చెప్పుటకు అసమర్థుడై, వ్యాకులంతో స్వామి పాదాలపై పడి ఈ విధంగా అన్నాడు. "నేను నీ దాసుడను, నీవు నా స్వామివి, కావున నీవే నన్ను విడిచి పెట్టినచో యిక నేనేమి చేయుదును".

సుమిత్రాదేవి లక్ష్మణునితో లక్ష్మణా! కామ, క్రోద, లోభ, మోహ, మద, మాత్సర్యాది షడ్వికారాలకు నీవు కలలో కూడా వశుడవు కారాదు. సకల వికారములను త్యజించి సర్వ విధముల శ్రీసీతారామల సేవ చేయుము. నాయనా! అడవిలో శ్రీరామచంద్రునికి ఎలాంటి కష్టము కలుగకుండా ఆయనకు దాస్యుడువుగా ఉండు అని ఉపదేశించినది.

శ్రీరామభక్త హనుమంతుని జీవితమంతా దాస్యభక్తితో ఉంది. ఋష్యమూక పర్వతం మీద ప్రథమ దర్శనంలోనే శ్రీరామచంద్రున్ని గుర్తించి హనుమంతుడు ఇలా అంటాడు. "ముందుగా నేను మందమతిని, మోహవశుడిని, కుటిల మనస్కుడను, అజ్ఞానిని కావున ఓ దీన బంధూ! నీవు నన్ను మరచితివి కదా ఓ స్వామి నాలో అనేక దోషములు ఉన్నప్పటికీ నీవు నన్ను మరచి పోవద్దు, నీ మాయచేత మోహితుడైన జీవుడు నీ కృపవల్లనే మాయను దాటి పోగలడు. సేవకుడు తన స్వామిపైన, పుత్రుడు తన తల్లిపైన భారం వేసి నిశ్చింతగా ఉండగలడు, కావున తన సేవకుని పోషణ చేయుట స్వామికి తప్పదు కదా!

అలాగే శ్రీరామచంద్రుడు కూడా తన సేవక వాత్సల్యాన్ని వ్యక్త పరుస్తూ హనుమంతుణ్ణి లేవదీసి తన హృదయానికి హత్తుకొని ఆనంద భాష్పాలతో హనుమంతుని శరీరాన్ని అంతా తడుపుతూ ఇలా అంటాడు. "ఓయీ కపీ! వినుము, లక్ష్మణునికంటే నీవే నాకు రెట్టింపు ప్రియమైనవాడవు. అందరూ నన్ను సమదర్శి అంటారు కానీ, అనన్యగతి నొందిన సేవకుడు నాకు మిక్కిలి ప్రియమైనవాడని తెలియుము"

ఇలాంటి ఎన్నో ఉదాహరణలు మనకు కనిపిస్తాయి. కాబట్టి మనమందరము భగవంతుని

యెడల ప్రేమ విహల్వులై మనో వాక్కాయములన్నింటినీ అర్పించి దాస్య భక్తిని ఆచరించవలెను.

### 2.8. సఖ్యం :

"అహెూ భాగ్యమహెూ భాగ్యం నంద గోప ప్రజౌక సామ్।

యస్మిత్రం పరమానందం పూర్ణం బ్రహ్మ సనాతనమ్"॥

(భాగవతం 10-14-32)

"పరమానంద పరిపూర్ణ సనాతన బ్రహ్మయైన పరమాత్మను స్నేహితునిగా కలిగిన నందగోపకులంలో నివసించే ప్రజల భాగ్యం ఎంత ధన్యం, ఎంత ధన్యం" భగవంతుని విశ్వాస పూర్వకమైన మైత్రీ భావంతో ఆయన అభిరుచులకు అనుగుణంగా మెలగడం, ఆయనయందు అనన్య ప్రేమ కలిగి ఉండి, ఆయన గుణ, రూప, లీలాదులను తెలుసుకొని ముగ్ధులై నిత్య నిరంతరంగా ప్రసన్నులై వర్తించడం సఖ్యభక్తిగా చెప్పవచ్చు.

తనకు ఆవశ్యకమైన పనులను సైతం విడిచిపెట్టి తన ప్రియతములైన స్నేహితుని పనులను ప్రేమ పూర్వకంగా నిర్వర్తించడం, ప్రియమైన మిత్రుని పనియందు తన పనిని తుచ్ఛమైనదిగా భావించి, దాని యెడల నిశ్చింతగా ఉండడం, ఇష్టమైన వారికోసం అలసట పొందినప్పటికీ దానిని చాలా స్వల్పమైనదిగా భావించి, స్నేహితుడు ఏయే విషయాలలో ప్రసన్నుడవుతాడో ఆయా విషయాలపై శ్రద్ధ వహించి ఎల్లప్పుడూ సంతుష్టుడై మెలగడం తన వస్తువు ఏదైనా, ఏవిధంగానైనా తన నేస్తానికి ఉపయోగవపడే పక్షంలో పరమానందాన్ని పొందడం, తన శరీరంపైన, వస్తువులపైన, ఆత్మీయత అధికారం ఉన్నట్లే తన ప్రియమైన స్నేహితుని యెడల కూడా అలానే భావించడం, అలాగే అతని వస్తువులపైన, శరీరంపైన తన ఆత్మీయతను భావించడం, తన ధనాన్ని, జీవనాన్ని, శరీరాదులను ప్రియ స్నేహితుని పనులలో నిమగ్నం చేయడం అతనితో ఉండడాన్ని నిరంతరం ఇష్టపడటం, అతని దర్శన, భాషణ, చింతన, స్పర్శలలో ప్రేమతో నిమగ్నమవడం, అతని నామ, రూప గుణ, చరిత్రాదులను వింటూ చెప్పుకొంటూ చదువుకొని ఇంకా వాటిని తలచుకొని అత్యంత ఆనంద భరితం కావడం. ఇతరులు ఎవరి ద్వారానైనా సరే మిత్రుని సందేశాన్ని అందుకొని పరమానంద భరితలు కావడం, అతని వియోగంలో వ్యాకులమవడం, ప్రతిక్షణం స్నేహితుని గురించి కలుసుకోవాలని ఆశించడం, అతనికోసం నిరీక్షిస్తూ ఉండడం మొదలైనవన్నీ "సఖ్యభక్తి" పద్ధతులు.

ప్రియతముడైన స్నేహితునికి సుఖం కలగాలని, తన సఖ్యప్రేమ పరిపూర్ణంగా వృద్ధి పొందాలని అతనితో ఎప్పుడూ వియోగం కలుగకూడదనే ఉద్ధేశ్యంతో ఈ సఖ్యభక్తి కొనసాగించబడుతుంది. సఖ్యభక్తిని పొందడానికి భగవంతునికి ప్రియతములైన మిత్రులతో సాంగత్యం, సేవ, వారి జీవిత చరిత్రలు తెలుసుకొని భగవంతుని యొక్క గుణ, లీలా ప్రభావాలను ప్రియభక్తుల ద్వారా వినవలసి ఉంటుంది. ఈ విధమైన సఖ్యభక్తిలో కూడా మానవుని దు:ఖాలు, దోషాలు తొలగిపోయి, భగవత్ప్రాప్తి, భగవంతుని యెడల మిక్కిలి ప్రేమ కలుగుతుంది. భగవంతుడు ఆ ప్రియభక్తుని వశంలో ఉన్నంత వరకు అతని శాంతి, సంతోషాలు కలుగుతాయి.

శ్రీకృష్ణభగవానుడు ఉద్ధవున్ని ఎంతగా ప్రేమించేవాడో అది తెలిసేలా ఒకసారి అతనితో ఇలా అంటాడు. “సోదరా ఉద్ధవా! నీ వంటి మిత్రుడు అయినవాడు ప్రియతముడైనట్లుగా బ్రహ్మ, శంకరుడు, ఆదిశేషుడు, లక్ష్మీదేవి మొదలైన వారేకాదు, నా ఆత్మకూడా నాకు ప్రియతములు కారు” అని అంటాడు. ఉద్ధవునికి శ్రీకృష్ణభగవానుని యెడల అపారమైన సఖ్యప్రేమ ఉండేది. అందువల్లనే కృష్ణభగవానుడు అతని దగ్గర మనస్సులోని ఏమాట దాచుకొనేవాడు కాదు. తనకు పరమ ప్రేమికులైన గోపికల వద్దకు సందేశాన్ని చేరవేయడానికి శ్రీకృష్ణభగవానుడు ఉద్ధవుణ్ణే సర్వ శ్రేష్ఠునిగా ఎంచుకుంటాడు.

యదువంశీయులకు మంత్రివర్యుడు, సాక్షాత్తు బృహస్పతులవారికి శిష్యుడు, అత్యంత బుద్ధిమంతుడు అయిన ఉద్ధవుడు శ్రీకృష్ణునికి ప్రియాతి ప్రియమైన స్నేహితునిగా ఉండేవాడు. శరణాగతులైన వారి దు:ఖాలను దూరం చేసే శ్రీకృష్ణుడు ఓరోజున అత్యంత ప్రియమైన ఆ భక్తుని చేతులు పట్టుకొని ఆయనతో ఇలా అంటాడు. “ప్రియతమా ఉద్ధవా! నీవు బృందావనమునకు వెళ్ళి నా తల్లిదండ్రులను ప్రసన్నులను చేయుము. అలాగే నా సందేశాల ద్వారా గోప కాంతలకు ఎడబాటు అనే రోగం నుండి విముక్తులను చేయుము”.

మిత్రుని సుదాముని చూసి శ్రీకృష్ణభగవానుడు ఏవిధంగా అతనిని ఆదరించాడోనని చెప్పు సందర్భంలో శుకమహర్షి ఇలా చెప్పాడు. “కమలాక్షుడు శ్రీకృష్ణుడు తన ప్రియసఖుడు, బ్రహ్మర్షి అయిన సుదాముని శరీర స్పర్శతో అత్యంత ఆనంధ భరితుడు అయ్యాడు. ఆయన నేత్రాల నుంచి ఆనందాశ్రువులు ధారలయ్యాయి. అటుతర్వాత సుదామున్ని శయ్యాలంకృతున్ని చేసి శ్రీకృష్ణభగవానుడు స్వయంగా తన చేతులతో పాదాలు కడిగి పూజలు చేశాడు. లోక పావనుడగు భగవానుడు ఆ పాదోదకాన్ని

శిరస్సున చల్లుకున్నాడు. ఇంకా ఆయన శరీరానికి దివ్య గంధాన్ని చందనాన్ని పూసి కుంకుమాదులను దిద్దాడు".

భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రములైన ఈ స్నేహితుల మాటలు అలా ఉంచితే, నిషాద రాజు గుహుడు కూడా భగవంతునితో మైత్రిని నెరపి సంసార సాగరం నుండి తరించాడు. కాబట్టి భగవంతుడొక్కడే మనకు అత్యంత ప్రీతిపాత్రుడు అయినవాడు, అని తలచి మన సర్వస్వం ఆయనయే అని భావించి మిక్కిలి ప్రేమతో సఖ్యభక్తిని సాధించుకోవాలి.

## 2.9. ఆత్మనివేదనం :

వాసుదేవ భగవానుని శరణువేడి ఆయనయందే పరాయణుడైన మానవుని అంత:కరణము అన్ని విధాలా శుద్ధమవుతుంది. అంతేకాకుండా అతడు సనాతన బ్రహ్మను కూడా చేరుతాడు. పరమాత్మ యొక్క తత్త్వ, రహస్య, ప్రభావ, మహత్మ్యాలను తెలుసుకొని మమత, అహంకారాది రహితులై తమ తనువు, మనస్సు, ధనము, పరిజన సహితంగా తమను తాము సర్వకర్మల యందు శ్రద్ధతో అత్యంత ప్రేమగా భగవంతునికి సమర్పణ చేసుకోవడమే ఆత్మనివేదన భక్తిగా చెప్పవచ్చు.

సుఖమైనా, దు:ఖమైనా, మేలైనా, కీడైనా సన్మానమైనా, అవమానమైనా, కీర్తైనా, అపకీర్తయినా, జయమైనా, అపజయమైనా వీటన్నింటినీ పొందేటప్పుడు అవి భగవంతుడు పంపిన కానుకలుగా తలచి సంతోషించాలి. భగవంతుడు ఒక వాద్యకారుడు అయితే ఆయన చేతిలో నేను ఒక వాయిద్యాన్ని అని నిశ్చయించుకోవాలి. ఆయన చేతిలో కీలుబొమ్మలాగా ఆయన కోరిక మేరకు అన్నీ నిర్వర్తించడం, భగవంతుని రహస్యాలను తెలుసుకోవడం కోసం ఆయన  రూప గుణ లీలాదులను వినడం, మననం చేసుకోవడం, కథనం, అధ్యయనం, చింతనాదులతో తనువును, మనస్సును లగ్నం చేయడం, ఇంద్రియాలను, మనస్సు, బుద్ధి మొదలైనవాటి అన్నింటియందు భగవంతునికి మాత్రమే అధికారం ఉన్నట్లు భావించడం. పరమాత్ముని వస్తువులు పరమాత్మునికే అర్పణ చేయబడుతున్నాయనే భావన కలిగి ఉండడం ఏదో విధంగా భగవంతుని సేవ చేస్తూ అందులోనే ఆనందం ఉన్నదని భావించడం, సర్వం స్వామికే అర్పణ చేసి కోరికల్ని, అభిరుచులను, విలాసాలను, విశ్రాంతిని, భోగాలను లేకుండా చేసుకోవడం అన్ని విధాలా ఆ పరమాత్మ అనుభూతినే పొందడం. భగవదిచ్ఛ మినహా స్వతంత్రమైన కోరికలు ఏవీ లేకుండా ఉండడం, భగవంతునిపై విశ్వాసముంచి నిర్భయంగా, నిశ్చింతగా ఆనందంగా

ఉండడం. భగవద్భక్తి తప్ప మోక్షాన్ని కూడా వాంఛించకుండా ఉండడం, వంటివి అన్నీ 'ఆత్మనివేదనభక్తి" లోని పద్ధతులు.

భగవంతుని యందు సాటిలేని ప్రేమను పొందడానికి భగవంతున్ని చేరుకోవడానికి ఆత్మనివేదన భక్తి తోడ్పడుతుంది. భగవంతుని శరణాగతి పొందిన ప్రియభక్తులతో సాంగత్యం చేయడం, వారికి పరిచర్యలు చేయడం, వారి ద్వారా భగవంతుని నామ, రూప, గుణ, ప్రభావ తత్త్వ మహాత్మ్యాలను వినడం ద్వారా, వాటిని మననం చేయడం ద్వారా ఈ ఆత్మనివేదన భక్తిని సాధించవచ్చు.

నన్ను ఆశ్రయించిన వాళ్ళు ఎవరైనా సరే, వారు పాపాత్ములుగాని, స్త్రీలుగానీ, పురుషులుగానీ, వైశ్యులుగాని, శూద్రులుగానీ పరమగతినే పొందుతారు. కేవలం సచ్చిదానంద వాసుదేవుడైన నాయందే అనన్య ప్రేమతో, నిత్యనిరంతరంగా అచంచలమైన మనస్సును నిలిపి పరమేశ్వరుడును అయిన నన్ను ప్రేమపూర్వకంగా, నిష్కామభావంతో, నామ, గుణ, ప్రభావాలను శ్రవణ, కీర్తన, మనన, పఠనాదుల ద్వారా నిరంతరం భజించాలి. మనోవాక్కాయ కర్మల ద్వారా సర్వస్వాన్ని అర్పణచేసి, మిక్కిలి శ్రద్ధ, భక్తి, ప్రేమలతో నన్ను పూజించాలి. సర్వశక్తిమంతుడును, విభూతి, జల, ఐశ్వర్య, మాధుర్య, గాంభీర్య, ఉదార, వాత్సల్య సహృదయాది గుణసంపన్నుడును, సర్వులకు ఆశ్రయుడును, వాసుదేవుడైన నాకు వినయ పూర్వకంగా, భక్తితో సాష్టాంగ ప్రణామం చేయాలి. ఈ విధంగా నన్ను ఆశ్రయించి నామీదనే మనస్సు నిలిపితే వారు నన్ను పొందుతారు అని శ్రీకృష్ణుడు తెలిపాడు.

ఇంకా అన్ని విధాల ఆ పరమేశ్వరున్నే శరణువేడుకోవాలి. ఆయన దయవల్ల పరమ శాంతిని, సనాతన పరమానందాన్ని పొందెదవు నీవు. సర్వ ధర్మాలను అనగా సకల కర్తవ్యకర్మలను, నాయందే త్యజించి, నీవు కేవలము సర్వశక్తిమంతుడను, సర్వసాధారుడును, పరమేశ్వరుడను అయిన నన్నే ఆశ్రయించుము. నిన్ను సర్వ పాపముల నుండి విముక్తుడను చేసెదను. నీవు విచారింపకుము అని తెలిపాడు.

ఈ విధంగా భగవంతునికి ఆత్మనివేదన చేసుకున్న మానవునికి చెడులక్షణాలు, పాపాలు, దు:ఖాలు సమూలంగా తొలగిపోతాయి. అంతేకాకుండా అతనిలో శ్రవన కీర్తనాది సకల విధములైన భక్తులూ, వృద్ధి పొందుతాయి. అతని ఆనందానికి, శాంతికి అవధులు ఉండవు. భగవంతుడు కూడా అతన్ని విడిచి ఉండలేడు. భగవంతుని సర్వస్వమూ అతనిదే అవుతుంది. ఇంకా అతడు పరమ

పవిత్రుడై అతని దర్శన, భాషన, చింతనాదుల వల్ల పాపాత్ములు సైతం పవిత్రులు అవుతారు.

భగవంతుని ప్రేమను మూర్తీభవించుకొన్నటువంటి భక్తులు నిఖిల ప్రపంచమూ, పరమ ప్రేమ మయంగా, పరమానంద భరితంగా తెలుసుకుంటూనే ఉంటుంది. వారు వెళ్ళిన మార్గంలోనే శ్రద్ధ, ప్రేమ, భక్తి, ఆనందము, సమత, శాంతి మొదలైన వాటి ప్రవాహం నడుస్తూనే వుంటుంది. అటువంటి భక్తులను భూతలం మీద ధరించిన భూమాత ధన్యమవుతుంది. గోపకాంతలు, బలిచక్రవర్తి మొదలైనవారు ఈ ఆత్మనివేదన భక్తియందు పేర్కొనదగిన పరమ భక్తులు. కాబట్టి మానవ మాత్రులైన మనం నడుంబిగించి మనోవాక్కాయ కర్మల ద్వారా అన్ని విధాల ఆ భగవానుని ఆశ్రయించడానికి కృషి చెయ్యాలి.

భగవంతున్ని చేరడానికి కర్మ, యోగ, జ్ఞాన, భక్తి మార్గాలన్నీ ఉత్తమమైనవే. అయితే భక్తి గురించి మాత్రం శాస్త్రాలలో పేర్కొనబడింది. నవవిధ భక్తులలో ఏభక్తి ఉన్నా, ఆ భక్తుడు సంసార సాగరాన్ని సులభంగా దాటి భగవంతుణ్ణి చేరగలడు. అలాంటప్పుడు ప్రహ్లాదుని వలె నవవిధ భక్తి రీతులు వృద్ధి పొందిన వాని విషయం వేరే చెప్పనవసరం లేదు. నవవిధ భక్తుల గురించి వివరించేటప్పుడు ఉదహరించిన భక్తుల పేర్లనుబట్టి వారిలో ఒకే ఒక భక్తి వృద్ధి చెంది ఉన్నట్లు భావించకూడదు. ఎవరెవరిలో ఏ భక్తి భావం ఉన్నదో, దానిని బట్టి పేర్లు చెప్పడం జరిగింది. నిజానికి భగవంతుని భక్తిలో తమ మనస్సు లగ్నం చేసిన వారు ధన్యులు. భగవద్భక్తులు ఉద్భవించినవారి వంశం కూడా ధన్యమే.

శ్రీమద్భాగవతంలో నవవిధ భక్తుల గురించి ఇలా వర్ణించబడింది. పదేపదే భగవంతుని చరిత్రను వింటూ, గానం చేస్తూ, వర్ణిస్తూ, స్మరించుకుంటూ ఆనంద భరితులయ్యే భక్తులే శీఘ్రంగా ఈ సంసార సాగర ప్రవాహాన్ని శాంతపరిచే భగవంతుని దర్శనాన్ని పొందుతారు. ఇంకా ఎవరి కీర్తనం, స్మరణం, దర్శనం, వందనం, శ్రవణం ఇంకా పూజ మానవుల సకల పాపాలను కడిగివేస్తాయో ఆ కల్యాణ దాయకుడు, కీర్తి శాలియైన భగవంతునికి  పదేపదే ప్రణామాలు పరమ కల్యాణమయుడైన శ్రీకృష్ణభగవానుని యందు ప్రేమగలవారు అమృతంతో ఉంటారు. ఎవరు నా నామ, గుణ, లీలాదులను వర్ణిస్తూ వారి గొంతు గద్గదమవుతుందో, ఎవరి మనస్సుచిత్తము నా రూప, గుణ, ప్రభాత లీలాదులను స్మరిస్తూ, స్మరిస్తూ ఆర్ద్రమవుతుందో, ఎవ్వరు పదేపదే రోదిస్తూ అప్పుడప్పుడూ నవ్వడం ఆరంభిస్తారో, ఎవరు లజ్జను విడిచి పెట్టి ప్రేమనిండిన వాడై పిచ్చివానిలా గానం చేస్తూ నాట్యంలో మునిగి పోతాడో

అటువంటి భక్తులు ఈ ప్రపంచాన్ని పునీతం చేస్తారు.

కాబట్టి మానవులందరూ నవవిధ భక్తి పద్ధతుల ద్వారా భగవద్భక్తిని ఆశ్రయించి తమ జీవితాన్ని, జన్మను సఫలం చేసుకోవాలి.

# మూడవ అధ్యాయం

## 3. తెలుగు సాహిత్యంలో ప్రతీకలు

మొదట ప్రతీకలు భారతీయ సాహిత్యంలో చాలా పురాతన కాలం నుంచి కనిపిస్తున్నాయి. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలలోనే కాకుండా అనేక రచనలలో కూడా ప్రతీకలు కనిపిస్తాయి. అలాగే మనం ప్రతిరోజూ మాట్లాడే మాటలలో కూడా ప్రతీకలు ఉంటాయి.

ప్రతీక అంటే 'గుర్తు' అని అర్థం. దీన్ని ఆంగ్లంలో " సింబాలిజం " అంటారు. సింబాలిక్ అంటే గుర్తు లేదా సూచిక అని అర్థం. ఇంకా ప్రతీక అనగా 'అనురూపం' అని కూడా అర్థం కలదు. ఒక భావాన్ని సంకేతించి చెప్పడానికి ప్రతీకలు ఉపయోగపడుతాయి. సాహిత్య ధర్మాలు సంక్షిప్తత, ఉదాత్తత. ఇవి ప్రతీకల ద్వారానే సార్థకం అవుతాయి. ప్రతీకలను ఆవిష్కరించడం ద్వారా సాహిత్య విమర్శనా పద్ధతి కొనసాగుతుంది. భారత, భాగవత, రామాయణాలలో కూడా ప్రతీకల ఆవశ్యకత కనిపిస్తుంది.

లోకంలో ఒక అంశాన్ని నొక్కి చెప్పవలసి వచ్చినప్పుడు కొన్ని దృష్టాంతాలను, ఉదాహరణలను, ప్రతీకలను, అలంకారాలను ప్రయోగించాలి. అప్పుడు ఇవన్నీ ప్రధాన కథకు పుష్టిని కలిగిస్తాయి. ప్రధాన కథలలోని పరమార్థాన్ని చెప్పడానికి ఉపకథలు తోడ్పడుతాయి. ఉపకథలలో స్త్రీలు, పురుషులే కాకుండా తిర్యక్కులు కూడా పాత్రలుగా సాక్షాత్కరిస్తాయి. అయితే ఈ పాత్రల సమ్మేళనంలో చక్కని నైతిక సందేశం, ప్రతీకాత్మకత దాగి ఉంటుంది.

"భక్త్యా భాగవతం జ్ఞేయం" – భాగవతం వల్లనే భగవంతుని తత్త్వం బోధపడుతుంది. భాగవతం ఒక భక్తి గని వంటిది. భాగవతాన్ని శ్రీకైవల్య పద దృష్టితో తెలుగులో రచించడంలోనే భాగవతత్త్వం తేట తెల్లమవుతుంది.

భాగవతంలో ప్రతిపాద్య వస్తువు – శ్రీకృష్ణుడు

ప్రతిపాదనా స్వరూపం – హరికథా గానం

ఫలశ్రుతి – కైవల్యం ప్రతీకలుగా చెప్పబడ్డాయి

భాగవతంలోని విషయాలు గంభీర్యమైనవి

కవి ఉద్దేశించిన అర్థం తెలిశాక ఆనందాన్ని పొందుతారు. ప్రతీకలు చెప్పడం వల్ల పాఠకులు,

శ్రోతలు ఎక్కువ విషయాన్ని గ్రహించి చాలా కాలం పాటు గుర్తు పెట్టుకునే అవకాశం ఉంటుంది. దేన్నైనా ప్రతీకలతో రచిస్తే పాఠకుల గుండెల్లోకి వెళ్ళేలా ఉంటుంది. భాగవతం అష్టాదశ పురాణాలలో ఒకటి. పురాణాలు మిత్ర సమ్మితాలు. అంటే కష్టాలలో ఉన్నప్పుడు మన మిత్రుడు ఓదార్చే విధంగా పురాణాలు ఉంటాయి. వీటిని ప్రతీకల ద్వారా చెప్తే పాఠకులు, శ్రోతలు గుండెల్లోకి చొచ్చుకొని పోతుంది.

భాగవతం యొక్క ఆవశ్యకత ఏమిటి అంటే ఈ కలియుగంలోని మనుషులు అందరూ బద్ధకం అనే వ్యాధితో బాధపడుతూ ఉంటారు. మందబుద్ధితో అధిక బలాన్ని కలిగి ఉంటారు. అందువల్ల దైవాన్ని ఆరాధించి నిజాన్ని తెలుసుకోలేక పోతున్నారు. అంటే వీరు అజ్ఞానులు, మంద బుద్ధులు. అంతేకాదు ఎంత బాగున్నా రేపటి రోజున ఏమౌతుందో అనే భయంతో దిగులు చెందుతూ జీవించే అజ్ఞానులు. పోనీ ఈ అజ్ఞానం తొలగడానికి ఏవైనా సుకర్మలు చేస్తారా అనుకుంటే అలాంటివి చేయరు. అంటే ప్రారంభించిన పనిని పూర్తీ చేసే సామర్థ్యం వీరికి ఉండదు కారణం ఈ మందభాగ్యులు కలియుగ మానవులు కావడమే. ఎవరైనా, ఏదైనా సుకర్మ ప్రారంభించగానే దీని వలన ప్రయోజనం ఉంటుందా? ఇది అవసరమా అనే సందేహం కలిగే జనులే ఈ కలియుగంలో ఎక్కువగా ఉన్నారు. ఇటువంటి వారికి ఏది శాంతిని ఇస్తుంది? వీరికి తరుణోపాయం ఏమిటి? దీనిని ఆలోచించి వ్యాస మహర్షి లోకానికి భాగవతం అందించాడు. తెలుగుల పుణ్యపేటి పోతనామాత్యులు దీనిని ఆంధ్రీకరించారు.

భాగవతంలోని ప్రతికథ ప్రతీకాత్మకంగానే ఉండి, అందులోని పరమార్థాన్ని తెలియజేస్తుంది. ఎందుకంటే జీవేశ్వరులు ఇద్దరూ కూడా పురాణ మిత్రులు. జీవుడు తనయొక్క అల్పత్వం చేత తరచుగా సృష్టి చక్రంలోకి వస్తుంటాడు. అయితే అతడు భక్తుడు అయి ఉంటే అతని చుట్టూ ఎన్ని కష్టాలు వచ్చినా అతనిని తనవానిగా చేసుకొని ఈశ్వరుడు రక్షిస్తాడు. భక్తుడు కాకపోయినా ఆ ఈశ్వరుడు దయాసాగరుడు, కరుణా సముద్రుడు కాబట్టి సామదాన బేధ దండోపాయాలు ఉపయోగించి జీవునికి చేయూత ఇచ్చి ఆదుకుంటాడు.

భగవంతుడు ఎవరు ఏ భావంతో స్మరిస్తే, ఆ రూపంలోనే కనిపిస్తాడు. తర్కించడంలో ఆసక్తి కలవారికి తర్క స్వరూపంగా, వేద పఠనంలో ఆసక్తి కలిగిన వారికి వేద స్వరూపంగా ఇలా ఎవరికి నచ్చిన విధంగా వారికి దర్శనమిచ్చి, మనవాడుగా, స్నేహితుడుగా ఉంటాడు. అది మనకు నచ్చిన

రూపమే కానీ అది భగవంతుని స్వరూపం కాదు. **ఈయనకు రూపం లేదు.** భగవంతుని స్వరూపానికి ఈ సృష్టియే ప్రతీక. భగవంతుడు సృష్టి స్వరూపం అయి కనబడుతూ, కాల స్వరూపంలా కదలి పోతుంటాడు.

పోతన భాగవతంలో శ్రీకృష్ణుడు గోపబాలురతో కలిసి చల్దులారగించే సందర్భంలో మనుషుల యొక్క వివిధ రకాలైన మనస్తత్త్వాలను వీరి చేష్టల ద్వారా ఈ క్రింది పద్యంలో తెలియజేస్తున్నాడు

సీ॥ మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు
నూరగాయలు దినుచుండు నొక్క
డొకని కంచంలోని దొడిసి చయ్యన మ్రింగి
చూడు లేదని నోరు సూపు నొక్క
డేగు రార్గుర చల్ది లెలిమి బన్నిద మాడి
కూర్చొని కూర్చొని కుడుచు నొక్క
డిన్న యుండగ బంచి యిదుట నెచ్చల
తన మనుచు బంతెన గుండులాడు నొక్క

ఆ॥ కృష్ణ జూడు మనుచు గికురించు పరుయ్యోలి
మేలి భక్ష్యరాశి మెసగు నొకడు
నవ్వునొకడు సఖుల నవ్వించు నొక్కడు,
ముచ్చడాడు నొకడు మరియు నొకడు

(పోతన భాగవతం–దశమస్కంధం పూర్వభాగం, 496వ పద్యం)

ఈ పద్యానికి ప్రతీకగా భగవంతుడు ప్రసాదించిన వాటిని ఒకడు నావే అని గొప్పలు చెప్పుకుంటూ అనుభవిస్తాడు. ఇంకొకడు భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తి పడకుండా, మరొకరి సొమ్మును దొంగిలించి తనకు ఏమీ తెలియదని అన్నట్లు నటిస్తాడు. మరొకడు వేరొకరి మీద పంతంతో కష్టపడి, బలవంతంగా ఐశ్వర్యాన్ని సంపాదిస్తాడు. వేరొకడు భగవంతుడు ఇచ్చిన దానిని పంచి దానలక్షణం అని ప్రచారం చేసుకుంటాడు. ఇంకొకడు భగవంతుని పేరు చెప్పి ప్రజల నుండి దోచుకొని అనుభవిస్తాడు. ఒకడు ఇచ్చిన దానిని దైవ స్వరూపంగా భావించి తృప్తి పడతాడు. మరొకడు అలా తృప్తి పడడమే కాకుండా

తన వారిని కూడా తృప్తి పరుస్తాడు. ఒకడు తనకున్న ఐశ్వర్యం అంతా ప్రదర్శనకు పెట్టి ముచ్చట పడతాడు. ఇంకొకడు దానిని చూస్తూ మురిసిపోయి సంతోషపడతాడని ప్రతీకాత్మకంగా తెలిపాడు.

చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ,
బంగారు మొలత్రాడు పట్టు దట్టి
సందె తాయెతులను, సరిమువ్వ గజ్జెలు
చిన్ని కృష్ణ చేరి నిన్ను కొలుతు

ఈ పద్యంలో బాలకృష్ణుని రూపాలకు ప్రతీకలుగా చెప్పబడ్డాయి. వెన్న– రుచికి, పూపు – సువాసనకు, బంగారు – రంగుకు ప్రతీకలుగా వర్ణించబడ్డాయి. తర్వాత బాలకృష్ణుడు ధరించిన పట్టుదట్టి, సందెతాయతులు, సిరిమువ్వ గజ్జెలు దేన్నైనా సాధించడానికి నడుం బిగించి ముందడుగు వేయాలనే సందేశాన్ని ఇస్తున్నాయి.

భాగవతంలోనే శ్రీకృష్ణుని బాల్యక్రీడలు ఆడుతూ గోపికలను ఆటపట్టించిన సందర్భంలో గోపికలు, యశోద దగ్గరకు వచ్చి బాల్యకృష్ణుని గురించి తెలియజేసే సందర్భంలో ఈ విధంగా మొరపెట్టుకున్నారు.

బాలురకు పాలు లేవని బాలింతలు
మొఱలు వెట్ట పకపక నగియీా
బాలుండాలము సేయుచు నాలకు
గ్రేపులని విడిచె నంబోజాక్షి

(పోతన భాగవతం–దశమస్కంధం పూర్వభాగం, 307వ పద్యం)

ఈ పద్యంలో ఆవు మొదట తన దూడ తాగినన్ని పాలు త్రాగనిచ్చి ఆ తర్వాత మిగిలిన పాలను వాడుకోవాలనే ధర్మం ఇందులో కనిపిస్తుంది. కానీ దూడలు కట్టివేయబడి బంధనంలో ఉన్నాయి. అవి ఒక నియమిత కాలంలో వాటి బంధనాలను తొలగించుకుంటాయి. అలాగే మానవులు కూడా కర్మ బంధంలో చిక్కుకొని ఉంటారు. కర్మ అనుభవించనంత వరకు బంధ విముక్తులు కాలేము. శ్రీకృష్ణుడు గోకులంలోని దూడలు 'అంబా' అని అరవగానే వాటి బంధనాలు తొలగించి వాటికి ముక్తిని ప్రసాదిస్తాడు. అలాగే సంసార బద్ధులైన మానవులు గోవింద నామాన్ని స్మరించగానే నిర్ణయ కాలానికి ముందే శ్రీకృష్ణుడు బంధ విముక్తులను చేసి మోక్షం ప్రసాదిస్తాడని ఇందులోని అంతరార్థం.

శ్రీకృష్ణుడు పైకి వేలాడదీసి ఉన్న ఉట్టిలోని కుండలను పగలగొట్టి పాలను, పెరుగును దొంగిలించినట్లు, ఆత్మవిచారమనే రాయితో మస్తకమనే ఉట్టిలోని అజ్ఞానమనే కుండను పగులగొట్టి జ్ఞానమనే పాలను త్రాగాలనేదే ఈ వినోద క్రీడలోని ప్రతీకాత్మకత.

బ్రహ్మ ఒకసారి, దేవతలతో ఈ విధంగా చెప్పాడు. దేవతలారా! నా కుమారులైన సనకుడు, సనందుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు సంసారం చేత విరక్తులై విహరిస్తూ ఒకరోజు వైకుంఠానికి వెళ్ళి వైకుంఠంలోని ఆరు ద్వారాలను దాటి ఏడవ ద్వారంలోకి ప్రవేశిస్తుండగా అక్కడ ఉన్న ద్వారపాలకులు జయ, విజయులచే అడ్డగించబడ్డారు. సాధకుని యొక్క తపస్సు, దానం, సత్యం, పవిత్రత అనే అంశాలే వైకుంఠాన్ని దాటడానికి వచ్చిన సనకాది మునులకు ప్రతీక. ఈ మునులు వృద్ధులైనా 5 సం॥ల పిల్లలు వలె ఎప్పుడూ కనిపిస్తారు. సాధకుని వృద్ధత్వం జ్ఞానానికి ప్రతీక.

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు వైకుంఠ ఆరు ద్వారాలకు ప్రతీకలు. అడ్డగించబడిన ఏడవ ద్వారం అహంకారానికి ప్రతీక. అరిషడ్వర్గాలను జయించిన సాధకుడు సైతం, కీర్తి కాంక్షను జయించలేకపోతున్నారు. ఈ కీర్తి కాంక్షలే జయ విజయులకు ప్రతీక.

యమపురి యమమనే సద్గుణానికి ప్రతీక. యమం అనే సద్గుణం చేతిలో అహంకారం చనిపోతుంది. ఈ అహంకారం చనిపోవడం వల్ల సాధకునికి, బంధువులు, తన అనేవారు ఉండరు. అందరినీ ఒకటే విధంగా చూస్తాడు. అలాగే మిట్ట మధ్యాహ్నంనకు అటూ ఇటూ రెండు గడియల కాలంలో హిరణ్యాక్షుణ్ణి చంపమని బ్రహ్మ వరాహ మూర్తిని వేడుకుంటాడు. ఇక్కడ మిట్ట మధ్యాహ్నం నడి వయస్సుకు ప్రతీక. ముసలితనం అస్తమ సంధ్యాసమయానికి ప్రతీక. వరాహం అంటే శ్రేష్ఠమైనదని అర్థం. వరాహం జ్ఞానం ఉదయించడానికి ప్రతీక.

భాగవతంలోనే స్వాయంభువ మనువు కుమారుడు ఉత్తాన పాదుడు కలడు. ఉత్తాన పాదుడు అంటే పాదాలను పైకి పెట్టి ఉండిన వాడని అర్థం. ప్రతి మనిషి కూడా తల్లి గర్భంలో ఉన్నప్పుడు తల క్రింద భాగంలో, పాదాలు పై భాగంలో పెట్టబడి ఉంటాయి. అందుకు ప్రతి మనిషి ఉత్తాన పాదునకు ప్రతీక. ఉత్తాన పాదునికి సునీతి, సురుచి అనే ఇద్దరు భార్యలు కలరు. చక్కని ధర్మమునకు సునీతి ప్రతీక. విషయ సుఖాల పట్ల ప్రీతి కలదానికి సురుచి ప్రతీక. ఉత్తాన పాదునకు సురుచి మీద ఎక్కువ ప్రేమ కలదు. కారణం మానవులు రుచికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కానీ నీతికి ప్రాధాన్యం ఇవ్వరు

కాబట్టి. కనుక సురుచి ప్రేమకు ప్రతీక. ఉత్తాన పాదుడు పెద్దభార్య అయిన సునీతిని ప్రేమించక, చిన్న భార్య అయిన సురుచిని ప్రేమిస్తాడు. అంటే మానవుడు పెద్దదైన బ్రహ్మాన్ని అభిమానించక, అల్పమైన ప్రపంచం మీద ఆశలు పెట్టుకుంటాడని ప్రతీక.

ఉత్తాన పాదునికి సునీతి వలన ధ్రువుడు అనే కుమారుడు జన్మించాడు. ధ్రువమంటే నాశనం లేనిది, స్థిరమైనది అని అర్థం. ధ్రువుడు ఆనందానికి ప్రతీక. ఈ ఆనందాన్ని జీవుడైన ఉత్తాన పాదునకు కలుగకుండా సురుచి నియంత్రిస్తుంది. ఎందుకంటే జీవుడు భక్తియుతుడైతే తన చరిత్ర ముగిసి పోతుందని సురుచి చింతిస్తుంది.

సునీతి మాటలు విని ధ్రువుడు ఇంటిని విడిచి వెళ్ళగా నారదుడు అతడిని యమునా నదీ తీరం పిలుచుకొని పోయి, వాసుదేవ మంత్రాన్ని ఉపదేశించి, వెళ్ళిపోయాడు. ధ్రువుడు సవతి కొడుకు కన్నా పెద్ద పదవి కావాలని సాధన చేశాడు. సాధకుడు సాధన చేస్తున్నప్పుడు అతనిలోని మనోవృత్తులు నిశ్చల స్థితికి వచ్చినప్పుడే అతనిలో ఉన్న పరమాత్మ సాధకుని బుద్దిని గోచరిస్తుంది. ఇదే దేవతల మొర విని శ్రీమన్నారాయణుడు ధ్రువునకు సాక్షాత్కరించడానికి ప్రతీకార్థం. ఇక్కడ శ్రీహరి, దేవతలు సాధకునిలోని ఆనందరూపానికి పరమాత్మను ప్రకాశింపజేసే సత్యవృత్తులకు ప్రతీక.

శ్రీహరి ధ్రువునికి ఇరవై ఆరు వేల సంవత్సరాలు రాజ్యం పాలించిన తర్వాత ధ్రువమండలాన్ని చేరుకుంటావని వరమిచ్చాడు. ఆధ్రువ మండలం శాశ్వతమైన జనన మరణ రాహిత్యానికి ప్రతీక. ఇక్కడ ఇరవై ఆరువేల సంవత్సరాలు దశేంద్రియాలకు, పంచభూతాలకు, అంత:కరణ చతుష్టయ జీవుడు, పరమాత్మలకు ప్రతీక.

భాగవతంలో కాళీయమర్ధన కథలో కాళీయుడు ఒక సర్పం. యమునానది ఒడ్డున ఒక మడుగులో ఉంటూ విషం చిమ్ముతూ ఉండేవాడు. ఆ మడుగులోని విషపు నీళ్ళు తాగి పశువులు మరణించేవి. పశువుల కాపరులు కూడా మరణించేవారు. అందుకు శ్రీకృష్ణుడు కాళీయుని తలపై ఎక్కి మర్ధన చేసి కాలితో తొక్కి నువ్వు ఇక్కడ ఉండకుండా సముద్రానికి వెళ్ళు అని ఆదేశించాడు.

శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన కథలో యాదవులు అందరూ ఇంద్రుడికి ఉత్సవాలు చెయ్యాలని నిశ్చయించుకున్నారు. దీనికి కృష్ణుడు అడ్డుతగిలి, మనకు ప్రతిరోజూ పండ్లు, కాయలు, ఎన్నోరకాలుగా మనకు మేలు చేసే ఈ గోవర్ధన పర్వతాన్ని పూజించకుండా ఎక్కడో ఉన్న ఇంద్రున్ని

పూజించడం భావ్యం కాదని శ్రీకృష్ణుడు పట్టుపడ్డాడు.

ఈ కథలో ప్రకృతిని పూజించి, ప్రకృతిని కాపాడుకోవాలని ప్రతీకగా శ్రీకృష్ణుడు పరోక్షంగా తెలిపాడు. చెట్లు మనకు ప్రాణవాయువును అందించే ప్రాణదాతలకు ప్రతీకలుగా చెప్పాడు. గాలి, నీరు, ఆహారం దొరకని పరిస్థితులను ప్రకృతిని నాశనం చేసి మనమే ఆహ్వానిస్తున్నాం. కృష్ణుడు బోధించిన ప్రకృతి పూజను మనం పాటించాలి. అప్పుడే ఆ ప్రకృతి మనల్ని కాపాడుతుందని గోవర్ధన పర్వతాన్ని ఎత్తన కథలో ప్రతీకాత్మకంగా కనిపిస్తుంది.

భాగవతంలో పూతన గుండెల నిండుగా విషాన్ని నింపుకొని, ఆ విషాన్ని పాల రూపంలో కృష్ణుడికి ఇచ్చి, కృష్ణున్ని చంపాలనుకుంటుంది. ఆ విషం గ్రహించిన కృష్ణుడు పూతన స్తనమును కొరికి పాలతో పాటు ఆమె ప్రాణమును కూడా హరించాడు. గుండెల నిండా విషాన్ని నింపుకొని, పైకి చిరునవ్వుతో నటిస్తూ సమయం చూసి కాటేసేవాళ్లు ఈ సమాజంలో చాలామంది ఉన్నారు. వీరందరూ పూతన పాత్రకు ప్రతీకలు. తియ్యటి మాటలతో దగ్గర చేరి, పుట్టిన బిడ్డలను పురిటిలోనే మాయం చేసే పూతనలకు ఈకాలంలో కొదువ లేదు. అలాంటి పూతనల మాయలో పడకుండా శ్రీకృష్ణుని లాగా వారిని సంహరించాలని ఈ కథలోని ప్రతీకాత్మకత.

భగవంతుని దివ్య స్వరూపం గురించి ప్రతీకలుగా భాగవతంలో ఇలా వర్ణించబడింది. తేజోమయమైన భగవంతుని కన్నులు సమస్త సృష్టికి మూలస్థానాలు. సూర్యుడు, గ్రహాలు, నక్షత్రాలు భగవంతుని కనుగ్రుడ్లకు ప్రతీక. అన్ని దిశలా వినగలిగే ఆయన చెవులు సకల వేద వేదాంగాలకు ప్రతీక.

భాగవతంలోని శ్రీకృష్ణుని వెంట ఉండే గోపికలు మధురభక్తికి ప్రతీకలు. వారిలో ఆర్తి ఉంది, తెలుసుకోవాలనే కోరిక ఉంది, వారికి జ్ఞానమూ ఉంది. కాబట్టి వారందరూ తమ ఇళ్ళూ వాకిళ్ళూ వదిలిపెట్టి శ్రీకృష్ణుని వైపు పరుగులు తీశారు. జీవులందరూ భగవంతునిలో కలిసిపోవడానికి పడే తహతహే మధురభక్తి. శ్రీకృష్ణుడు గుణాతీతుడు కాబట్టి వారందరినీ తనలో ఐక్యం చేసుకున్నాడు.

భగవంతుని అవతారాలన్నీ మానవ పరిణామానికే ప్రతీక. ఎలాగంటే భగవంతుడు మొదట మత్స్యంగా, తర్వాత వరాహంగా, ఇలా అనేక అవతారాలలో తన మహిమలను చూపాడు. మత్స్యం పూర్తిగా జలచరజీవి. అంటే జీవి ఎదగనిస్థితి. తర్వాత అవతారాలలో కొంత ఈ స్థితి నుంచి మార్పు

వచ్చి శక్తివంతమైనవి. వరాహం అంటే మనకు ఏహ్యాభావం కలుగుతుంది. కనుక స్వరూపాలకు అతీతంగా మనిషి సహ్యాభావాన్ని నేర్పడం కోసం భగవంతుడు అనేక అవతారాలుగా అవతరించాడు. ఇంకా వామన, శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాలు సంపూర్ణమైన మనిషి ప్రగతి స్వభావానికి ప్రతీకలు.

మంచి చెడుల మధ్య జరిగే మనో మధనమే సముద్ర మధనం. ఇందులో మొదట విషం పుట్టడానికి కారణం ఏమిటి అంటే మనిషి ఎప్పుడూ వక్రబుద్ధితో ఉంటాడని, తదనుగుణంగా దురాలోచనలు కలుగుతుంటాయి. దురాలోచనలు పుట్టడం విషానికి ప్రతీక. సదాలోచన పుట్టడం అమృతానికి ప్రతీక. ఇందులో క్షీరసాగరం ముద్దగట్టిన చైతన్యమని, మూల పదార్థానికి ప్రతీక. సృష్టిలో తెలివి తేటలతో ఉండే వారికి దేవతలు ప్రతీక. మంధర పర్వతం భౌతిక సృష్టి ధర్మాల సమూహార స్వరూపానికి ప్రతీక. వాసుకి (పాము) బ్రహ్మాండ కాలస్వరూపానికి ప్రతీక. కూర్మం జలస్థితిలో నుండి ఘన పదార్థంగా రూపొంది గట్టిపడే ధర్మానికి ప్రతీక.

సృష్టి నిర్మాణంలో పనిచేసే వారు దానవులు, అందులోని నైపుణ్యాన్ని నిర్ణయించేవారు దేవతలు. కాలం చరచరా పాములా సాగిపోతుండగా, దాని తల భవిష్యత్తుతోనూ, తోక భూతకాలంతోనూ, పాము నడిమి భాగం వర్తమాన కాలంగా ఉంటుంది. అంటే భూత భవిష్యత్ వర్తమాన కాలంలో కలుస్తుంటాయి. పాము ప్రాకుతూ పోవడానికి కాలాలు కూడా ప్రాకుతూ పోతుంటాయని ఈ కథలోని ప్రతీకాత్మకత.

క్షీర సాగర మధనంలో మొదట ఉద్భవించిన హాలాహలం విఘ్నానికి ప్రతీక. దానిని తాగిన పరమేశ్వరుడు సృష్టి నిర్మాణ ప్రక్రియను కొనసాగించగల మహత్మ్యానికి ప్రతీక. అన్ని వర్గాలను ప్రేమించి, శుభాన్ని కోరే మహాత్ముడు విఘ్నాలను అదుపులో ఉంచి, అందరి ఆవేశాలను తాను భరించి నిర్మాణ ప్రక్రియను కొనసాగిస్తాడు. తర్వాత ఉద్భవించిన కామధేనువు భూమికి ప్రతీక. భూసారమే క్షీరానికి ప్రతీక. సూర్యకిరణాల వల్ల భూసారమే జీవులకు ఆహారమవుతుంది. సూర్యకిరణాలు దేవర్షులకు ప్రతీక. ఉచ్చైశ్రవం ప్రాణాగ్నికి ప్రతీక. మానవుని శరీరంలో జలస్థితిలోనున్న రక్తంలో ప్రాణాగ్ని ఉంటుంది. అదే మానవుని శక్తికి ఆధారమవుతుంది. భౌతికమైన శక్తి రాక్షసుల చేతిలో ఉంటుంది. దీనిని బలిచక్రవర్తి స్వీకరించాడు.

తర్వాత ఉద్భవించిన ఐరావతం విద్యుత్‌కు ప్రతీక. మేఘాలను దానిలో పుట్టే విద్యుత్‌ని ఆధారంగా

చేసుకొని ఇంద్రుడు వర్షం కురిపిస్తేగాని భూమిపై చెట్లు మొలకెత్తవు. మానవ దేహంలోని ఈ విద్యుత్ నాడీమండలంలో ఉష్ణ ప్రసారంగా పనిచేస్తుందనడానికి ప్రతీక.

కల్పవృక్షం, వనస్పతీ, ఔషద రాశులకు ప్రతీక. మనిషి ఆకలి తీర్చడానికి వనస్పతులు ఉపయోగపడతాయి. చంద్రుడు మనస్సనే ప్రజ్ఞకు ప్రతీక. క్షీరసాగర మధనంలో ఉద్భవించిన లక్ష్మీదేవి సంకల్ప శక్తి స్వరూపానికి ప్రతీక. ఈ సంకల్ప శక్తిని అనుసరించి ఈ ప్రాణమయ శరీరం పనిచేస్తుంది. ఈ శక్తి మనిషి హృదయంలో ఉండి మనిషిలో కలిగే పవిత్రమైన దివ్య సంకల్పాలను కలిగిస్తుంది. దీని వల్లనే ప్రేమ, కరుణ, దయ, వాత్సల్యం, సత్యం, అహింస లక్షణాలు జీవిలో పుడతాయి.

క్షీరసాగర మధనంలో ఉద్భవించిన ధన్వంతరి మానవ శరీర వ్యూహం యొక్క సమగ్రతత్త్వానికి, ఆయుర్ధాయ స్వరూపానికి ప్రతీక. ధన్వంతరి చేతిలో ధరించిన అమృతకుంభం జీవులలోని గుండెకు ప్రతీక.

మనిషికి శరీరం, మనస్సు అనే రెండు సాధనాలున్నాయి. శరీరానికి సంబంధిచినది భుజబలం, మనసుకు సంబంధించినది బుద్ధిబలం. భాగవతంలోని అష్టమ స్కంధంలోని వామనావతార చరిత్ర ఈ రెండింటి జయాపజాయలకు ప్రతీక. రాక్షసుల రాజు బలిచక్రవర్తి ఆత్మబలానికి, రాక్షసుల గురువు శుక్రాచార్యుడు బ్రహ్మచర్యానికి, ఇంద్రుడు మనసుకు, దేవతలు ఇంద్రియాలకు, దేవతల గురువు బృహస్పతి బుద్ధికి ప్రతీకలు.

బలాన్ని కోరుకునే సాధకుడు శుక్రున్ని సేవింపక తప్పదు. ఎందుకంటే బ్రహ్మచర్యాన్ని పాటించేవాడే నిజమైన బలవంతుడై ఉంటాడు. ఇక్కడ శుక్రాచార్యుడు నిజమైన బలవంతునికి ప్రతీక. శుక్రున్ని సేవించేవాడు ఇంద్రున్ని కూడా జయించగలడు. ఎలాగంటే ఎవడు బ్రహ్మచర్యాన్ని పాటిస్తాడో వాడే తన మనసును, ఇంద్రియాలను జయించగలడు. దీనికి కారణం వారు చేసేది విశ్వాన్ని జయించే బ్రహ్మచర్యమనే యజ్ఞం. ఎవరు కామానికి వశపడడో వారికి దేవతల రాజధాని అమరావతి వశమవుతుందని ప్రతీక.

వామనుడు సాధకుని జ్ఞానానికి, అదితి సాధకుని తపస్సుకు, కశ్యపుడు సాధకుని సమాధి స్థితికి ప్రతీకలు. సాధకుడు నిత్యం భగవన్నామ స్మరణచే సర్వవ్యాప్తియైన భగవంతున్ని ఆరాధిస్తాడు. ఇదే Ôþ ŏr Ÿa (n ~ Ü). సాధకునిలో జ్ఞానపుష్పం వికసించే కొద్దీ అతనిలో అసుర లక్షణాలు నశిస్తాయని

**ప్రతీకార్థం.** సాధకుడి అదృష్టం వల్ల శరీరంలో భగవంతుడు ప్రవేశిస్తే మహాయోగ, మహిమ సిద్ధులన్నీ అతనికి అలవోకగా వశమయిపోతాయి.

వామనుడు బలిచక్రవర్తిని మూడు అడుగుల నేలను దానంగా అడిగాడు. సమస్త విశ్వం అంతా తనే ఉండి, తానే ఆవరించి ఉండగా, వామనుడు కేవలం మూడు అడుగుల నేలను దానం ఇవ్వడంలో పరమార్థం మూడు అడుగులు మూడు త్రిగుణాలకు ప్రతీకలని అర్థం. ఈ మూడు అడుగులు జీవుని సర్వస్వాలైన (జాగ్రత్, స్వప్న, సుషువు) సత్వ, రజో, తమో గుణాలకు ప్రతీక. ఇవి 'నాది' అనే భవ బంధానికి కారణం.

ఒక జీవికి మృత్యువు, జన్మమనే స్థితిలున్నట్లు ఇవి ఒక సృష్టికి కూడా ఉన్నాయి. అలాంటి ఒక సృష్టి ఆయుర్ధాయాన్ని కల్పించమనీ, దాని మృత్యు స్థితిని ప్రళయమని భాగవతం ప్రతీకాత్మకంగా సూచించింది. ప్రళయ స్థితిలో ఒక్కొక్క లోకం తన వెనుక లోకానికి మాయమై, మొత్తం బ్రహ్మ ప్రజ్ఞలో లీనమవుతుంది. బ్రహ్మ నిద్రలోకి జారిపోయినప్పుడు వచ్చేస్థితే ప్రళయం. ఒక జీవుడికి కారణం శరీరం ఎలా ఉంటుందో, అట్టి నిద్రలో ఉన్న బ్రహ్మకు కారణ శరీరం ఉంటుంది. అదే మనువనే పేరుతో ప్రతీకాత్మకంగా చెప్పబడింది.

వేదం జ్ఞానానికి ప్రతీక. బ్రహ్మ జీవుడికి ప్రతీక. జీవుడిలోని జ్ఞానాన్ని గాఢనిద్రలో దాచి దూరం చేసేవాడు హయగ్రీవుడనే రాక్షసుడు. ఉదయం జీవుడిని నిద్రనుంచి మేల్కొలిపి జీవుడికి జ్ఞానాన్ని అందించేవాడు మత్స్యావతారంలోని శ్రీహరి. ఇదే మత్స్యావతారంలో ప్రతీకాత్మకంగా చెప్పబడింది.

నిరంతర విద్యా విధానం సాగే పాఠశాలలో ఉత్తమ గురువు చేతిలో పడిన విద్యార్థి 'నేను-నాది' అనే భావనను తొలగించుకుంటూ, ఇంటి నుండి వీధిలోకి, వీధి నుండి గ్రామంలోకి, గ్రామం నుండి సమాజంలోకి మనది అనే భావనతో మత్స్యావతారంలోని చేపపిల్లలాగా ఎదుగుతాడు. అలా ఎదిగినవాడు ప్రళయం లాంటి విపత్కర పరిస్థితులలో దేశం కోసం మత్స్య అవతారంలోని శ్రీహరి లాగా తన జీవితాన్ని సైతం దేశభక్తి అనే బంధనంతో త్యాగం చేస్తాడు. అలాగే దేశంలోని మేధావులను, సహజ సంపదలను రక్షిస్తాడు. బ్రహ్మజ్ఞానం లాంటి సత్పురుషులకు సహాయం చేస్తాడు. విజ్ఞానాన్ని అడ్డదారుల్లో ఉపయోగించే హయగ్రీవుడిలాంటి దుర్మార్గులను శిక్షించేటట్లు ప్రయత్నం చేస్తాడు.

భాగవతంలో త్రిపురాసుర సంహార కథలో ప్రతీకలుగా త్రిపురాలను జీవుని గల సూక్ష్మకార శరీరాలను చెప్పవచ్చు. నిశ్వాసంలో వినబడే 'హ' కారం, ఉచ్ఛ్వాసంలో వినబడే ప్రకంపన రూపమైన 'ర' కారం కలిసి 'హరి' అనే పేరుతో ప్రాణంతో దేహాన్ని, జీవుణ్ణి నిలబెట్టేవాడు పరమేశ్వరుడు. ఈయన జ్ఞానానికి ప్రతీక. కాబట్టి జీవుడు పరమేశ్వరున్ని ఆశ్రయించి, ఆయన అనుగ్రహం వల్ల ఈ దేహత్రయం లేకుండా చేసుకొని ముక్తిని సాధించుకోవాలనే ఆధ్యాత్మిక సందేశం ఇందులో ఉంది.

ఆధ్యాత్మిక సాధనలో జ్ఞానులు, ప్రసన్నులు అనే రెండు సంప్రదాయాలున్నాయి. జ్ఞానులకు ప్రతీకలుగా సనకసనందాదులు, ప్రసన్నులకు ప్రతీకలుగా శ్రీహరి ద్వార పాలకులు జయవిజయులు ప్రతీకలుగా తెలుపబడినారు. అలాగే యమపురి యోగసాధనలోని యమ అనే సద్గుణానికి ప్రతీక. యమం అనే సద్గుణం చేతిలో అహంకారం చనిపోతుంది. అహంకారం చనిపోయిన తర్వాత ఇక సాధకునికి చుట్టాలు ఉండరు.

భాగవతంలోని పురంజనోపాఖ్యానాన్ని పోతన కామలాలసకు ప్రతీకగా చెప్పాడు. యుద్ధంలో సైనికులు, సైనికాధిపతి పోరాడారే తప్ప రాజు గారు అయిన పురంజనుడు మాత్రం తమ ప్రేయసి ప్రమదోత్తమతో కామ విలాసాలు కొనసాగించాడు. అరిష్షర్గాలలో మొదటిది కామం. దీని ప్రాబల్యాన్ని పోతనగారు పురంజనుడి పాత్ర ద్వారా తెలిపారు. ఈ కథ అంతా పురంజనుని ఇంద్రియ లంపటత్వానికి ప్రతీకగా భావించవచ్చు. పురంజనుని పాత్ర కామ లాలసతో తిరిగి రోగాల బారిన పడి మరణించి స్త్రీగానే జన్మించి తిరిగి సంసారిక జీవితాన్ని గడిపినప్పటికీ పూర్వ కామలాలస తగ్గలేదు.

### 3.1. రామాయణం :

విశ్వామిత్ర మహర్షి యాగ సంరక్షణార్థం రామలక్ష్మణులను తన వెంట పంపమనగా బాధపడుతూ తన కుమారులను పంపిస్తాడు దశరథమహారాజు. అప్పుడు శ్రీరామచంద్రుడు విశ్వామిత్రుని ఆదేశం మేరకు మొదట తాటకిని సంహరించాడు. తర్వాత అహల్యను సంస్కరించాడు. చివరలో సీతను స్వీకరించాడు.

మొదట సంహరించిన తాటకి తమోగుణానికి ప్రతీక. తమోగుణం అజ్ఞానుల నుండి పుడుతుంది. ఇది ప్రమాదం. ఆలస్యం, నిద్ర అనే వాటితో ఈ అజ్ఞానం మనిషిని ముంచివేస్తుంది. కాబట్టి దీనిని వెంటనే తొలగించుకోవాలి. లేకపోతే జీవితం మోహావేశానికిలోనై, పతనమవుతుంది. అందుకే

రామచంద్రుడు మొదట తాటకిని సంహరించాడు.

అహల్య రజోగుణానికి ప్రతీక. ఈ రజోగుణం కామం, ఆసక్తి నుండి పుడుతుంది. ఈ రజోగుణం మనిషి ధర్మ నిర్వహణకు చాలా అవసరం. ఇది లేకపోతే మనిషి నిర్వీర్యుడు అయిపోతాడు. రజోగుణం కర్మను, కర్మతోపాటు కర్మఫలాన్ని కోరుతుంది. అందువల్ల కర్మఫలాన్ని విసర్జించేటట్లు మనిషి ప్రయత్నం చేయాలి. అంతేకాని సగటు మనిషిగా రజోగుణాన్ని నాశనం చేసుకోకూడదు. అందుకే రాముడు అహల్యను సంస్కరించాడు.

సీత సత్త్వగుణానికి ప్రతీక. సత్త్వగుణం నిర్మలమైనది, ప్రకాశమైనది. ఇది జ్ఞానం నుండి పుడుతుంది. మనిషిలో వివేకశక్తిని, చైతన్యాన్ని చిగురింపజేసేది సత్త్వగుణం. ఇది మనిషిని సమగ్రమూర్తి మత్వానికి దోహదం చేసి, పురుషున్ని పురుషోత్తముడిగా తీర్చిదిద్దుతుంది. అందుకే రాముడు సీతను స్వీకరించాడు.

మానవత్వం ఎలా ఉండాలో రామాయణం అడుగడుగునా వివరిస్తుంది. అన్ని సన్నివేశాల్లో మానవత్వం పరిమళిస్తుంది. జాతికి ఆక్రమణలు కాదు, ఆనందం పంచడం ముఖ్యమని, ఒకరిది దోచుకోవడం కంటే వారికి ఆనందాన్ని పంచితే ఎలా ఉంటుందో రామాయణం తెలిపింది. అందుకే రామాయణం మానవత్వానికి ప్రతీక. రామాయణంలోని పాత్రలు ఆదర్శ జీవితానికి ప్రతీకలుగా చెప్పవచ్చు. అత్యంత శక్తిశాలి, ధైర్యసాహసాలకు ముందుండే వీరుడు హనుమంతుడు. ఈయన భక్తికి, త్యాగానికి, సేవకు ప్రతీక.

### 3.2. భగవద్గీత – ప్రతీకాత్మక :

భగవద్గీతలో ఈ విధంగా చెప్పబడింది. "ఉపనిషత్తులు గోవులకు ప్రతీక. గోపాల నందనుడు అయిన శ్రీకృష్ణుడు పాలు పితుక్కునేవారికి ప్రతీక. అర్జునుడు ఆ పాలను తాగే దూడకు ప్రతీక. మహత్తరమైన గీతామృతమే పాలకు ప్రతీక. మంచి బుద్ధిగలవారే ఆ పాలను త్రాగే వారికి ప్రతీక. ఇంకా భగవద్గీత సర్వ వేదాలకు, మనువు సర్వధర్మానికి, గంగ సర్వ తీర్థ పరిపూర్ణత్వానికి, విష్ణువు సర్వదేవతా మయానికి ప్రతీకలుగా చెప్పబడ్డారు.

కలియుగమున గంగానది, గీత, భిక్షువు, కపిలగోవు, రావి చెట్టు వీని సేవనము విష్ణు భగవానుని పర్వదినములకు ప్రతీక. ఉత్తమమైన ఈ గీతాశాస్త్రమును భక్తిభావంతో అధ్యయనం చేయువారు సమస్త

వేదాలను, పురాణాలను అధ్యయనం చేసినవారికి ప్రతీకగా భగవద్గీత చెప్పబడింది.

కురుక్షేత్ర సంగ్రామంలో ఒక విచిత్రమైన యజ్ఞం జరుపబడింది. ఆ యజ్ఞమునకు హోమకుండం అర్జునుని ముఖం, హోమ ద్రవ్యము గీతోపదేశము. హోత శ్రీకృష్ణుడు. యజ్ఞఫలము కైవల్యము.

భగవద్గీతను తెలుపుటకు ప్రతీకలుగా వీటిని ఉపయోగించారు. భగవద్గీత వివేక వృక్షములకు తోటగాను, సర్వసుఖములకు పునాదిగాను, పరమార్థాన్ని బోధించే సిద్ధాంతరత్నఖనిగాను, అమృతంచే నిండిన సముద్రంగానూ, సర్వవిద్యలకు మూల భూమిగా, సర్వశాస్త్రములకు ఆశ్రయముగా, సర్వధర్మములకు మాతృభూమిగా, సరస్వతిదేవి లావణ్య రత్నముల భాండాగారంగా తెలుపబడింది.

'ఓం' కారానికి ప్రతీకలుగా వేదాలు ఈ విధంగా తెలుపుతున్నాయి. "తపస్సులన్నీ ఎందుకోసం ఆచరింపబడుతున్నాయి? బ్రహ్మచర్యం పాటించడంలో ఆంతర్యమేమి? ఈ ప్రశ్నలకు ఒకే ఒక సమాధానం 'ఓం' కారం. ఇది అ–కార, ఉ–కార, మ – కారాత్మకం. అకారం విష్ణు సూచకం, ఉ–కారం లక్ష్మీ సూచకం, మ–కారం జీవ వాచకం. కొన్ని గ్రంథాలు ఓంకారానికి ప్రతీకలుగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సూచిస్తున్నాయి.

జలం మాయకు చిహ్నం. జలం తనలో మునిగిన వారిని కనబడకుండా చేస్తుంది. అలాగే ఉన్నదాని నిజస్థితిని కనబడకుండా చేసే జలాన్ని మాయకు ప్రతీకగా చెప్పవచ్చు.

వైదిక వాఙ్మయంలోని ఆది భౌతికములైన అర్థాలు మంచి జీవితం సుఖవంతంగా, ధర్మమార్గంలో నడిపించడానికి ప్రతీక. ఆధ్యాత్మికార్థాలు మానవుని మనసులో జరిగే గందరగోళాలన్నింటిని ప్రశాంత పరిచి సుఖశాంతులతో జీవితాన్ని నడిపిస్తూ, జీవాత్మను పరమాత్మలో కైవల్యం పొంది ముక్తిమార్గం వైపు నడిపించడానికి ప్రతీక. ఆది దైవికములైన అర్థాలు అమానుష విషయాలతో దైవంపై విశ్వాసం కలిగించి, మనస్సును ధృడపరచి దైవోన్ముఖం చేసి, దైవానుగ్రహం వల్ల జీవితాన్ని ధైర్యంగా సుఖవంతంగా నడిపించేటట్లు సంఘాన్ని, జాతిని నడిపించడానికి ప్రతీక.

నన్నయ మహాభారతాన్ని పారిజాత వృక్షానికి ప్రతీకగా పేర్కొన్నాడు. రెండింటిలో కూడా కృష్ణుడు నాయకుడు. ఆయనే భక్తులకు బాధలు తొలగించి అనుగ్రహిస్తాడు. తిక్కన భారతంలోని ధర్మరాజును మెత్తని పులికి ప్రతీకగా, భీమున్ని సింహానికి ప్రతీకగా, అర్జునున్ని బెబ్బులి పులికి ప్రతీకగా, నకుల సహదేవుళ్ళను జతవేసుకొని ఆడుకునే జంట పాములకు ప్రతీకగా తెలిపాడు.

సాగరం అనగా సముద్రమని అర్థం. క్షీరసాగరం అనగా తెల్లటి సముద్రం అని అర్థం. పాలకడలిని చిలికినప్పుడు కవ్వముగా మందర పర్వతమును ఉపయోగించి చిలుకగా, సాగర ఓషదుల సంపర్కం చేత సముద్రంలోని నీరు క్షీరములయ్యాయని భారతం ఆదిపర్వంలో ప్రతీకాత్మకంగా వర్ణించబడింది.

క్షీరసాగరంలో శ్రీమన్నారాయణుడు శయనించును. లక్ష్మీదేవి, చింతామణి, ఇంకా అనేక రకముల వజ్రములు ఈ సాగరములో నుండే ఉద్భవించినవి. వీటన్నింటిని కోరికలకు బానిసైన జీవుడు మరుభూమిలో చిక్కుకున్నట్లు ప్రతీకగా రాజశేఖరుడు తన కావ్యమీమాంసలో తెలిపాడు.

### 3.3. మహాభారతం – నన్నయ :

అమితాఖ్యానక శాఖలం బొలచి వేదార్ధ మల చ్ఛాయ మై,
సుమహ ద్వర్గ చతుష్కపుష్ప వితలిన్ కృష్ణార్జునో
త్తమ నానాగుణ కీర్తనార్థ ఫలమై ద్వాపాయ నో ధ్యానజా
తమహా భారత పారిజాత మమరున్ ధాత్రీ సుర ప్రర్థ్యామై

(ఆంధ్రమహాభారతం–ఆదిపర్వం– ప్రథమాశ్వాసం–6వ పద్యం)

మహాభారతానికి పారిజాత వృక్షం ప్రతీక. ఆ వృక్ష ఫలాలు కృష్ణుడు అర్జునులకు ప్రతీకలు. ఋగ్వేదంలో చెప్పిన చెట్టు మీద రెండు పక్షులకు కూడా కృష్ణార్జునులు ప్రతీక. కర్మఫలాన్ని అనుభవించే జీవికి అర్జునుడు ప్రతీక.

పుష్ప సమూహాలతో అనేక గుణాలతో కీర్తించబడిన కృష్ణార్జునులనే ఫలముతో వేదవ్యాసుని ఉద్యానవనంలో ఉన్న భారత పారిజాత వృక్షము భూసురులకు కోరినది ఇచ్చే కల్పవృక్షానికి ప్రతీక

### 3.4. తిక్కన భారతం :

"బక్షి రత్న చయంబు బుష్ప వ్రజంబు
బంజరము త్రాడు నారయు పాత్రయముగ
నుండు చాద్పున విశ్వంబు నుండుటకు
సుఖాస్పదంబగు పుండరీకాక్షు గొలుతు"

(ఆంధ్రమహాభారతం–శాంతిపర్వం–ద్వితీయాశ్వాసం–20వ పద్యం)

ఒక పక్షి పంజరంలో ఉంది. పంజరానికి ఆధారమైనది త్రాడు. ఇక్కడ పక్షి జీవునకు, పంజరం

ప్రపంచమునకు ప్రతీకలు. పక్షి జీవాత్మకు, పంజరం శరీరమునకు, ఈ రెండింటిని ఒక్కచోట బంధించే పరమాత్మశక్తికి తాడు ప్రతీకలు.

రత్నాల సమూహాల వల్ల, పుష్పాల సమూహాల వల్ల పక్షి పంజరమును గురించి ఆలోచిస్తే దానికి త్రాడు ఆధారమైనట్లు ఈ సుందర ప్రపంచ సుఖానికి ఆధారమైన శ్రీకృష్ణుని కొలుస్తాను అని ప్రతీకార్థం.

### 3.5. ఎర్రన – హరివంశం :

"మన్ను రొంపియు బెండయు మసటు వట్టి
పాంసు సంక్రీడ ధనమేను భాసురముగ
హరియనేక ధాతుచ్చటా వ్యక్తమైన
శైలకుంజర కలభంబు వోలె నొప్పి"

(హరివంశం–పూర్వభాగం– పంచమాశ్వాసం–195వ పద్యం)

నేలమీద తిరుగుతూ ఆడుకునే చిన్ని కృష్ణునుని నీలిమేఘం లాంటి శరీరం మీద మన్ను, బురద, మసకలచే ప్రకాశిస్తుండగా, భూమి అనేక ధాతువుల వలన నిండిన కొండవంటి ఏనుగువలె ఉన్నాడని ప్రతీకార్థం.

ఇక్కడ నీలిమేఘం (కృష్ణుడు) పరమాత్మ శరీరానికి ప్రతీక. ప్రపంచం మొత్తం భారాన్ని మోసే పరమాత్మకు కృష్ణుడు ప్రతీక. ఏనుగు రూపము కూడా పరమాత్మ తత్త్వానికి ప్రతీకార్థంగా చెప్పబడుతున్నది.

### 3.6. తెనాలి రామలింగడు – పాండురంగ మహాత్మ్యం :

పండరీ పురాన్ని వైకుంఠానికకి ప్రతీకగా వర్ణించాడు. వైకుంఠంలో ఎంత ఆనందంగా ఉంటారో, ఈ క్షేత్రంలో అంత ఆనందంగా ఉంటారని వర్ణించాడు.

"ముని మీనగుట బట్ట మునులు వైచిన బత్తి వల బోలె జిక్క మౌదల దలిర్ప
వెలితిగా జవిగొన్న వెన్న ముద్దయుబోలె శంఖంబు వామహస్తమున దనర
జగదండవహ కాలచక్రభ్రమణ హేతుదండమై నిజధేనుదండ మమర
సంచిబట్టిన పద్మజాతాండములలీల వలకేల గ్రచ్చకాయలు ఘటిల్ల

తే॥ కలయ బూచిన కల్పవృక్షంబు ఛాయ
సరస వన పుష్పమాలికా భర సమగ్ర
విగ్రహము తోడ విలసిల్లు విప్రునెదుట
మంద ప్రోయాంధ్ర కూరిమి ప్రానిపండు”

(పాండురంగ మహాత్మ్యం– ద్వితియాశ్వాసం– 14వ పద్యం)

ఋషులు భక్తి వలకు ప్రతీక. బాగా పూచిన కల్పవృక్షం మాదిరి పుష్పమాల ధరించిన కృష్ణుని రూపం గొల్ల కాంతల స్నేహవృక్షానికి పండిన పండుకు ప్రతీక. జీవిత ఫలాన్ని అందించే పండకు శ్రీకృష్ణుడు ప్రతీక.

మత్స్యావతారంలో శ్రీమహావిష్ణువు చేప అగుట వల్ల మునుల వేసిన భక్తి అనే వలకు చిక్కి వారు చెప్పిన విధంగా విని, వారి ఆజ్ఞలకు లొంగాడని ప్రతీకార్థం.

**3.7. పెద్దన – మనుచరిత్ర :**

“క్షీర స్థాలిక బెట్టినట్టి గుటికా సిద్ధౌషధం బోయనన్” (మనుచరిత్ర–ప్రథమాశ్వాసం–79వ పద్యం)– కాలం అనే వైద్యుడు పాదరసమును వన మూలికల రసంచే కలిపి మ్రింగడానికి పాలకుండలో ఉంచినట్లుగా చంద్రుడు ఉన్నాడు. ఆకాశం పాలకుండకు, చంద్రుడు వనమూలికల గుళికకు ప్రతీక. అంతేకాకుండా అన్ని మూలికల ఔషద గుణాలు కలిగిన అమృతపు కిరణాలను చంద్రుడు కురిపిస్తాడని ప్రతీకార్థం.

పెద్దన మనుచరిత్రను గృహస్తు ధర్మానికి ప్రతీకగా రచించాడు. ప్రవరుడు గృహధర్మానికి, వరూధిని కామ లాలసకు ప్రతీకలు. వరూధిని తండ్రి ఇందీవరాక్షుడు సర్వ విద్యలకు ప్రతీక.

**3.8. తిమ్మన – పారిజాతాపహరణం :**

“అనవిని వ్రేటువడ్డ యురగాంగన యుంబలెనీయు వోయ
భగ్గున దరికొన్న భీషణ హుతాశన కీలయనంగ లేచి”

(పారిజాతాపహరణం– ద్వితీయాశ్వాసం–82వ పద్యం)

నారదుడు, రుక్మిణికి పారిజాతపుష్పాన్ని ఇచ్చాడని చెలికత్తె చెప్పగానే, సత్యభామ పాము వలె బుస్సుమని, నెయ్యి వెయ్యగా భగ్గుమని పైకి లేచే అగ్నివలె పైకి లేచింది. కోపంతో ఉన్న సత్యభామ

రూపం దెబ్బతిన్న నాగుపాముకు, పైకి లేచిన అగ్నికి ప్రతీకార్థంగా వర్ణించాడు తిమ్మన.

తిమ్మన పారిజాతాపహరణంలో వర్ణించిన నందనవనం ఆనందానికి ప్రతీక. అక్కడ ఉన్న వృక్షాలు సంకల్పాలకు ప్రతీకార్థంగా వర్ణించాడు.

### 3.9. సూరన - కళాపూర్ణోదయం :

"కాశ్మీర భూమికి గర్ణిక యగు శారదా పీఠమున శారదను భజించు"

(కళాపూర్ణోదయం- చతుర్థాశ్వాసం-60వ పద్యం)

కాశ్మీరం అంటే కుంకుమపువ్వు. కాశ్మీరభూమి అంటే కుంకుమను ధరించే ప్రదేశం. తామర ఉదుద్దులు అంటే శ్రుతుల వల్ల శారదాదేవిని పూజిస్తే, శారదా పీఠాన్ని చేరవచ్చు. ఆ కర్ణికే శారదా పీఠం, అదే జ్ఞానపీఠం. ఆ దేవతను పూజిస్తేనే జ్ఞానం, మోక్షం వస్తుందని, కాశ్మీరభూమి భారతదేశానికి కుంకుమ వంటిదని ప్రతీకార్థం.

వెలుగునకు, జ్ఞానకాంతులకు కాశ్మీరం సంకేతం. భారతభూమికే జ్ఞాన ప్రతీకార్థం కాశ్మీరం. జ్ఞానతత్త్వాన్ని అందించేందుకు శారదామాత ప్రతీక. భారతమాత కుంకుమకు కాశ్మీరం ప్రతీక.

తెలుగు ప్రబంధాలలో సముద్రం గంభీరానికి, గుర్రం బలానికి, ఏనుగు మదానికి, కొండ కఠినత్వానికి, పక్షి ఆత్మకు ప్రతీకలుగా సందర్భాన్ని బట్టి ప్రబంధ కవులు వర్ణించారు.

కవులు చీకటిని అజ్ఞానానికి ప్రతీకగా వర్ణించారు. తర్వాత చీకటిని మూఢత్వానికి, అన్యాయాలకు ప్రతీకలుగా భావించారు. సమరం అంటే సైన్యం చేసే యుద్ధం. కానీ కాలక్రమంలో సమాజంలో ఎక్కడ అన్యాయం, అక్రమం కనిపిస్తే వాటిని పారద్రోలే ప్రయత్నంగా కవులు వర్ణించారు.

అన్నమయ్య సంగీతానికి ప్రతీకగా సముద్రాన్నే గుర్తించారు. సముద్రానికి లోతు, దరి తెలియదు. సముద్రంలో లభించే విలువైన రత్నాలు, వజ్రాలకు ప్రతీకలుగా సంగీతంలోని సరిగమపదనిస లను తెలిపాడు.

ధూర్జటి తన శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యంలో సాలెపురుగు, ఏనుగు, పాములను ప్రతీకలుగా చేసుకొని వాటి భక్తి గొప్పతనమును, వాటికి పరమేశ్వరుడు ముక్తిని ప్రసాదించేటట్లుగా వర్ణించాడు. ఇందులో స్వర్ణముఖి నది సకల పాపాలను పోగొట్టడానికి ఉద్భవించిందని ప్రతీక.

సర్వసుగుణాలు, వివేకము గల పుత్రులు ఉన్న ఇంటిని స్వర్గంగా భావించాడు వేమన. సంసారి

అయిన మానవుడికి ఇలాంటి స్వర్గమే కావాలని తెలిపాడు. పాపాలు చేసేటప్పుడు మంచి చెడులని ఆలోచించే జ్ఞానం ఉండదని, తల్లి మాట వినకపోవడం, తండ్రికి ఎదురు చెప్పడం, అన్నమాటను ధిక్కరించడం వీటిని పాపాలకు ప్రతీకలుగా తెలిపాడు. అలాగే చదువులయందు, పాడి ఆవుల మీద, స్త్రీ పెదాల మీద, రాజ్య పదముల మీద ఆశలేని వాళ్ళను ధన్యజీవులకు ప్రతీకగా వేమన భావించాడు.

దాశరథి కృష్ణమాచార్యులు అగ్నిధార, పునర్నవం, తిమిరంతో సమరం అనే రచనలు రచించాడు. అగ్నికి ప్రవాహశీలం ఉండడం వల్ల అది చైతన్యానికి ప్రతీకగా, పునర్నవాన్ని అభ్యుదయానికి ప్రతీకగా, తిమిరం అజ్ఞానానికి, సమరం సంఘర్షణకు ప్రతీకలుగా భావించాడు.

డా॥ సి. నారాయణరెడ్డిగారు రచించిన మట్టిమనిషి ఆకాశం అనే రచనలో మట్టి అధమ స్థానంలోనూ, మనిషి దానిపై నిలబడే ఉన్నత స్థానంలోనూ ఉంటాడని వర్ణించాడు. ఆకాశం ఔన్నత్యానికి ప్రతీక. చెట్టుకు నిరంతరం పెరిగే లక్షణం ఉంది, కావున అది ఆకాశం దాకా విస్తరిస్తుంది. చెట్టును కూడా అభ్యుదయానికి ప్రతీకగా వర్ణించాడు.

నిత్య జీవితంలో ఒకరిని పశువు అంటారు. మరొకరిని సింహం అంటారు. భర్తృహరి "విద్యా విహీన: పశు:" అన్నాడు. దీనిని భర్తృహరి విద్యలేనివాడు వింత పశువు అని అనువాదం చేశాడు. అజ్ఞానానికి ప్రతీకగా పశువులను భావించారు.

వినాయకుని ముఖం శాంతికి, సహనానికి ప్రతీక. ఆయన ఉదరం భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు కలిగిన విశాల ప్రపంచానికి ప్రతీక. ఈయన వాహనం ఎలుక. ఇది తామసానికి ప్రతీక. కామక్రోదాలను జయించడం వినాయకుని వాహనం ఎలుకపై స్వారీ చేయడమే. వినాయకుని తొండం ఓంకారానికి ప్రతీక. ఏనుగుతల యోగానికి, జ్ఞానానికి ప్రతీక.

వినాయకుని మానవ శరీరం ప్రకృతికి, మాయకు ప్రతీక. ఆయన చేతిలో ఉన్న పరశువు అజ్ఞానమును ఖండించడానికి, చేతిలోని పాశము విఘ్నాలు కట్టివేయడానికి, విరిగిన దంతము త్యాగానికి, ఆయనకు గల పెద్ద చెవులు భక్తుల మ్రొక్కులు విని తీర్చడానికి ప్రతీకలు.

అమ్మవారి దేవతా మూర్తికి చేతులు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ బలాధిక్యానికి సూచికలు. అమ్మవారి వాహనం సింహం. ఇది క్రూరత్వానికి ప్రతీక. దేవతలు సాత్త్విక వృత్తులకు, సూర్యుడు బుద్ధికి, చంద్రుడు మనసుకు ప్రతీకలుగా చెప్పబడ్డాయి.

శివుడు ధరించే విబూది తెల్లని జ్ఞానానికి గుర్తు. ఈ విబూదిని మూడు నామాలుగా పెట్టుకోవడం ఆది భౌతిక, ఆది దైవిక, ఆధ్యాత్మిక స్థాయిలలో జ్ఞాన ప్రాప్తి లభించడానికి ప్రతీక. శివుడి తలపై చంద్రుడు ఉండడానికి చంద్రుడు మన:కారకుడు. మానవుని సుఖసంతోషములు అతనిపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి శివుడి తలపై చంద్రున్ని ధరించాడు.

శివుడు పామును ఆభరణంగా ధరించడానికి అనేక ప్రతీకలు చెబుతారు. పాములు నిరంతరం జాగురూకతకు, కాలచక్రానికి, గర్వమునకు, మానవుని కోర్కెలకు ప్రతీకలుగా చెప్తారు. గర్వమును గెలిచినది, సకల కోరికలను జయించిన వాడు శివుడు కనుక పాము శివునికి ఆభరణం అయిందని ప్రతీకాత్మకంగా చెప్పవచ్చు.

శివుడి తలపై ఉన్న గంగ బ్రహ్మదేవుణ్ణి, శ్రీమహావిష్ణువును తాకినది. ఇది నిరంతరం ప్రవహించే జ్ఞానమునకు ప్రతీక. జలము, జ్ఞానము నిరంతరం ప్రవహిస్తూ ఉండాలి. పరమేశ్వరుని నుదుటిన ఉన్న మూడవ కన్ను పరమ జ్ఞానమునకు ప్రతీక. ఇది సద్గురు కృప వల్ల మాత్రమే సాధ్యం. అలాగే శివుడు శరీరానికి పూసుకొనే భస్మం నిరంతర బ్రహ్మానందానికి ప్రతీక. భస్మమునకు నాశనం లేదు. అజ్ఞానమును అంతమొందించడానికి శివుడి ఆయుధం త్రిశూలం ప్రతీక శూలం అనగా సకల బాధలను తొలగించేది.

పరమేశ్వరుడి వాహనం నంది. ఇది ధర్మమునకు ప్రతీక. నంది అంటే పశువు. పాశముతో కట్టుబడునది పశువు. మానవులందరు పాశముతోనే కట్టుబడతారని ప్రతీక. శివుడు పులిచర్మంపై ఉంటాడు. పులి క్రూర జంతువు. అది కామమునకు ప్రతీక. శివుడు కామాన్ని జయించిన వాడు కాబట్టి పులిచర్మంపై ఉంటాడని ప్రతీక.

జ్ఞానాన్ని ప్రసాదించి మనిషిని, మృగాన్ని వేరు చేసేది చదువు. అటువంటి చదువుల తల్లి అక్షర రూపిని, జ్ఞాన ప్రదాయిని అయిన సరస్వతీదేవిని స్మరించాలి. వాక్, బుద్ధి, జ్ఞానాలకు సరస్వతీ దేవి ప్రతీక. ఈ దేవి అనుగ్రహం వల్లనే బుద్ధి పనిచేస్తుంది. బుద్ది సరిగా ఉన్నవారి నిర్ణయాలు, ఆలోచనలు సవ్యంగా ఉంటాయి. బుద్ధి స్ఫురణ, ప్రేరణ వల్లనే మానవ జీవిత గమనం నిర్దేశించబడుతుంది. అక్షరాభ్యాసం నుంచి మన చదువు మనసులో పదిల పరచుకోవడానికి సరస్వతీ దేవిని భక్తితో ఉపాసించాలి.

సరస్వతి దేవి తెల్లని శరీర కాంతి,తెల్లని వస్త్రాలు స్వచ్ఛతకు ప్రతీక. అందుకే ఆ తల్లిని “సర్వ శుక్ల” అంటారు. ఆమె చేతిలో ఉన్న పద్మం జ్ఞానానికి ప్రతీక. పద్మం వికసించినట్లు అందరిలోనూ జ్ఞానం వికసించడానికి సరస్వతీదేవి ప్రతీక. పద్మం నీటిలో పుట్టినా, బురదలో పుట్టినా చక్కని కాంతితో హృదయాలను ఆకర్షిస్తుంది. నిజమైన విద్య అలాగే ఉంటుందనడానికి ప్రతీక.

హంస పాలు నీళ్లు కలిపిన వాటిని ఇస్తే పాలను స్వీకరించి నీటిని వదిలి పెడుతుంది. అలాగే ప్రపంచంలో నీళ్లరూపంలో ఉన్న చెడును మన వివేకంతో వదలిపెట్టి పాలను విచక్షణా జ్ఞానంతో స్వీకరించాలని సరస్వతి దేవి దగ్గర ఉన్న హంస ప్రతీక.

పుస్తకం లౌకిక విద్యలకు, అక్షరమాల ఆధ్యాత్మిక విద్యకు, సరస్వతీదేవి వీణవాయిస్తూ ఉండడం లలిత కళలకు ప్రతీక. గురువు చెప్పిన విషయాన్ని మనం శ్రద్ధతో విని, చిలుక మాదిరిగా వల్లె వేయాలని సరస్వతీదేవి దగ్గర ఉండే చిలుక తెలియజేస్తుంది. చిలుకు స్వేచ్ఛగా విహరిస్తూ నేలమీద తక్కువ సమయం గడుపుటకు విషయ వాసనలకు దూరంగా ఉండాలని “ముంజేతి చిలుక” ద్వారా తెలుస్తుంది.

పంచముఖ ఆంజనేయుని ఐదు ముఖాలలో తూర్పుముఖం మానవులకు ఇష్టసిద్ధిని కలిగించడానికి, దక్షిణ ముఖం ఉగ్రవీర నరసింహ భక్తులకు, అభీష్ట సిద్ధిని కలిగించడానికి, పశ్చిమ ముఖ మహావీర గరుడడు సకల సౌభాగ్యాలు కలిగించడానికి, ఉత్తర ముఖము వరాహ లక్ష్మీనరసింహ ధనప్రాప్తి కలిగించడానికి తూర్పుముఖము హయగ్రీవుడు సకల విద్యలలో జయం కలిగించడానికి ప్రతీక.

మరో కథనం ప్రకారం హనుమంతుని ఐదు తలలు ఐదురకాల ప్రార్థనలు సూచిస్తాయి. నమస్కారం, స్మరణం, కీర్తనం, యాచనం, అర్పణలాకు ప్రతీక. ఇంకా హనుమంతుని ఐదు తలలను పంచ భూతాలకు ప్రతీకగా చెప్తారు.

పద్దెనిమిదవ శతాబ్దం చివరికి పునరుజ్జీవం దేశం నలుమూలలా సాగింది. గొప్ప నాయకులు, ఉద్యమాలు, ఉద్భవించాయి. శతాబ్దం చివరికి క్రియాశీలమైన భారతీయ సంస్కృతి, సాధికార ప్రతినిధులు అయిన రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానందుల జీవితాలు, బోధనలు వలన మనదేశం పూర్తిగా వికాసం పొంది, పరిపూర్ణం అయింది. భారతదేశంలో జన్మించిన వీరు సర్వమానవాళి ఆధ్యాత్మిక

అభిలాషకూ, నమ్మకాలకు ప్రతీకలుగా నిలిచారు.

నిద్రిస్తున్న ఆత్మ తన నిజతత్త్వాన్ని తెలుసుకొని పనిలో నిమగ్నం కావాలని వివేకానందస్వామి పిలుపునిచ్చారు. ఇతరుల బాధలు, కష్టాలు తొలగేటట్లు పనిచెయ్యడమే మనసులోని ధర్మం పరిణితి సాధించిందనడానికి ప్రతీక.

తెలుగు సాహిత్యంలోని ప్రతి ప్రక్రియలోనూ తప్పనిసరిగా ప్రతీకార్థం దాగి ఉంటుంది. నిత్యం జరిగే మానసిక సంఘర్షణలు తెలియజేయడానికి కూడా ప్రతీకలు ఉపయోగపడుతుంటాయి. ప్రతి కథల ద్వారా పరమార్థాన్ని అభివ్యక్తం చేయడం పురాణాల మార్గం. ప్రతీకాత్మకత, అలంకారిక వంటివి ఎప్పుడైతే పురాణమార్గంలో చోటుచేసుకున్నాయో అప్పుడు శుష్కమైన కథలు ఆసక్తికరంగా మారిపోతాయి.

ఏ కథ చెప్పడానికి ఏ ప్రతీక అవసరం అన్నది కవికి మాత్రం తెలుసు. ప్రతీకల విషయంలో ఇది ఉచితం, అది అనుచితం అనే పరిగణన ఉండకూడదు.

# నాలుగవ అధ్యాయం

# 4. గజేంద్ర మోక్షం ప్రతీకాత్మకత

## 4.1. ఉపోద్ఘాతం :

గజేంద్రమోక్షం భాగవతంలోని అష్టమ స్కంధంలో నాలుగు అధ్యాయాలలో విస్తరించి ఉంది. దీనిని పోతనగారు తన ప్రతిభతో 137 పద్యగద్యాలతో తెనిగించి, జంతునాయకమైన ప్రబంధంగా మలిచారు.

ఈ ఘట్టంలోని పాత్రలు కరి మకరాలు. ఇవి మనిషిలోని జ్ఞానానికి, దాన్ని ఆవరించిన మాయకు ప్రతీకలు. ఈ విషయాన్ని పోతన "అలహృదయ జ్ఞానదీపంబు నతిక్రమించు మహా మాయాంధ కారంబు నుం బోలె" (8-64) అని ఉపమానంగా మలిచారు.

కరి మొదట దశలో తన పశుబలాన్ని నమ్ముకొని మకరిచే వెయ్యేళ్ళు పోరాడింది.రెండవ దశలో శారీరకంగా అలసిపోయిన తర్వాత జ్ఞానోదయమై 'కలదు కలండను వాడు కలడో లేడో' అనే సందేహంతో పెనుగులాడింది. ఇక మూడవ దశలో నిశ్చయాత్మకమైన బుద్ధితో సమస్త విశ్వానికి రక్షకుడున్నాడని సంపూర్ణంగా విశ్వసించి, "నీవేతప్ప నిత: పరంబెరుగ మన్నింప దగున్ దీనునిన్" అని తనను శ్రీహరికి సమర్పించుకుంది.

కాబట్టి మనిషి అజ్ఞానాంధకారానికి లోనైనప్పుడు తనకు తానుగా దాని నుండి బయట పడడానికి ప్రయత్నిస్తే బయటపడే అవకాశాలు తక్కువ. సంశయాత్ముడై ఉన్నప్పుడు అతని రక్షణకు ఏండ్లు పడుతుంది. కానీ నిశ్చయాత్మక బుద్ధితో భగవంతునికి తనను తాను సమర్పించుకున్నప్పుడు అతని రక్షణకు ఆలస్యం ఉండదు అనే విషయాన్ని గజేంద్రమోక్షం కథ తెలియజేస్తుంది.

## 4.2. సంక్షిప్త కథ :

క్షీరసాగరంలో త్రికూటమనే అందమైన పర్వతం ఉంది. ఆ కొండమీద అడవులలో క్రూరమృగాలతో పాటు ఎన్నోవేల ఏనుగులు ఉన్నాయి. ఒక ఏనుగుల మంద ఆనందంతో విహరిస్తూ దప్పికగొని, నీటిగాలి వచ్చే దిక్కుకు నడుస్తుండగా, ఒక గజేంద్రుడు "ఈశ్వరాయత్తంబైన చిత్తంబు సంవిత్తంబు గా కుండుటం వల్ల" (భాగవతం-అష్టమ స్కంధం-38వ పద్యం) తన భార్యలతో దారితప్పి, వేరే దారిగుండా నడచి ఒక మడుగును చూశాడు. వెంటనే మదపుటేనుగులు పంచేంద్రియాల

వ్యవహారంబులను మరచి తమ తొండాలతో కడుపుల నిండుగా నీళ్ళు తాగి గజేంద్రునితో జలక్రీడలు ఆడుతున్న సమయంలో ఆ మడుగున ఉంటున్న ఒక మొసలి గజేంద్రుని కాలు పట్టుకుంది.

సంసారి వలె గజేంద్రుడు మొసలి పట్టు చిక్కుకొని గజగజలాడిపోయాడు. కరి – మకరిల భీకర పోరాటాన్ని చూస్తూ ఆడ ఏనుగులు ఊరక చూస్తుండి పోయాయి. కరి, మకరితో వెయ్యేండ్లు పోరాడింది. చివరకు చితికిపోయి పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో మదజల ధారలతో పెరిగిన మంచి గంధపు చెట్ల నీడలలో సుఖంగా ఉండకుండా నీళ్ళపై ఆశతో నేను ఇక్కడకు ఎందుకు వచ్చాను? భగవంతుడా! భయమేస్తున్నది. "ఈశ్వర నీ శరణంబు వేడెదన్" అని భగవంతుడిని పరిపరి విధాల ప్రార్థించాడు. "కలదు కండనెడు వాడు కలడో లేడో" అని సందేహించాడు. చివరకు నాకు నీవే తప్ప వేరే దిక్కు లేదు అని ఆర్తితో కూడి నన్ను ఆదుకోవడం న్యాయమని మొరపెట్టుకున్నాడు. ఆ సమయంలో శ్రీమహావిష్ణువు వైకుంఠంలో లక్ష్మీదేవితో వినోదిస్తుండగా, పాహి పాహి అనే గజేంద్రుని మొర విని వెంటనే బయలుదేరి, మడుగు వద్దకు చేరి, సుదర్శన చక్రాన్ని ప్రయోగించగా, అది మొసలి తలను ఖండించింది. తర్వాత శ్రీహరి తన చేతిని చాచి గజేంద్రుని మడుగులోనుండి ఈవతలకు లాగి, వెన్నుతట్టి ఒళ్ళు నిమిరాడు. అప్పుడు గజేంద్రుడు తొండాన్నెత్తి, ఘీంకరించి తన కృతజ్ఞతను తెలుపుకున్నాడు.

గజేంద్రుడు పూర్వజన్మలో ఇంద్రద్యుమ్నుడనే మహారాజు. అతడు శ్రీహరిని ధ్యానిస్తూ మైమరచి అగస్త్యున్ని ఉదాసీనంగా చూసిన కారణంగా ఆ మహర్షి ఆగ్రహానికి గురై, ఏనుగై పుట్టాడు. ఇప్పుడతని అజ్ఞానం నశించి శ్రీహరి కర స్పర్శతో అతని పాపం, శాపం తొలగిపోయాయి. తర్వాత అతడు విష్ణు సాయిజ్యాన్ని పొంది, వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

అలాగే దేవలుని శాపం వల్ల మకర జన్మమెత్తిన 'హూహూ' అనే గంధర్వుడు శ్రీహరి కరుణతో శాప విముక్తుడై, గంధర్వ రూపంలో తన లోకానికి వెళ్ళిపోయాడు.

"నీరాట వనాటములకు బోరాటంబెట్లు గలిగె? బురుషోత్తముచే
నారాట మెట్లు మానెను ఘోరాటవిలోని భద్ర కుంజరమునకున్"

(ఆంధ్రమహాభాగవతం–అష్టమస్కంధం–19వ పద్యం)

నీటిలో ఉండే మకరికి, భూమిపై ఉండే కరికి పోరాటం ఏవిధంగా జరిగిందని, ఆ సన్నివేశాన్ని మాకు తెలియజేయమని పరీక్షిత్తు మహారాజు శుక మహర్షిని అడిగాడు.

ఇక్కడ నీరు అనగా బుద్ధి. సర్వ వ్యాపకుడు అయిన విష్ణువే జలరూపం పొందాడు. అట్టి బుద్ధి రూపమే సంకల్పం. ఈ సంకల్పమే నీరాటమునకు ప్రతీక. జీవుల చేత సేవింపబడునది వనం. కామమే వనానికి ప్రతీక. నీరాటం అయిన సంకల్పానికి, వనాటం అయిన కామమునకు, సంసారం అనే ఘోర అడవిలో కలహం ఎలా కలిగింది. పురుషోత్తముడైన ఆ మహావిష్ణువు పోరు అనే భవదు:ఖాన్ని ఏవిధంగా తొలగించాడని పరీక్షిత్తు మహారాజు అడిగాడు.

**4.3. త్రికూట పర్వత వర్ణన :**

పాల సముద్రంలో త్రికూటమనే అందమైన పర్వతం ఉంది. అది పదివేల ఆమడల పొడవు, అంతే వెడల్పు, ఎత్తూ కలిగి ఉంది. దానికి బంగారు, వెండి, ఇనుములతో మూడు శిఖరాలున్నాయి. ఆ పర్వతంపై పెద్దపెద్ద చెట్లు, తీగలు, పొదలు, మ్రోగుతూ పారే సెలయేర్లు కలవు. అలాగే అలవాటు ప్రకారం తిరిగే దేవతల విమానాలు, కిన్నెరులు, కింపురుషులు ఆ పర్వతంపై తిరగుతూ ఉంటారు.

అచ్చమైన చైతన్యాన్ని పాలసముద్రమని సంకేతంగా చెప్పవచ్చు. దానిలో కదలిక కలిగి అలలు లేచినప్పుడు పైకి లేచిన ప్రతి ఒక్క అల ఒక కల్పంగా వచ్చి పోతుంటాయి. ఇక్కడ అలలకు ప్రతీకగా కల్పము తెలియజేయబడింది. ఈ విధంగా సముద్రం నుండి ఒక అల సృష్టిగా లేచి బయలుదేరినప్పుడు ఈశ్వరుని మాయా శక్తి వెలువడి సత్త్వము, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలను స్వీకరిస్తుంది. అప్పుడు అది మూల ప్రకృతి అనబడుతూ ఈ మూడు గుణాలు త్రికూట పర్వతంపైన బంగారు, వెండి, ఇనుము శిఖరాలకు ప్రతీక.

సృష్టి మొదలైనప్పుడు పైన – క్రింద (ఆకాశం–భూమి) అనే విభాగాలు ఏర్పడి వివిధ వర్ణాల నడుమ ప్రసరించి, వాటి చక్కదనం వలన సృష్టి రూపొందుతుంది. ఇలా రూపొందడానికి వివిధ ప్రజ్ఞా ప్రవాహాలు పనిచేయడం ఆరంభమవుతాయి. అవే సెలయేళ్ళుగా వర్ణించబడినాయి.

ఇక ఈ పర్వత వర్ణన భౌతిక సృష్టికి సంబంధించినది కాక ప్రాథమిక సృష్టికి సంబంధించినది. కనుక సృష్టి ప్రారంభానికి సంకేతమైన వసంతకాలం మాత్రమే నిరంతరం ఉంటుంది. అదే విధంగా సృష్టి అన్ని స్థాయిలలో ఉంటుంది.

**4.4. త్రికూటమందలి గజములు :**

శా॥ అన్యాలోకన భీకరంబులు జతా శానేక పానీకముల్

వన్యేంభంములు గొన్న మత్తతనులై ప్రజ్యా విహారాగతో
దన్యత్వంబున భూరి భూధర దరీ ధ్వారంబులందుండి సౌ
జన్య క్రీడల నీరు గాలివడి కాసారవ గాహార్థమై

(భాగవతం–అష్టమ స్కంధం–26వ పద్యం)

ఆ అడవిలో ఏనుగులు మదించిన తమ దేహాలతో అన్యమృగాలు కన్నెత్తి చూడని విధంగా ఉన్నాయి. అవి భయంకరమైన పరాక్రమంతో దిగ్గజాలను కూడా మించి పోతాయి. అలాంటి ఏనుగుల గుంపు అడవిలో ఆడుతూ తిరిగి తిరిగి అలసి పోయి దప్పిక చేత నీటిగాలి వచ్చే వైపునకు నడిచాయి.

ఈ ప్రాథమిక మూల సృష్టి నుండి అనంతర సృష్టి బయలుదేరుతుంది. దీనిని భూత సృష్టి, జీవజాల సృష్టి అంటారు. దేవుని చైతన్యం జీవ చైతన్యంగా రూపొంది, భౌతిక సృష్టితో దిగివస్తుంది. అది ఒక్క జీవుడుగా ఉండక, అసంఖ్యాక జీవుల సమాహార చైతన్యంగా ముద్దగట్టి ఉంటుంది. క్రమంగా అది దిగివచ్చి వేర్వేరు జీవులుగా రూపొందుతాయి. ఈ సమాహార చైతన్యం అవ్యక్తంగా ఉంటుంది. కాబట్టి ఏనుగులన్నీ గుహలలో దాగి ఉన్నాయని వర్ణింపబడింది. ఆ సమాహార చైతన్యం అవ్యక్తంలో నుండి వ్యక్తమయ్యే స్థితిలోనికి వస్తాయి. అంటే జీవరాశులుగా రూపొందుతాయి. అట్లా రూపొందడం వలెననే ఇచ్ఛయే ఏనుగుల దాహానికి ప్రతీకార్థంగా వర్ణింపబడింది.

ఆ॥ అంధకారమెల్ల నద్రి గుహాంతర
వీధులందు బగలు వెఱచి డాగి
యెదరు వేచి సంధ్య నినుదు వృద్ధత
నున్న వెడల ననగ గుహలు వెడలె గరులు

(భాగవతం–అష్టమ స్కంధం–27వ పద్యం)

ఆ అడవిలో ఏనుగులు ఎంత నల్లగా ఉన్నాయంటే సూర్యుని వెలుతురుకు భయపడి కొండ గుహల్లో దాక్కొని సూర్యుని శక్తి తగ్గిపోగానే చీకట్లు గుహల్లోనుంచి బయటకు వచ్చాయి అన్నట్లు ఉన్నాయి.

దేవుని చైతన్యం సూర్యుని వెలుగు వంటిది. దైవప్రజ్ఞ అంతరించి జీవప్రజ్ఞగా రూపొందుతుంది. అంటే వెలుగు అంతరించి చీకటిగా మారుతుందని అర్థం. కనుకనే సూర్యుడు ముసలివాడు అయినందువల్ల

ఆ అలుసు తీసుకొని ఏనుగుల గుంపు గుహల నుంచి బయటకు వచ్చిందని ప్రతీకాత్మకంగా వర్ణించబడింది.

కం॥ తలగవు కొండల కైనను
మలగవు సింగముల కైన కూర్చొను కడిమిం
గలగవు పిడుగుల కైనను
నిల బల సంపన్న వృత్తి నేను గుగున్నల్

(భాగవతం–అష్టమ స్కంధం–25వ పద్యం)

పెద్ద ఏనుగులు కాదు గున్న ఏనుగులు కూడా పరాక్రమంలో పెద్ద ఏనుగులకు తీసిపోవు. అవి కొండలను సైతం పిండిచేయగల బలము కలవి. సింహాలను సైతం ఎదిరించి పోరాడుతాయి. పిడుగులు పడినా లెక్కచేయకుండా ముందుకు వెళ్తాయి.

అడవిలో భయంకరంగా పరాక్రమంతో తిరిగే ఏనుగులు గుండెబలం, అధికారబలం, రాజకీయబలంతో తిరిగే మానవులకు ప్రతీక. ఎంతటి గొప్పవాడైనప్పటికీ భగవంతుణ్ణి సంపూర్ణ శరణు పొందకపోతే తనను తాను ఉద్ధరించుకోలేడని భావం.

అడవిలో ఏనుగులు అతి భయంకరంగా విహరిస్తుండగా మిగతా జంతువులన్నీ భయపడి పారిపోతున్నాయి. పులులు పొదరిండ్లలోకి, ఎలుగుబంట్లు గుహల్లోకి, అడవి దున్నలు నీటి మడుగుల్లో దాక్కొన్నాయి. కోతులు కొండలపైకి ఎగరగా, నెమళ్ళు ఆకాశంలోకి ఎగిరిపోయాయి.

భయంకరంగా విహరించే ఏనుగులను చూసి భయపడే జంతువులు, అధికారంతో ఉన్నవారిని చూసి మిగతా వారు భయపడతారని ప్రతీక

మద గజాల నుండి జాలువారుతున్న చెమట సుగంధ భరితమైనది. ఆ చెమటను త్రాగడం తుమ్మెదలకు చాలా ఇష్టం. పడుచు తుమ్మెదల గుంపు ఆ మదజలాన్ని ఆసక్తితో తాగి సంతోషంతో తిరుగుతూ జంజుమ్మని పాటలు పాడుతున్నాయి. హృదయ పద్మంలో ఉండే తుమ్మెద తృష్ణ, హృదయ పద్మంలో ఉండే సంకల్పాలు, తుమ్మెదల గుంపుకు ప్రతీక. ప్రకృతి సంబంధమైన నిర్వికల్పానందించే నిశ్చేష్టముగా ఆ తుమ్మెదలు ప్రణవనాదం చేశాయని ప్రతీక.

ఒక గండు తుమ్మెద తన ప్రియురాళ్ళకు మాటిమాటికి గజ మదజల సుగంధాన్ని ఎందుకు

ఇవ్వాలని ఆలోచించి తన దగ్గరకు వచ్చిన ఆడ తుమ్మెదలు నిండు మగతనాన్నంతా అందించింది. ఆడ తుమ్మెదల దగ్గరున్న గజ మద జలంలోని సువాసనకి ఆకర్షితులు అవుతున్నాయని ప్రతీక. జంతు పరిశోధనలో ఈ అంశం ప్రస్తావన కలదు. ఈ అంశాన్ని మహాకవులు తమ దివ్య దర్శనంతో కావ్యాలలో దాచిపెట్టారు.

అడవిలో ఎక్కడ పడితే అక్కడ తిరిగిన గజేంద్రుడు కొన్ని ఆడ ఏనుగుల వెంట నడుస్తుండగా దారితప్పి ఒంటరి వాడయ్యాడు. ఆ గజరాజు తన అన్నివైపులా దప్పికతో వస్తున్న ఏనుగుల గుంపును పట్టించుకోకుండా ఆ గుంపు నుండి వేరుపడి మరో దారిలో ముందుకు సాగుతున్నాడు. భగవంతుని సంకల్పం చేత తెలివి కోల్పోయాడు ఆ గజేంద్రుడు.

ఇంకా ఆ గజేంద్రుడు తన ప్రియురాళ్ళకు నీటి గుంటల ప్రక్కన ఉండే లేత చిగురు తినిపిస్తున్నాడు. తన పెద్ద చెవులతో వాటి చెమటల్ని పోగొడుతున్నాడు. ఋతు సమయాన్ని గుర్తిస్తూ తన ప్రియురాళ్ళతో ఆనందంగా  విహరిస్తున్నాడు.

సమాహార జీవ చైతన్యం – జీవ ప్రజ్ఞలుగా విడిపోయి దిగివచ్చిన వన్నీ  ఒకే దారిలో పయనించవు. దేనిదారి దానిదే. కనుక ఒక ఏనుగు మంద నుండి విడివడి దారి తప్పినదని వర్ణింపబడినది. అలా బయలుదేరిన జీవ చైతన్యం తనకొక ప్రత్యేకమైన అస్తిత్వాన్ని ఆపాదించుకొని జీవుడిగా గట్టిపడుతుంది. దాని చుట్టూ తన చైతన్యంతో ప్రభావితమైన శక్తి భావితమైన చోటు ఏర్పడుతుంది. దానినే 'జగత్తు' అంటారు. దానిలో ఒక ఆవరణం ఏర్పడి బిగిసిపోతుంది. దానినే 'అహంకారం' అంటారు.

అక్కడి నుండి బుద్ధి, చిత్తం, మనస్సు, ఇంద్రియాలు మొదలైనవి బీజాలుగా రూపొందుతాయి. ఇవన్నీ తన స్వభావంలోని భాగాలు లేక ప్రకృతులు. తన స్వభావంలోని వేరువేరు అంశాలు తన ప్రకృతులై కదలి వస్తారు. ప్రకృతి భార్యకు ప్రతీక. కనుకనే మంద నుండి విడివడి దారితప్పిన ఏనుగుతో పాటు అతని భార్యలుగా ఆడ ఏనుగులు కూడా వచ్చాయని ప్రతీకాత్మకంగా చెప్పబడింది.

మ॥ అట గాంచెం గరణీ విభుండు నవ పుల్లాం భోజ కల్హారమున్
నటదిందిదర వారముంగమరమీన గ్రాహ దుర్వారమున్
వటహింతాల రసాల సాల సుమనో వల్లీ కుటీ తీరముం

జటులో ద్ధూత మరాళ చక్ర బక సంచారంబు గా సారమున్

(భాగవతం–అష్టమ స్కంధం–42వ పద్యం)

ఆడ ఏనుగులతో పాటు క్రీడిస్తూ విహరిస్తున్న గజరాజు అడవులలో సంచరిస్తూ, దారి తప్పి దాహంతో తపించిపోతూ చివరకు ఒక అద్భుతమైన సరస్సును చేరాడు. ఆ సరస్సు లతలు, తీగలతో అప్పుడే వికసించిన రంగురంగుల కలువ పూలతో, వాటిపై నాట్యమాడుతున్న తుమ్మెదల గుంపులతో మనోహరంగా ఉంది. ఇక్కడ సరస్సు వ్యామోహానికి ప్రతీక. అందులోని తీగలు, లతలు, రంగు రంగుల పువ్వులు అరిసడ్వర్గాలకు ప్రతీక.

ఇతర మనుషులు ఎవ్వరూ లేని ఆ సరస్సు స్వచ్ఛమైన జలాలతో కనిపిస్తుండగా ఆ ఏనుగుల గుంపు పరవశించింది. కలువ పూల వాసనలతో నిండిన చల్లని గాలి సోకగానే వాటి దేహాలు పులకరించాయి. తామర తూండ్లను తిని రాయంచలు చేసే శబ్దాలు చెవులకు ఆనందం కలిగిస్తున్నాయి. విచ్చిన కలువల సువాసనలు ముక్కులకు ఆనందాన్నిస్తున్నాయి. స్వచ్ఛమైన అలల నుండి వెలువడిన నీటి తుంపరలు దప్పిక తీర్చినాయి. ముల్లోకాలలోనూ ఆ సరోవరం శోభ, కన్నులకు ఆనందం ఇచ్చింది. ఇలా మదపుటేనుగులు పంచేంద్రియాల జ్ఞానాన్ని మరచిపోయి మడుగులోకి దిగినాయి.

దైవ ప్రజ్ఞ నుండి బయలుదేరిన జీవ ప్రజ్ఞకు ఒక అద్భుతమైన సరస్సు కనిపించిందా అంటే భూత సృష్టికి ఆధారమైన దేహమనే వ్యూహం లభించిందని ప్రతీకార్థం. మూడులోకాల లోనూ అంతవరకు అటువంటి అద్భుతమైనది లేదట. అంటే అంతవరకూ మూడు లోకాలు విడివిడిగా తమ ధర్మాలతో నిండి ఉన్నాయి కానీ, ఒక సంపూర్ణ వ్యవస్థగా రూపొందడం లేదని ప్రతీకార్థం. శరీర వ్యూహాన్ని చక్కగా అర్థం చేసుకుంటే అంతకంటే అద్భుతం లేనే లేదు కదా!

మానవ వ్యూహంలో వేరు వేరు ప్రజ్ఞా కేంద్రాలు, శక్తి కేంద్రాలు ఉన్నాయి. ఇటువంటి కేంద్రాలను పద్మాలు లేక కలువలని శాస్త్రాలు సంకేతంగా చెబుతాయి. ఈ కేంద్రాలు ప్రాణశక్తికి స్థానాలుగా ఉంటాయి. ఆ ప్రాణశక్తి తరంగాలుగా ఉంటుంది. ఇది తుమ్మెదల ఝుంకారంగా సంకేతించబడినది. ఒక శరీర వ్యూహంలో ఒక్క జీవునికే అవకాశం ఉంటుంది. కనుకనే అంతవరకు 'అన్యపురుష సంచారంబై నిష్కలంకంబైన యప్పరిక జాకరంబు" (8–43) అని వర్ణించబడింది.

ఏనుగుల గుంపు తొండాలలో నీళ్ళు బాగా నింపుకొని చెక్కిళ్ళపై చల్లుకుంటూ గళగళమని

శబ్దాలు చేస్తున్నాయి. తమ పెద్ద కడుపులు నిండేలా సరస్సులు నీటిని అంతా తాగినట్లు ఆ ఏనుగులు కనిపిస్తున్నాయి.

మ॥ ఇభలోకేంద్రుడు హస్త రంధ్రముల నీరెక్కించి పూరించి చం
డభ మార్గంబున కెత్తి నిక్కివడి నుడ్డాడించి పింజింప నా
రభటిన్ నీరములోన బెల్లగసి నక్ర గ్రాహ పాఠీనముల్
నభమం దాడెడు మీన కర్కటములన్ బట్టెన్ సురల్ మ్రాన్పడన్

(భాగవతం–అష్టమ స్కంధం–47వ పద్యం)

ఇంకా గజేంద్రుడు సరస్సులోని నీటిని తొండంతో గట్టిగా పీల్చుకొని, ఆ నీటిని వేగంగా కదిలించి, ఆకాశం వైపు గట్టిగా చిమ్మినాడు. ఆ నీటి నుండి సరస్సులోని చేపలు, నల్ల మొసళ్ళు ఆకాశంలో తిరిగే మీన కర్కాటకములను పట్టుకోబోతున్నాయి. ఈ దృశ్యాన్ని చూసి దేవతలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అందమైన పద్మాలతో కూడిన సరస్సులో విహరిస్తున్న గజేంద్రునిపై తన ప్రియురాండ్రు అయిన ఆడ ఏనుగులు నీళ్ళు చల్లగా గజరాజు నీలాద్రిలాగా ప్రకాశిస్తున్నాడు. ఆడ ఏనుగులు అతని శరీరాన్ని కలువ పూలతో అలంకరించగా గజరాజు ఇంద్రునిలాగా విలసిల్లాడు. కలువల పుప్పొడిని చల్లగా అతను బంగారు కొండగా వెలిగిపోతున్నాడు.

ఈ విధంగా గజేంద్రుడు చేసిన సంచారం వల్ల సరస్సు అందం మారిపోయి కొత్త అందాలు సంతరించుకున్నాయి. గడుసువాడైన పురుషునితో రతిక్రీడలో పడి నలిగిపోయిన సుకుమారిలా సరస్సు మారిపోయింది. సరస్సులో శుష్కించి పోయిన పద్మాలు ముఖంలాగా, తమ స్థానాల నుండి జారిపోయిన చక్రవాకాలు స్తనాల్లాగా, నలిగిన ఇసుక తిన్నెలు అలసిన పరుపుల్లాగా నీరసపడి పోయి కనిపించాయని గజేంద్రుడు తాను సుఖిస్తూ, భార్యలను కూడా సుఖపెడుతున్నాడని అంతరార్థం.

జీవ ప్రజ్ఞకు తన స్వభావంలోని వేర్వేరు ప్రకృతి ధర్మాలకు ఆధారమైన స్థానాలు కావాలి. ఇంద్రియాల ధర్మాలున్నాయి గానీ, అనుభవించడానికి ఇంద్రియాలు లేవు. మనస్సనే ధర్మం ఉంది కానీ, ఇంకా మనస్సుకొక అస్తిత్వం లేదు. ఇవన్నీ శరీర వ్యూహంలో ఉన్నాయి. కావున జీవుడు వీనితో పాటు శరీర వ్యూహంలోకి ప్రవేశించి సంతృప్తిని పొందుతాడు. ఏ వ్యక్తి అయినా సంతోషించడం

అంటే తన స్వభావాన్ని తృప్తి పరచడమే. కాబట్టే గజేంద్రుడు తన భార్యలను సంతోషపెడుతూ తాను కూడా సుఖపడుతున్నాడని చెప్పబడింది. అప్పుడు ఇంద్రియాలు మనస్సు మొదలైనవి తృప్తిని పొందాయి. అంటే వాటికి స్థానాలు దక్కాయని ప్రతీకార్థం.

కానీ ఇక్కడ అన్ని ఇంద్రియాలు తృప్తిని పొందుతుండగా, "పంచేంద్రియ వ్యవహారములను మఱచి మత్తేభయూథంబు మడుగు జొచ్చె" (భాగవతం–అష్టమ స్కంధం–44వ పద్యం) అని పోతన ఒక విచిత్రమైన ప్రయోగం చేశాడు. ఎందుకంటే జీవుడు యజమానిగా ఉండి, తన స్వభావాన్ని, అందులోని భాగాలను నియంత్రిస్తుండాలి. గజేంద్రుడు నియంత్రించలేదని భావం. కానీ, శరీరంలోకి దిగివచ్చినప్పుడు తాను వేరుగా, యజమానిగా ఉండడం మాని, మనస్సు మొదలైన వాటితో తదాత్మ్యం చెందుతాడు. అప్పుడు ఇంద్రియాలలో తాను వ్యవహరింపజేయడం మరచిపోతాడు. అంటే గజేంద్రునిలాగా సరస్సులో తానే మనస్సు, ఇంద్రియాలుగా ప్రవర్తిస్తాడు.

### 4.5. కరి – మకరిల పోరు :

సీ॥ భుగభుగాయిత భూరి బుద్బుదచ్ఛటలతో
గదలుచు దివికి భంగంబు లెగయ;
భువన భయంకర పూత్కార రవమున
ఘోర నక్ర గ్రాహకోటి బెగడ,
వాల విక్షేప దుర్వార ఝంఝూ నిలవశమున
ఘుమ ఘుమా వర్త మడర
గల్లోల జాల సంఘట్టనంబుల దటీ
తరులు మూలములతో ధరణి గూల

(భాగవతం–అష్టమ స్కంధం–51వ పద్యం)

కరిరాజు సరస్సులో దిగి క్రీడించే సమయంలో ఆ మడుగులో ఒక మూల దాగి ఉండి, ఒక మకర రాజు అతడిని చూశాడు. భుగభుగమనే చప్పుళ్ళతో పెద్దపెద్ద బుడగలు పుట్టి, అలలు ఆకాశానికి ఎగిరేటట్లు పైకి ఎగసినాడు. మకరి హూంకారం చేస్తూ కుప్పించి ఎగిరాడు. రాహువు సూర్యున్ని పట్టుకున్నట్లు ఆ మకరరాజు, కరిరాజును ఒడిసి పట్టుకున్నాడు.

కం॥ కరిదిగుచు మకరి సరసికి గరి
దరికిని మకరి దిగుచు గరకరి బెరయన్
గరికి మకరి మకరికి గరి
భరమనుచును నతల కుతల భటుల దరిపడన్

(భాగవతం–అష్టమ స్కంధం–54వ పద్యం)

మకరిని కరి సరస్సులోకి ఈడ్చుచుండగా, కరి మకరిని ఒడ్డుపైకి లాగుతుండెను. ఇరువురి బలాబలాలు సమానంగా ఉండి, ఒకరి తాకిడిని మరొకరు తట్టుకోవడం కష్టమయ్యెను. ఇలా వారి పోరాటం భూమిలోపల, భూమిపైన గల జీవరాశులన్నీ భయపడేటట్లు సాగింది. ఆ సమయంలో మకరితో పోరాడుతున్న కరి రాజును ఒంటరిగా విడిచి పెట్టి వెళ్ళడానికి కాళ్ళాడక ఆడ ఏనుగులు ఊరక చూస్తూ ఉండిపోయాయి. ఈ విధంగా మానవుడు కష్టాలలో చిక్కుకున్నప్పుడు తన పరివారం, తన బంధువులు, స్నేహితులు ఎవ్వరూ కూడా వచ్చి ఆదుకొనరని ప్రతీకార్థం.

మకరికి నీళ్ళే బ్రతుకు తెరువు కావడం వల్ల క్రమంగా దానికి బలం, పట్టుదల పెరిగాయి. దానితో కరిరాజు కృష్ణపక్షంలోని చంద్రునివలె అంతకంతకు తగ్గిపోయాడు. ఈ విధంగా **అల్పుని హృదయంలో ఉండే జ్ఞానజ్యోతిని మహామాయ అనే అంధకారం కప్పివేయునట్లు** సమరోత్సాహంతో అంతకంతకు విజృంభించిన మకరరాజు మహాసాహసంతో కరిరాజును ఆక్రమించాడు.

తాను, తన స్వభావంతో తాదాత్మ్యం చెంది, శరీర వ్యూహంలోకి ప్రవేశించిన జీవునికి మహత్తరమైన ఆకర్షణ, పట్టు ఉంటుంది. అదే వ్యామోహమనే మొసలి. ఆ వ్యామోహం రాహువు సూర్యున్ని పట్టుకొన్నట్లు జీవుడిని సంసారంలో బంధిస్తుంది. అంతేకాదు ఆ వ్యామోహంతో జీవప్రజ్ఞ కృష్ణపక్షంలోని చంద్రునివలె అంతకంతకు కలుషితమవుతుంది.

జీవ ప్రజ్ఞ దేహవ్యూహంలోనికి దిగివచ్చినప్పుడు సృష్టిలోనున్న అభ్యాసబలమే పనిచేస్తుంది. అసలు ఒక కల్పమే బ్రహ్మదేవుని అభ్యాస బలాన్ని అనుసరించి సృష్టించబడుతుంది. కాబట్టి జీవునికి **"ఈ దేహమే తాను అనుకోవడం అభ్యాసమవుతుంది. దీనినే మాయ అంటారు"**. మాయ లేనిదే సృష్టిలేదు. అభ్యాసమనే శక్తి, మాయాశక్తిలోని కేంద్రబిందువు. **అభ్యాసబలం వల్లనే జీవుడు**

తాను వేరుగా ఉన్నానని, లోకం తనకన్నా వేరుగా ఉందని భావించడం జరుగుతుంది.

ఏనుగు సంసారి లేదా జీవికి ప్రతీక. మకరి కష్టాలకు ప్రతీక. గజరాజు ఆడ ఏనుగుల వ్యామోహంలో పడడానికి ప్రతీక. గజేంద్రుడు ఆడ ఏనుగుల వ్యామోహంలో పడి దారి తప్పడం అనేది జీవుడు వ్యామోహాలకు లోనై దారి తప్పడానికి ప్రతీక. అందమైన కాసారం అందులోని తీగలు, పుష్పాలు మొదలైనవి అరిషడ్వార్గాలకు లేదా వ్యామోహానికి ప్రతీకలు. అరిషడ్వార్గలకు (వ్యామోహం) ఆకర్షణ శక్తి ఎక్కువ. అందానికి పరవశించి మడుగులోనికి దిగిన గజేంద్రుడు వ్యామోహానికి ఆకర్షింపబడిన జీవుడికి ప్రతీక.

శా॥ పాద ద్వంద్వము నేల మోపి పవనున్ బంధించి పంచేంద్రియో
న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ మాఱాకు హత్తించి ని
ష్ఖేద బ్రహ్మ పదావలంబునరతిం గ్రీడించు యోగీంద్రు మ
ర్యాదన్ నక్రము విక్రమించె గరి పాదా క్రాంతి నిర్వక్రమై

(భాగవతం–అష్టమ స్కంధం–65వ పద్యం)

మొసలి రెండు కాళ్ళను నేలపై దృఢంగా ఆనించి, ఊపిరి బిగబట్టి వ్యామోహాన్ని అణచింది. బుద్ధి అనే తీగకు మారాకు తొడిగి, పరమత్మా స్థానాన్ని ఆశ్రయించే పరమయోగి పుంగవుడిలా ఏనుగు పాదాలను కదలకుండా వదలకుండా గట్టిగా పట్టుకొని తన బలాన్ని చూపింది.

యోగులు రెండు పాదాలను నేలపై నిలిపి ఉచ్ఛ్వాస నిశ్వాసాల వలన జ్ఞానేంద్రియాల వ్యామోహాన్ని అరికడతారు. తర్వాత బుద్ధికి వికాసం కలిగించి, దు:ఖరహితమైన బ్రహ్మపదాన్ని ఆశ్రయించి ఆనందిస్తారని ప్రతీక.

జీవుడు మాయలోనికి దిగివచ్చి బంధితుడై వర్తించడానికి ఎంత అభ్యాసబలం కావాలో అంతకంటే గొప్ప అభ్యాసబలం విముక్తి చెందడానికి కావలసి ఉంటుంది. ఎందుకంటే జీవుల ఊర్ధ్వముఖ, అధోముఖ ప్రవృత్తులు రెండింటికీ ప్రకృతిలోని అభ్యాసశక్తి కారణమవుతుంది. ఎక్కడో భగవదనుగ్రహం గురువు ద్వారా ప్రసరించి వస్తుంది. అప్పటి నుండి అంతర్ముఖమైన సాధన తపస్సుగా సాగుతుంది.

దీనిని సూచించడానికే పోతన జీవ ప్రజ్ఞను బంధించే వ్యామోహం కూడా యోగ సాధన వంటి పట్టుదలతో పట్టుబట్టెనని వర్ణించాడు.

ఉ॥ ఊహగలంగి జీవన పుటోలము నంబడి పోరుచున్ మహా
మోహలతా నిబద్ధ పదమున్ విడిపించు కొనంగ లేక సం
దేహము బొందు దేహి క్రియ దీన దశన్ గజముండె భీషణ
గ్రాహదురంత దంత పరిఘట్టిత పాద ఖురాగ్రశల్యమై

(భాగవతం–అష్టమ స్కంధం–67వ పద్యం)

గజేంద్రుడు తలకిందులై కలత చెందాడు. బతుకు మరుగులో పడి మోహమనే తీగతో కట్టివేయబడ్డ పాదాన్ని విడిపించుకోలేని దీన స్థితిలో భయంకరమైన మొసలి కోరలలో కరువబడి పోరాడుతూనే ఉన్నాడు.

సంసారంలో ఉన్న జీవుడు కష్టాలలో చిక్కుకుంటాడు. మోహలతో బంధాన్ని విడిపించుకోలేక అనేక సంశయాలకు పాత్రుడవుతాడు. ఇది గజేంద్రుని దీనస్థితికి ప్రతీకాత్మకత.

జీవునికి కామంలేక తృష్ణ లేదు. తృష్ణలేక సంసార బంధం లేదు. బంధం లేకుంటే మోక్షానికి ఆస్కారం లేదు. అందుచేతనే గజేంద్రుని జీవితాన్ని కామలీలతో ఆరంభించాడు. ప్రాణుల్లో గజేంద్రుడు మూఢ్రియానికి ప్రతీక. కామాగ్ని చేత తృష్ణ కలిగి దాని నివారణకు సరోవరానికి వెళ్ళగా భయంకరమైన జలగ్రహం  పట్టుకున్నట్లు గజేంద్రున్ని వర్ణించాడు.

గజరాజు మొసలి గొప్పబలంతో చాలా సంవత్సరాలు పోరాడడం వల్ల చితికి పోయాడు. గజరాజు నీటిలోని మొసలి బలాన్ని పోల్చుకొని దీన్ని గెలవాలనే అడియాస నాకు ఉండకూడదు. దీనితో పోరాడే శక్తి నాకు లేదు అని పూర్వజన్మ కర్మఫలంచేత దివ్యజ్ఞానం స్ఫురించింది.

శీత భానుడు షోడశ కళాత్ముడు. అతడు అమావాస్య నాటికి ఒకే కళతో మిగిలి మళ్ళీ దానితో తిరిగి పుంజుకుంటాడు. జీవుడు కూడా వ్యామోహంతో సమస్తం కోల్పోయి ఒకే ఒక ఆత్మబలంతో మిగులుతాడు గజరాజు మాదిరి. దానితోనే అతడు అంతవరకు కోల్పోయిన దానిని సమకూర్చు కోవలసి వుంది.

## 4.6. గజేంద్రుని దీనాలపములు :

శా॥ "ఏ రూపంబున దీని గెల్తు? నిట మీదే వేల్పు జింతింతు? నె
వ్వారింజీరుదు? నెవ్వరడ్డ? మిక నివ్వారి ప్రచారోత్తమున్

వారింపందగు వార లెవ్వ? రఖిల వ్యాపార పారాయణుల్
లేరే మ్రొక్కెద దిక్కుమాలిన మొఱాలింపంగ్ర పుణ్యాత్మకుల్"

(భాగవతం-అష్టమ స్కంధం-71వ పద్యం)

నేను ఏ విధంగా ఈ భయంకరమైన మొసలిని గెలవగలను. ఏ దేవుణ్ణి ప్రార్థింపను, నన్ను రక్షించమని ఎవ్వరిని పిలువను, మొసలి పరాక్రమాన్ని అడ్డగించి నా మొరను ఆలకించే వారు లేరా అని గజేంద్రుడు ఆర్తిస్తున్నాడు. గంధపు చెట్ల వాసనలతో నా పరివారంతో ఆనందంగా గడపకుండా ఈ సరస్సులోకి ఎందుకు వచ్చాను, భయంపుడుతోంది, భగవంతుడా నా గతి ఏమవుతుందో అని దీనంగా గజేంద్రుడు మాట్లాడుతున్నాడు.

తాను శక్తి హీనుడు అని గుర్తించడమే తరించడానికి మొదటి మెట్టు. ఈ భావనే శరణాగతికి మూలమని ప్రతీకాత్మకత. కర్మ, భక్తి, జ్ఞానములలో దేనిచేత కామమును గెలిచెదనని కామోద్రేకము వలన యోగములు, బలవియోగమగుటచే కామమును గెలవలేరనడానికి గజేంద్రుడు ప్రతీక. మనుష్య లోకము నందలి ఫల సిద్దులు పూర్ణముగా సిద్ధించును గాని ఫలము కూడా కొద్ది కాలము ఉండునని గజేంద్రుని ఆనందం వలన తెలియుచున్నది. కామ విముక్తిని కలిగించుటకు ఈశ్వరున్ని భక్తితో ఆరాధించుచూ, సర్వవ్యాపకుడు అయిన శ్రీమహావిష్ణువు లేడా అని జీవుడు (గజేంద్రుడు) ప్రార్థిస్తున్నాడు.

సహజానంద స్వరూపం అయిన అడవిలో ఉన్న గంధం చెట్లు వాసనలతో ఉండకుండా మృగతృష్ణ (కోరిక)ను జలం అని భ్రమము చెంది దుస్సంకల్పముల చేత ఈ మనోసరోవరంలోకి ఎందుకు వచ్చాను, అంటూ గజేంద్రుడు చింతిస్తున్నాడు. మనో సరోవరం అనగా సంసారం అని ప్రతీక. దు:ఖ భావమైన ఈ సరస్సులోకి ఎందుకు వచ్చానని జీవుడు నిశ్చేష్టుడై ఏమీ తోచక భయపడుతూ మొరను భగవంతుని వద్దకు పంపిస్తున్నాడు.

ఉ॥ "ఎవ్వనిచే జనించు జగ; మెవ్వని లోపల నుండు లీనమై;
యెవ్వని యందు డిందు బరమేశ్వరుడెవ్వడు; మూల కారణం
బెవ్వ; డనాది మధ్యలయు డెవ్వడు; సర్వము దానయైన వా
డెవ్వడు; వాని నాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్"

(భాగవతం-అష్టమ స్కంధం-71వ పద్యం)

ఈ జగత్తు ఎవని వల్ల పుడుతుందో, ఎవనిలో అణగి వుంటుందో, ఎవనిలో లీనమై పోతుందో ఎవరు పరమాత్ముడో, ఈ విశ్వానికి మూలం ఎవరో, ఎవనికి పుట్టుక, పెరుగుదల నాశనం ఉండవో, ఎవడు తనంతట తానే ఉద్భవిస్తాడో వానిని శరణు కోరుతాను అని గజేంద్రుడు ఆలపిస్తున్నాడు.

జీవుడు అనేక కష్టాలలో ఉన్నప్పుడు తాను అంతుకు ముందు చేసినవన్నీ మరచిపోయి, నన్ను కాపాడేవాడు, నాకు భయం పోగొట్టి, నన్ను ఆదుకునేవాడు, నా ఈ కష్టాల సరస్సు నుండి నన్ను కాపాడేవాడు ఎవ్వరైతే ఉన్నారో అలాంటి భగవంతుడికి శరణు వేడుకుంటున్నాడని ప్రతీకార్థం.

దివ్యజ్ఞానం అంటే భగవంతుడు. ఆయన్ను భజించే తత్త్వమని అర్థం. 'వాసుదేవ సర్వమితి' అనేదే దివ్యజ్ఞానం. దివ్యజ్ఞానం జీవుని పూర్వ స్వభావాన్ని మార్చివేస్తుంది. దివ్యజ్ఞానమే జీవుణ్ణి దీనున్ని చేసి, భగవదాశ్రయానికి దారితీస్తుంది. అవసాన దశలో జీవుడు  ఒంటరి అయినప్పుడు అతనిలో యదార్థమైన జ్ఞానం జాగతృమవతుంది. అప్పుడతడు భగవంతున్ని శరణు వేడుకుంటాడు.

ఇక దేహాత్మలు ప్రత్యేక జన్మలలో భిన్నభిన్నమైనవిగా ఉంటాయి. సాధారణంగా పూర్వజన్మలో చేసినవన్నీ మరుజన్మలో మరచిపోవడం జరుగుతుంది. భగవద్భక్తులైన పుణ్యాత్ములకు అలాంటిది జరుగదు. నిద్రించి లేచిన వాడు ముందు చేస్తున్న పనిని మేల్కొన్న తర్వాత ఆరంభించిన భక్తి యోగం చేత మరువకుండా ఆచరిస్తారు.

జీవునికి తాను కట్టుకున్న అహంకారపు పెంకునకు దెబ్బతగిలి, ఏ దేవతనైనా శరణు కోరాలనిపించుట సాధనలోని మొదటి మెట్టు. ఇలా ప్రారంభమైన అన్వేషణ దేవతలందరికీ మూలమైన ఒకే ఒక దైవం వద్దకు చేరి నిలబడుట క్రమ పరిణామం.

కం॥ "ఒకపరి జగముల వెలినిడి
యొకపరి లోపలికి, గొనుచు నుభయము దానై
సకలార్థ సాక్షియగు నయ్యక
లంకుని నాత్మమూలు నర్థిదలంతున్"

(భాగవతం–అష్టమ స్కంధం–74వ పద్యం)

ఆత్మమూలుడు అంటే తనకు తానే కారణమైన వాడని అర్థమే కాక, తనతోనున్న "నేను" అనే ప్రజ్ఞకు మూలమైన వాడు కూడా. అతడే అనే అర్థం కూడా ఉంది. ఈ అహంకారపు పట్టు సడలిపోతున్న

కొద్దీ, జీవునికి తనలోని జీవాత్మతత్వం స్ఫురించడం ప్రారంభమవుతుంది. ఈ వికాసంలోని మొదటి స్థితులలో ఈ జ్ఞానం స్పష్టంగా ఉండక, తెలిసీ తెలియనట్లుగా ఉంటుంది. తాను ఎప్పుడో విన్న తత్వాన్నే స్తోత్రం చేస్తూ దానిలో తనను అనుసంధానం చేసుకోవడం అప్రయత్నంగానే ప్రారంభమవుతుంది.

కం॥ "లోకంబులు లోకేశులు లోకస్థులు
దెగిన తుదిన లోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుగునతనినే సేవింతున్"

(భాగవతం–అష్టమ స్కంధం–75వ పద్యం)

లోకాలు, లోక పాలకులలు, లోకాలలో ఉండే అందరూ నశించినా లోకరహితమై నిత్యం ఎవ్వరుంటారో ఆ పరమాత్మను సేవిస్తానని గజేంద్రుడు అర్థిస్తున్నాడు. లోకములు అనగా సూక్ష్మభూత పంచీకరణములోని బ్రంహ్మాండ గోళములు. లోకేశులు అనగా ఇంద్రియములు. లోకస్తులు అనగా ఇంద్రియాది దేవతలు తెగిన, నశించిన పిమ్మట మనస్సును, బుద్ధిను, మహాత్త్వము అవ్యక్తముగును.

శాంత స్వరూపంగలవాడు, మోక్షానికి (వైకుంఠానికి) అధిపతి, దుష్టులకు ఘోర స్వరూపంలో దర్శనమిచ్చేవాడు, ప్రభువు, దయనీయుడు, సర్వానికి మూలమైనవాడు, ఆత్మకు ఆధారమైనవాడు, ఇంద్రియ జ్ఞాపకుడు, దు:ఖాలను ఉపశమింప జేసేవాడు, మాయ అనే నీడలో ప్రకాశించేవాడు, ఏకాంతమూర్తి అన్నింటికి కారణ భూతుడు అయిన వాడికి నన్ను కాపడమని నమస్కరిస్తున్నాను. అంటే గజేంద్రుడు ఇక్కడ విష్ణు సహస్ర నామాలకు ప్రతీకంగా పై వాటిని ఉపయోగించి శ్రీమహావిష్ణువును కాపాడమని వేడుకుంటున్నాడు.

కం॥ "కలడందురు దీనుల యెడ
గలడందురు పరమ యోగి గుణముల పాలం
గలడందురు రన్ని దిశలను
గలడు కలండనెడు వాడు గలడో లేడో"

(భాగవతం–అష్టమ స్కంధం–86వ పద్యం)

దీనులను కాపాడడానికి భగవంతుడు ఎప్పుడూ ఉంటాడని, ఉత్తమ యోగుల సమీపంలో ఎల్లపుడూ ఉంటాడని, అన్నిదిశలలోనూ భగవంతుడు ఉంటారంటారు. అలా ఉన్నాడు అని చెపుతున్న వాడు ఉన్నాడో లేదో అనే సందేహాన్ని గజేంద్రుడు వ్యక్తం చేస్తున్నాడు.

సంసార బంధనంలో చిక్కుకున్న వారిని, కష్టాలతో కూడుకున్న వారిని కాపాడ డానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడని అంటారు. ఈ సంసారం అనే సరస్సులోని మొసలి అనే కష్టాన్ని నుండి నన్ను గట్టెక్కించేవాడు ఉన్నాడా? ఉంటే ఆయన ఏ దిక్కులలో ఉన్నాడో అని జీవుడు సందేహాన్ని వ్యక్తం చేస్తున్నాడని ప్రతీకార్థం.

కం॥ "విశ్వకరు విశ్వదూరుని,
విశ్వాత్మకు విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మ ప్రభు
నీశ్వరునిం బరమపురుషు నే భజియింతున్" (8-88)

లోకాన్ని సృష్టించి లోకానికి దూరంగా ఉండేవాడు, అంతరాత్ముడై లోకం చేత తెలియ దగినవాడు, లోకం అంతా తానై లోకాతీతుడు అయిన శ్రీమన్నారాయణున్ని ఆరాధిస్తానని గజేంద్రుడు అంటున్నాడు. భగవంతున్ని మనస్సులో తలచుకొని ప్రార్థిస్తున్నాడు.

ఈ సరస్సు అనే సంసార బంధంలో చిక్కుకున్న సంసారి అయిన గజరాజు సంసారిక కష్టాలు తెలిసిన శ్రీమన్నారాయణుడిని వేడుకొని ఈ కష్టాల నుండి నన్ను కాపాడమని వేడుకుంటున్నాడని ప్రతీకార్థం.

శా॥ "లావొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్
తావుల్ దప్పెను; మూర్ఛవచ్చె; దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నిత: పరంబెఱుగ; మన్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వరా! కావవే వరద; సంరక్షింపు భద్రాత్మకా!"

(భాగవతం-అష్టమ స్కంధం-90వ పద్యం)

పరమేశ్వరా! నా శరీరంలో శక్తి లేదు. ధైర్యం కూడా తగ్గిపోతోంది. పంచ ప్రాణాలు పోతున్నాయి. మూర్ఛవచ్చి శరీరం సహకరించడం లేదు. బాగా అలసిపోయిన నాకు నీవు తప్ప మరో దిక్కు లేదు. ఈ

దీనున్ని రక్షించి, కాపాడు అని గజేంద్రుడు శరణాగతిలో ఆ పరమేశ్వరున్ని వేడుకొంటున్నాడు. ఈ పద్యంలో పరమ దీనుడై ప్రార్థన చేస్తున్న, మరణానికి దగ్గరగా వచ్చేవారి ఆర్తిని ప్రతీకాత్మకంగా తెలిపాడు.

మకరి లేదా మొసలి కష్టాలకు ప్రతీక. వ్యామోహంలో పడిన జీవునికి కష్టాలు తప్పకుండా వస్తాయి. గజేంద్రుడు వెయ్యేండ్లు పోరాడినా మొసలి నుండి విడిపించుకోకపోవడం అరిషడ్వార్గలకు లోనైన జీవుడు తనకు తానుగా బయట పడడానికి అవకాశం లేదు. గజేంద్రుడు సంశయంతో భగవంతుణ్ణి ప్రార్థించడం అనేది జీవుడు కూడా సంశయంలో కష్టాలు వచ్చినప్పుడు మాత్రమే భగవంతుణ్ణి తలచుకోవడం లాంటిది. గజేంద్రుడు "నీవేతప్ప నిత: పరంబెరుగ" అని సంపూర్ణ శరణాగతితో ప్రార్థించినప్పుడు భగవంతుడు కాపాడటం అనేది కూడా సంశయాత్మకతను వదలి భగవంతుణ్ణి ప్రార్థిస్తే భగవంతుడు తనను కాపాడుతాడని అర్థం/భావం.

ఆపదలో ఉన్న భగవంతుడు ఆదుకొనుగాక! అని సంకల్పించి, ఆకాశంవైపు చూస్తూ, నిట్టూర్పులు విడుస్తూ, చెవులను అప్పగించి గజేంద్రుని ఆక్రోశం ఉన్నట్లుగా కష్టాలలో ఉన్న మానవుడు కూడా కాపాడమని గజేంద్రుని వలె ఆక్రోశిస్తాడు. అలా చేస్తే ఆకాశం నుండి భగవంతుడు వస్తున్న అలికిడి వినిపిస్తుందోమేనని జీవుడు ఆలకిస్తున్నాడనేది సామాన్యమైన అర్థం.

ఉ॥ "ఓకమలాప్త! యో వరద! యో ప్రతిపక్ష విపక్షదూర ! కు
యో్య! కవియోగివంద్య సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ!యో మునీశ్వర మనోహర! యో విమల ప్రభావ! రా
వే! కరుణింపవే! తలపవే! శరణార్థిని నన్నుగావవే"!

(భాగవతం–అష్టమ స్కంధం–92వ పద్యం)

ఓ లక్ష్మీ వల్లభా! వరాలిచ్చేవాడా! మునులకు ప్రయోజనుడ, ఉత్తమ గుణాలు కలిగిన వాడా; కరుణ చూపి నన్ను కాపాడి రక్షించు స్వామీ అని ప్రాధేయపడ్డాడు గజేంద్రుడు. ఇక్కడ ఆకాశంలోని పరంజ్యోతి స్వరూపాన్ని గజేంద్రుడు తలచాడని ప్రతీక. ఇక్కడ ఎవర్ని పిలిచింది, త్రిమూర్తులు ముగ్గుర్ని పిలిచింది. రక్షణ కోరుకుంటుంది కాబట్టి స్థితికర్త రావాలని ప్రతీకార్థం.

నా బాధను తీర్చేవాడు మూలస్థానం నుండి రావాలని వేడుకుంది. రక్షణకు మూలకర్త విష్ణువు.

విష్ణువు అంటే సర్వం వ్యాపించినవాడు. గజేంద్రుడు త్రిమూర్తులను ముగ్గుర్నీ పిలిచినా తాను పిలిచిన దానికి అన్వయం అయినది విష్ణువు. మరి ఇలాంటి వాడు ఎవరు ఎక్కడ ఉన్నాడో అని గజేంద్రుడు పిలుస్తున్నాడు.

### 4.7. విష్ణువు ఆగమనం :

మ॥ "అలవైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబు దా
పల మందారవనాంతరామృత సర:ప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంకరమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము 'పాహి' పాహి యనగుయ్యాలంచి సంరంభియై"

(భాగవతం–అష్టమ స్కంధం–95వ పద్యం)

ఎక్కడో వైకుంఠంలో అంత:పురంలో శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితో వినోదిస్తున్న సమయంలో గజేంద్రుని మొర విని గజేంద్రున్ని రక్షించడానికి బయలుదేరాడు.

వైకుంఠం మోక్షాన్ని ప్రసాదించేందుకు ప్రతీక. అలాంటి వైకుంఠంలో ఉన్న మోక్ష ప్రదాత భయంతో స్వాధీనం తప్పిపోయిన భక్తుల మొర విని వారిని సంరక్షించడానికి బయలు దేరాడని ప్రతీక. ఎలా వెళ్తున్నాడంటే శ్రీమహావిష్ణువు తనను తాను మర్చిపోయి వెళ్తున్నాడు.

మ॥ "సిరికింజెప్పడు; శంఖచక్రయుగముం జేదోయి సంధింపడే
పరివారంబును జీరడభ్రగపతింబన్నింపడాకర్ణికాం
తరధమ్మిల్లముజక్క నొత్తడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై"

(భాగవతం–అష్టమ స్కంధం–96వ పద్యం)

గజేంద్రుని ప్రాణాలు కాపాడాలన్న ఉత్సాహంతో శ్రీమన్నారాయణుడు లక్ష్మీదేవి పక్కనే ఉన్నా ఒక్క మాట కూడా చెప్పలేదు. తన ఆయుధాలు, సేవకుల్ని, వాహనాల్ని ఎవర్నీ పిలువలేదు. వేగంగా వెళ్ళిపోతూ లక్ష్మీదేవి పైట కొంగును కూడా వదలి పెట్టలేదు.

ఇక్కడ ఒక తండ్రి తన పనిలో నిమగ్నం అయినప్పుడు తన కుమారుడు ఆర్తితో పిలువగా తన పని వదిలి, చేతిలో ఉన్నవాటితో వేగంగా పరుగెత్తినట్లు శ్రీమహావిష్ణువు కూడా తన భక్తున్ని కాపాడడానికి

లక్ష్మీదేవితో ఉన్నవాడు అలాగే వచ్చాడని ప్రతీకార్థం.

మ॥ "తనవెంటన్ సిరి, లచ్చివెంట నవరోధవ్రాతమున్, దాని వె
న్కను బక్షీంద్రుడు, వాని పొంతను ధను: కౌమోదకీ శంఖ చ
క్రనికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు రా వొచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగువారాబాల గోపాలమున్"

(భాగవతం–అష్టమ స్కంధం–98వ పద్యం)

శ్రీమహావిష్ణువు వేగంగా వెళ్తుంటే లక్ష్మీదేవి, ఆమె వెంట అంత:పురంలోని స్త్రీలు, వారి వెంట గరుత్మంతుడు, వీరి వెంట ఆయుధాలు, సేనాపతి, నారదమహర్షి మొదలైన వారందరూ ఏమో జరగుతోందని ఆశ్చర్యంగా వెళ్తున్నారు.

భక్తుడు పూర్తి శరణాగతితో వేడుకొంటే భగవంతుడు ఒక్కడే కాదు, ఆయన భార్యలు, ఆయుధాలు, సైన్యం, అందరూ భక్తున్ని కాపాడడానికి వస్తారని ప్రతీకార్థం.

మ॥ "తన వేంచేయి పదంబుబేర్కొన డనాథస్త్రీజనాలాపముల్
వినెనో, మ్రుచ్చులు మ్రుచ్చిలించిరో ఖలుల్ వేదప్రపంచంబులన్
దనుజానీకము దేవతా నగరిపై దండెత్తెనో, భక్తులం
గని చక్రాయుధుడేడి చూపుడని ధిక్కారించిరో దుర్జనుల్"

(భాగవతం–అష్టమ స్కంధం–100వ పద్యం)

శ్రీమహావిష్ణువు ఎక్కడకు వెళ్తున్నాడో చెప్పడు, దిక్కులేని స్త్రీల రోదనలు విని వెళ్ళాడా, రాక్షసులు వేదాలను దొంగిలించారా, దేవతల రాజధాని అమరావతిపై రాక్షసులు దండెత్తారా, హరి ఎక్కడ ఉన్నాడో చెప్పండి అని దుర్మార్గులు భక్తులను దండిస్తున్నారో ఏమీ చెప్పకుండా విష్ణువు పరుగెడుతున్నాడు.

తన భక్తులను కాపాడడానికి నారాయణుడు అన్నీ మర్చిపోయి, ఎవరికీ ఏమీ చెప్పకుండా, ఎక్కడకు వెళ్తున్నాడో కూడా చెప్పకుండా వెళ్తున్నాడు. ఈ పద్యంలో అన్నీ కూడా శరణార్థులే అందుకే ఆ దీనుని మొర విని తనపని తాను చేయడానికి శ్రీమహావిష్ణువు వెళ్తున్నాడని ప్రతీక.

శా॥ "తాటంకాచల నంబుతో, భుజనట ధ్ధమ్మిల్ల బంధంబుతో
శాటీ ముక్తకుచంబుతో, నధృఢచంచత్కాంచితో, శీర్ణలా

లాటలేపముతో, మనోహరకరాలగ్నోత్తరీయంబుతో

గోటేంద్ర ప్రభతో, నురోజభర సంకోచద్వల గ్నంబుతోన్”

(భాగవతం–అష్టమ స్కంధం–102వ పద్యం)

శ్రీమహావిష్ణువు తన భక్తున్ని కాపాడడానికి వేగంగా పరుగులు తీస్తుంటే ఆయన వెంట ఉన్న లక్ష్మీదేవి చెవిపోగులు కదలాడుతున్నాయి. ఒప్పు భుజాలపై చిందులు వేస్తోంది, ఒడ్డాణం వదులైపోయింది. పైట కొంగు మాత్రం శ్రీమహావిష్ణువు చేతిలో ఉంది.

ఈ సన్నివేశంలో అందరికంటే ఎక్కువ కష్టపడింది లక్ష్మీదేవి. శ్రీమహావిష్ణువుతో పాటు పరుగెడుతున్న అమ్మవారి ఆభరణాలు అన్నీ వదులైపోయి జారిపోయాయి. వేగంగా పరుగెత్తడం వల్ల చెమట పట్టిందని, ఈ చెమటలో ఉన్న లక్ష్మీదేవి కోటి చంద్రులు ఒకేసారి ప్రకాశిస్తే ఎంత వెలుగు వుంటుందో, అంత వెలుగుతోందని ప్రతీకార్థం. లక్ష్మీదేవి స్తనాలమీద కొంగు జారిపోయి స్తనాలు నడుము చిక్కిపోయాయి. అమ్మవారు జగన్మాత కావడం వల్ల అందరు ఆమె పాలు తాగి బ్రతుకుతున్నందు వల్ల ఆమె స్తనాలు, నడుము చిక్కిపోయాయని ప్రతీకార్థం.

సీ॥ “నిటలాలకము లంట నివుర జుంజుమ్మని

ముఖసరోజము నిండ ముసురు దేంట్లు

నళుల జోపగ జిల్క లల్ల నల్లన జేరి

యోష్ఠ బింబద్యుతు లొడియ నఱుకు

శుకములదోల జక్షుర్మీనకులకు

మందాకినీ పాఠీనలోకమెగుచు;

మీనపంక్తులదాట మెయిదీగతో

రాయశం పాలతలు మింట సరణి గట్టు”.

(భాగవతం–అష్టమ స్కంధం–104వ పద్యం)

శ్రీమహావిష్ణువు వెంట బయలుదేరి వస్తున్న లక్ష్మీదేవి అందంగా మెరసి పోతోంది. ఆమె ముఖం మీద తుమ్మెదలు ముసురు కున్నాయి. తుమ్మెదలను తోలుచుండగా, చిలుకలు పెదాలమీదకు వచ్చాయి. చిలుకల నుండి తప్పించుకొనేలోగా కన్నుల కోసం చేపలు వెంట పడ్డాయి. వీటన్నింటినీ తప్పించుకొని

వెళ్తుండగా, మెరుపు తీగలు ఈమెను రాసుకొని ధన్యంకావాలని ఆకాశంలో బారులు తీశాయి.

గజరాజును రక్షించడానికి వెళ్తున్న హరితో పాటు సిరికూడా వెళ్తోందని ప్రతీక. ఆ సిరిని పెద్ద పద్మంతో పోల్చాడు. ఆ పద్మానికి తామరలు ముసురుతున్నాయి. వీటన్నింటినీ తప్పించుకుంటూ చాలా కష్టంగా అమ్మవారు అయ్యవారితో పాటు భక్తున్ని కాపాడటానికి వెళ్తోందని ప్రతీక.

మ॥ "చనుదెంచెన్ ఘనుడల్లవాడె! హరి పజ్జంగంటిరే లక్ష్మి? శం
ఖనినాదంబదె; చక్రమల్లదె; భుజంగధ్వంసియున్ వాడె; క్ర
న్నన నేతెంచె నటంచు వేల్పులు నమో నారాయణాయేతిని
స్వనులై మ్రొక్కిరి మింట హస్తిదురవస్థావక్రికింజక్రికిన్"

(భాగవతం–అష్టమ స్కంధం–107వ పద్యం)

ఆపదలో ఆదుకున్న భక్తున్ని కాపాడడానికి వెళ్తున్న శ్రీహరిని చూసి దేవతలందరూ ఆనందంతో చూసి, ఆయన పరివారాన్ని, ఆయుధాలను చూసి 'ఓం నమోనారాయణాయ' అనే మంత్రం జపిస్తున్నారు.

గజేంద్రున్ని రక్షించడానికి తనను తాను మర్చిపోయి వెళ్తున్న శ్రీమహావిష్ణువును చూసి వారందరూ కూడా ఓం నమోనారాయణాయ అనే మంత్రాన్ని జపిస్తూ గజరాజుని కాపాడే సన్నివేశానికి దేవతలందరూ కూడా వచ్చారని ప్రతీకాత్మకత.

## 4.8. శింశుమార చక్రం :

జ్యోతిశ్చక్రానికి సంబంధించిన ఖగోళ విశేషం. మొసలి, ఎండ్రికాయ, చేపల జంటల్లాగా నక్షత్రాలు కనిపించే ఒక విచిత్ర సన్నివేశం. దీన్నే 'జ్యోతిర్మండలం' అంటారు. తాబేలు కుబేరుని ధనాగారానికి 'కచ్ఛప' అని పేరు. అందుకే తాబేలును, చేపను, మకరాన్ని ధనం కోరుకునేవారు పూజిస్తారు.

మ॥ "కరుణాసింధుడు శౌరి వారిచరణమున్ ఖండింపగా బంపె స
త్వరితాకంపితభూమిచక్రము మహోద్య ద్విస్ఫులింగచ్ఛటా
పరిభూతాంబరశుక్రమున్ బహువిధ బ్రహ్మాండభాండచ్ఛటాం
తర నిర్వక్రము బాలితాఖిల సుధాందశ్చక్రముంజ క్రమున్"

(భాగవతం–అష్టమ స్కంధం–109వ పద్యం)

శ్రీమహావిష్ణువు గజేంద్రుని కాపాడి, మొసలిని చంపడానికి తన ఆయుధం సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. అది ఎటువంటిది అంటే దేవతలను కాపాడేది, భూవలయాన్ని కంపించేది, అగ్ని కణాలతో ఆకాశంలోని చుక్కల్ని లేకుండా చేసేది.

గజేంద్రున్ని కాపాడడానికి శ్రీహరి వదిలిన సుదర్శన చక్రం అంబర శుక్రము. అంటే పాలపుంత. నక్షత్ర మండలం కాంతి అని సుదర్శన చక్రాన్ని వర్ణించవచ్చు.

శా॥ "భీమంబైతలద్రుంచి ప్రాణముల బాపెంజక్రమాశుక్రియన్
హేమక్ష్మాధర దేహముంజకి తవన్యేభేంద్రసందోహముం
గామక్రోధనగేహమున్ గరటి రక్త స్రావగాహంబు ని
స్సీ మోత్సాహము వీతదాహము జయశ్రీ మోహనము గ్రాహమున్"

(భాగవతం–అష్టమ స్కంధం–112వ పద్యం)

విష్ణువు వదిలిన చక్రాయుధం భయంకరంగా మొసలి తలను నరికి చంపింది. అది మేరు పర్వతంలా మెరిసి పోతోంది. అది అడవి ఏనుగులకు భయాన్ని పుట్టించేదిగా ఉంది. కామక్రోదాలలో నిండినది. అలాంటి మొసలిని సుదర్శన చక్రం చంపివేసింది.

శ్రీమన్నారాయణుడి సుదర్శన చక్రం వెలుగులు విరజిమ్ముతూ వచ్చి మకరిని చంపి, గజేంద్రున్ని కాపాడింది ఇక్కడ వెలుగులు అంటే మానవునిలో ఉన్న అజ్ఞానానికి ప్రతీక ఈ అజ్ఞానం తొలగిపోతే అన్నీ కూడా సమకూరుతాయి. భవబంధాలన్నింటినీ ఈ చక్రం ఖండించింది. అజ్ఞానం నశించి జ్ఞానం ఉదయించినపుడు నిన్ను నువ్వు తెలుసుకోబడిన వాడవు అవుతావు. మహాత్ముడు అవుతావు. పరమాత్ముడవు అవుతావు.

ఒక రెప్ప పాటులో మొసలిని చంపినది సుదర్శన చక్రం. ఆ సమయంలో దీని చూసిన మొసళ్ళు భయపడ్డాయి. అవన్నీ భయంతో దిక్కులకు పారిపోయాయి.

జగత్తులోని మకరాలన్నీ చక్రం విశ్వరూపం చూసి, ఆదికూర్మం చాటుకెళ్ళి దాక్కున్నాయని ప్రతీక.

మ॥ "తమముం బాసిన రోహిణీ విభుక్రియన్ దర్పించి సంసార దు:
ఖము వీడ్కొన్న విరక్తచిత్తునిగతిన్ గ్రాహంబు పట్టూడ్చి పా

దము లల్లార్చి కరేణుకా విభుడు సౌందర్యంబుతో నొప్పె సం

భ్రమదాశా కరిణీ కరోజ్ఝిత సుదాంభస్స్నాన విశ్రాంతుడై”

(భాగవతం–అష్టమ స్కంధం–115వ పద్యం)

మొసలి పట్టునుండి విడువడిన గజరాజు ఎలా ఉన్నాండంటే నల్లని చీకటి నుండి బయటకు వచ్చిన చంద్రుడిలా, సంసార బంధనాల నుండి విముక్తి కలిగిన విరక్తునిలా కనిపించాడు. అప్పుడు తమ భర్త అయిన గజేంద్రున్ని ఆడ ఏనుగులు అమృతంతో అభిషేకించగా, ఆ అమృతంతో అలసట తీర్చుకొని నిజ సౌందర్యంలో విష్ణుసాయిజ్యం పొందాడు.

తర్వాత సంసారం అనే సరస్సులో నుండి తన స్వహస్తాలతో గజరాజును బయటకు లాగి, తన బాధను, దు:ఖాన్ని పోగొట్టాడు శ్రీమన్నారాయణుడు. అలా తన శరీరానికి శ్రీహరి చేయి తగలగానే అరిషడ్వర్గాలను జయించిన వాడిగా గజేంద్రుడు మారిపోయాడని ప్రతీక.

మొసలి నుండి బయట పడిన గజరాజు మళ్ళీ ఆడ ఏనుగులను కలుపుకొని మునుపటి సంసారి వలె ఉన్నాడు గజరాజు. పశు ప్రవృత్తిలోని అద్భుతమైన రహస్యం ఇది. మనిషి విషయం కూడా ఇంతే.

పూర్వ జన్మలో ఉన్నప్పుడు చేసిన మహత్తరమైన పూజవల్ల జీవుడు కాలాంతరాన ఏ జన్మమెత్తినప్పటికీ భగవంతుడతనిని ఆశ్రిత వాత్సల్యంతో ఉద్ధరిస్తాడన్న సత్యాన్ని ఈ ఘట్టం తెలియజేస్తుంది. అందుచేతనే జీవ కోటి ఆత్మవిశ్వాసంతో భగవంతుడికి జయజయ ధ్వానాలు పలికింది.

### 4.9. కరి – మకరుల పూర్వజన్మ :

పూర్వం ‘హూహూ’ అనే పేరుగల గంధర్వుడు ఒకనాడు స్త్రీలతో కూడి సరోవరంలో స్నానమాచరిస్తూ ఉండగా, ఆ సమయంలో దేవల మహర్షి కూడా స్నానమాచరిస్తున్నాడు. అప్పుడు ‘హూహూ’ దేవల మహర్షిని చూసి పరిహసిస్తూ, ఒకదశలో తన స్త్రీలను ఆనంద పరచడానికి ఆ మహర్షి పాదాలను బట్టి లాగాడు. గంధర్వుని ప్రవర్తనకు కోపోద్రిక్తుడైన మహర్షి మకర జన్మమెత్తునట్లు గంధర్వున్ని శపించాడు.

దీనివలన అతడు హీన జన్మమెత్తి, సుదీర్ఘకాలం అవ్యక్తమైన బాధతో కుమిలి పోయాడు. దాని వలన పాపబుద్ధి క్షాళనమయి, చివరకు విష్ణు దర్శనాన్ని పొందాడు.

ఇక సర్వ జీవులలోనూ నారాయణున్ని చూడవలసిన విష్ణుభక్తుడు ఇంద్రద్యుమ్నుడు. తన మనస్సులో నారాయణుడిని మాత్రమే ధ్యానిస్తూ, అగస్త్య మహర్షిని గౌరవించలేదు కనుక అతడు మోహం చెందిన వాడు లేక మూఢుడు. తనతో నిలబడి ఉన్న నారాయణ ధ్యానముద్ర చెదిరి పోవునని లోభించిన వాడు కనుక అతడు లోభి. ఈ కారణం వల్లనే అగస్త్య మహర్షి 'మూఢుడా' లోభి నీవు ఏనుగు గర్భంలో పుట్టెదవు అని శపించాడు. ఆయన కోపమే శాపరూపమైన అనుగ్రహంగా ఇంద్రద్యుమ్నుని కోపాన్ని క్షాళన చేసి విష్ణు సాక్షాత్కారానికి అర్హత కలిగించింది.

ఈ కరి – మకరి విషయాల వలన మనకు మహర్షుల కోపమైనా, శాపమైనా అది అనుగ్రహమే కానీ, ఆగ్రహం కాదని తెలుస్తుంది. అందుకే ఆద్యులైన ఋషుల వాక్కులను అనుసరించి పరమార్థం నడచి వస్తుందని భవభూతి మహాకవి అంటాడు.

ఇంద్రద్యుమ్నుడు ప్రకాశమైన మనస్సుగల జీవునికి, అగస్త్యుడు నిశ్చలత్వ భావానికి ప్రతీకలు. ఇందద్రద్యుమ్నుడు దగ్గరకు అగస్త్యుడు వచ్చాడంటే మనసును సాధనలలో శుద్ధపరచి ఉంచిన జీవునకు నిశ్చలతత్త్వం గోచరిస్తుందని ప్రతీకార్థం. ఇంద్రద్యుమ్నుడు అగస్త్యున్ని పలకరించ లేదంటే జీవుడు తన సాధనలో గోచరించిన ఆ నిశ్చలతత్త్వాన్ని నిలువరించుకోలేక పోయాడని అర్థం.

దీని వల్ల జీవునికి దేహ త్రయాతీత స్థితికాదు. అంతవరకు దేహత్రయ గుణాలతో జీవుడు జనన మరణాలతో సతమతమవుతూ ఉండాల్సిందే. ఇదే గత జన్మ ఇంద్రద్యుమ్నునికి శాపంగా ప్రాప్తించడంలోని ప్రతీకార్థం. ఇక్కడ గజేంద్రుడి పూర్వజన్మ అన్నది పూర్వకృత సంస్కారం అనే అర్థంలో వాడబడింది అని గ్రహించాలి. ఎందుకంటే నిశ్చలత్వంతోనే పరమాత్మ ధ్యానం జరుగుతుంది. పరమాత్మ జ్ఞానంలోనే మోక్షం సిద్ధిస్తుంది.

దైవప్రజ్ఞ సామూహిక జీవ ప్రజ్ఞగా దిగివచ్చి, ఒక జీవుడు (గజేంద్రుడు)గా వేరుపడి, తనకు అనువైన శరీర వ్యూహాన్ని (సరస్సు) గ్రహించి, సంతోషంతో దానిలో ప్రవేశించి 'ఇదినాదే' అనే స్థితి నుండి 'ఇది నేనే' అనే స్థితిలోకి దిగిపోతాడు. ఈ అభ్యాస వ్యామోహాల (మొసలి) పట్టులో నుండి బయట పడడానికి చివరకు జీవుడు ఒంటరిగానే ప్రయత్నిస్తాడు. ఎందుకంటే తన స్వభావం (గజేంద్రుని భార్యలు) తనకేమాత్రం సహాయం చేయలేదు. ఇది కేవలం జీవునికి, దేవునికి (నరుడు – నారాయణుడు) మధ్యగల వ్యవహారమే తప్ప ఇతరులకు ఇందులో ప్రమేయం లేదు.

మరి భగవంతుని తత్త్వమంటే జీవులను దేవుడు మరచి పోవడం ఉండదు. కానీ తనంత తానుగా వారిని రక్షించడం కూడా ఉండదు. దీనిని పోతన శ్రీహరి శ్రీదేవికి చెప్పినట్లుగా వివరించాడు.

కII "ఎఱుగుదు తెలవా! యెప్పుడు
మఱవను సకలంబు నన్ను మఱచిన యెడలన్
మఱతునని యెఱిగి యెఱుగక
మఱవక మొఱ యిడిర యేని మఱి యన్యములన్"

(భాగవతం-అష్టమ స్కంధం-130వ పద్యం)

దీనిలో నరజాతి యొక్క చరిత్ర మొత్తం నమూనాగా చెప్పబడింది. కాబట్టి ఈ ఘట్టం నరజాతి యొక్క శాశ్వత గాథ; ఈ కథలో నరుల ఆవిర్భావం, అందులో జీవుని పరిణామ విధానం, గురుశిష్యుల అనుబంధం, జీవ - ఈశ్వరుల బాంధవ్యం, నర - నారాయణుల క్రీడా విధానం మొదలైనవన్నీ ఒక వ్యూహంగా, అర్థవాదంగా ఇవ్వబడినాయి.

తామే గొప్ప అనుకుంటూ అహంకారంతో గురువులను అవమానిస్తే అలాంటి వారికి ఏ కాలంలో అయినా అధోగతి కల్గుతుందని కరి - మకరుల పూర్వజన్మ వృత్తాంతాలు తెలియజేశాయి. విధివశాత్తు సంభవించే ఆపదల నుండి, పదవులూ, పరివారమూ, అధికారాలు ఏవీ మనిషిని కాపాడలేవని గజేంద్రుని పాత్ర ద్వారా మనకు స్పష్టమవుతుంది.

ఆర్తుల మొర ఆలకించగానే "ఆపన్న ప్రసన్నుడైన" భగవంతుడు పరుగెత్తుకు వచ్చి రక్షిస్తాడని 'గజేంద్రమోక్షం' మనకు ప్రబోధించింది. కాబట్టి త్రికరణ శుద్ధిగా భగవంతుడున్నాడని నమ్మి, ప్రార్థిస్తే మన యోగ క్షేమాలు ఆయనే చూసుకుంటాడని ఈ కథ తెలియజేసింది. మన ప్రయత్నం మనం చేస్తేనే దైవం కూడా సహకరిస్తుంది. కనుకనే కరి - మకరితో వెయ్యేండ్లు పోరాడి, చివరకు భగవంతుణ్ణి శరణాగతి చేసింది. ఉద్యమం, సాహసం, శౌర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం ఎవరికి ఉంటాయో వారికి తప్పకుండా దైవ సహాయం ఉంటుందనే నీతి ఈ ఘట్టం వల్ల తెలియవచ్చింది.

శ్రీమహావిష్ణువుకు సంపూర్ణ శరణాగతితో ఉండే భక్తుడే ముఖ్యం. ఈ భక్తుడు పిలిస్తే నారాయణుడు ఎక్కడ, ఏస్థితిలో ఉన్నా వచ్చి కాపాడుతాడు. భగవంతుడికి భక్తునికన్నా ఎవరూ ముఖ్యం కాదు. చివరకు భగవంతుడికి భార్యకన్నా భక్తుడే ముఖ్యమని ఈ కథద్వారా పోతనామాత్యుడు తెలిపాడు.

# ఉపసంహారం

# ఉపసంహారం

"భాగతవతంలోని గజేంద్రమోక్షం – ప్రతీకాత్మకత" లఘు సిద్ధాంతవ్యాసాన్ని నాలుగు అధ్యాయాలుగా విభజించాను. 1. శ్రీమద్భాగవత వైశిష్ట్యం, 2. భాగవతం భక్తితత్త్వ మార్గాలు, 3.తెలుగు సాహిత్యంలో ప్రతీకలు, 4. గజేంద్రమోక్షం ప్రతీకాత్మకత. ఈ పరిశోధనలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయని నేను భావిస్తున్నాను.

ప్రస్తుతం సమాజంలో విభిన్న వర్గాల వ్యక్తిత్వాలు మనకు తారసపడుతున్నాయి. అయితే మానవత్వం విలువలను వదిలేసి, దానవత్వ లక్షణాలకు క్రమంగా ఆలవాలమవుతున్నాడు. ఈతరుణంలో సాహిత్యం నుంచి మనం నేర్చుకోవలసిన అంశం ఏమైనా ఉన్నదా అని లోతుగా ఆలోచించిన తరుణంలో నాకు గజేంద్రమోక్షం కనిపించింది. అందులో భాగంగా నా పరిశోధనానుగుణంగా ఎం.ఫిల్. లఘు సిద్ధాంత వ్యాసంగా మలచుకొని అందులో ప్రతీకాత్మక అంశాలను చర్చించాను.

సర్వాంతర్యామి అయిన శ్రీమహావిష్ణువు అవతారాలలోని శ్రీకృష్ణుని హృదయమైన భాగవతం గొప్పతనం, పురాణాలలో చెప్పబడిన భాగవతం గొప్పతనం, నాలుగు శ్లోకాలలో భాగవత గొప్పతనం ఈపరిశోధనకు అనుగుణంగా వివరించానని భావిస్తున్నాను. భగవంతుణ్ణి చేరుకోవడానికి నవవిధ భక్తిమార్గాలను, సముద్రమంతటి తెలుగు సాహిత్యంలో కొన్ని కావ్యాలలోని ప్రతీకలను వివరించాను.

భాగవతం అష్టమస్కంధంలోని గజేంద్రమోక్షమును ప్రతీకాత్మకతతో వివరించాను. ఇందులో భగవంతుణ్ణి పూర్తి శరణాగతితో వేడుకోవాలని అలా వేడుకుంటే భగవంతుడు అన్నీ వదిలి పెట్టి కాపాడుతాడనే విషయాన్ని ప్రతీకాత్మతతో వివరించే ప్రయత్నం చేశాను.

ఎంత సాంకేతిక విజ్ఞానం పరిఢవిల్లుతున్నా, కొన్ని సాంప్రదాయ పద్ధతులను, మనం పాటించాలి, మన భావితరాలకు అందించాలి. భక్తి అంటే ఒక నమ్మకం. మనం భగవంతున్ని నమ్మడం ద్వారా ఆ నమ్మకాన్ని నిలబెట్టుకొనే ప్రయత్నం చేయాలి. ఇందులో ఏ మతానికి, కులానికి ప్రాతినిధ్యం ఉండకూడదని నేను భావిస్తున్నాను. అన్ని వర్గాల ప్రజలకు వారి వారి మతాచారాల ప్రకారం వారి వారి ఇష్టదైవాలను మనస్ఫూర్తిగా నమ్మాలి. భక్తితత్త్వమే ఈ ప్రపంచానికి మంచిని నేర్పుతుందని నేను భావిస్తున్నాను.

సాధారణ వ్యక్తే శయనమందిరంలో భార్యతోపాటు ఉన్నప్పుడు ఎంత దగ్గరి అనుచరుడు వచ్చినా తర్వాత రమ్మని చెప్పడం సర్వ సాధారణం. భగవంతుడు నిత్యనూతనంగా శోభిస్తున్న లక్ష్మీదేవితో తన శయన మందిరంలో సరసల్లాపాలతో వినోదిస్తున్న సమయంలో శ్రీమహావిష్ణువుకి ఒక జంతువు (గజేంద్రుడు) సంపూర్ణ శరణాగతితో అర్థిస్తే, భార్య ఎలాంటి స్థితిలో ఉందో పట్టించుకోకుండా తన పరివారాన్నంతటినీ పక్కనపెట్టి భక్తుని మొర విని పరుగెత్తుకుంటూ వచ్చాడు. అంటే భగవంతునికి భార్యకూడా ముఖ్యంకాదు. తన పరివారమూ ముఖ్యం కాదు. భక్తుడు మాత్రమే ముఖ్యం. సంపూర్ణమైన శరణాగతితో పిలిస్తే భగవంతుడు ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా వస్తాడనేదానికి నిదర్శనం ఈ గజేంద్రమోక్ష ఘట్టం.

మనిషికి కావాల్సింది గొప్ప కులమో, గొప్ప మతమో, ధనమో, అధికారమో మరొకటో కాదు. కావాల్సింది భగవంతుడిపట్ల సంపూర్ణమైన శరణాగతి. ఈ సంపూర్ణ శరణాగతి ఒక్కటుంటే భగవంతుడు నీదగ్గరకే పరుగెత్తుకుంటూ వస్తాడు. ఇదే విషయాన్ని భక్త కనకదాసు నీలోఉన్న అరిషడ్వర్గాలను, సప్తవ్యసనాలను తొలగించుకొని, ఇంద్రియ నిగ్రహం సాధిస్తే నువ్వు భగవంతుని దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం లేదు. భగవంతుడే నీ దగ్గరకు దాసుడై వస్తాడని తెలిపాడు. నీవు మనసును శుభ్రం చేసుకుంటే భగవంతుడే నీకు దాసుడవుతాడన్నాడు.

పోతన గారు కూడా సంపూర్ణమైన శరణాగతితో ప్రార్థిస్తే భగవంతుడు పరుగెత్తుకుంటూ వస్తాడని మనకు సందేశాన్నిస్తున్నాడు. సంపూర్ణ శరణాగతితో భగవంతుణ్ణి ప్రార్థించి, ఆయన కరుణా కటాక్షాలను పొంది తరించాలని కోరుకుంటున్నాను.

# ఉపయుక్త గ్రంథ సూచి

# ఉపయుక్త గ్రంథ సూచి


1. అంతరార్థ భాగవతం - వేదుల సూర్యనారాయణశర్మ
2. అంతరార్థ రామాయణం - వేదుల సూర్యనారాయణశర్మ
3. ఆంధ్రమహాభాగవతము - బమ్మెర పోతనామాత్యుడు
   తి.తి.దే. ప్రచురణ,తిరుపతి
4. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు - శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులు
5. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయాలు ప్రయోగములు - డా॥ సి. నారాయణరెడ్డి
6. కవిత్రయం-ఆంధ్రమహాభారతము - ఉస్మానియా విశ్వవిద్యాలయసంశోధిత ముద్రణ
7. కవి సమయాలు - డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి
8. కళాపూర్ణోదయం - పింగళి సూరన
9. గజేంద్రమోక్షం -రహస్యార్థం - చదువుల వీర్రాజుశర్మ
10. గీతామకరందము - శ్రీశ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి
11. తెలుగు విప్లవ కవిత్వంలో ప్రతీక - డా॥ తాతిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
12. దశావతార తత్త్వ విశ్లేషణ - డా॥ జి.దామోదర్ నాయుడు
13. పండరీ భాగవతం - పుట్టపర్తి నారాయణాచార్యులు
14. పారిజాతాపహరణం - నంది తిమ్మన
15. పాండురంగ మహాత్మ్యం - తెనాలి రామకృష్ణుడు
16. పోతన భాగవతం-ప్రతీకాత్మకత సౌందర్యం - డా॥ వీపూరి వెంకటేశ్వర్లు
17. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో ప్రతీకలు - డా॥ పరవస్తు కమల
18. మను చరిత్ర - అల్లసాని పెద్దన
19. భక్తి తత్త్వం - నిర్వికల్పానంద స్వామి
20. భక్తితత్త్వ దర్శనం - చర్ల గణపతి శాస్త్రి
21. భాగవతలహరి పరిశోధనాత్మక వ్యాస సంకలనం - డా॥ వీపూరి వెంకటేశ్వర్లు
22. సంపూర్ణ పోతన భాగవతం - టీకా - ఊలపల్లి సాంబశివరావు
23. సౌందర్యలహరి - ఆదిశంకరాచార్యులు
24. హరివంశం - ఎఱ్ఱన (వావిళ్ళవారి ప్రచురణ)

# అనుబంధం

NAAC Re-Accredited 'A' Grade

# కె. వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల

స్వయంప్రతిపత్తి (స్థాపితం : 1958)

కర్నూలు, ఆంధ్రప్రదేశ్.

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC CARE - Journal
Arts & Humanities
Sl.No. : 35

# భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 02 - Spl. Edition - February 2020 - ISSN No. : 2456-4702



# తెలుగు సాహిత్యం, చరిత్ర, సంస్కృతి - సమాలోచన

## అంతర్జాతీయ సదస్సు

తేదిలు : 26, 27 ఫిబ్రవరి 2020, బుధ, గురు వారాలు

నిర్వహణ :

## తెలుగు, చరిత్ర అధ్యయన విభాగాలు

కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల,

కర్నూలు, ఆంధ్రప్రదేశ్.

# తెలుగు సాహిత్యం, చరిత్ర, సంస్కృతి - సమాలోచన"

# అంతర్జాతీయ సదస్సు

**భావవీణ** ప్రత్యేక సంచిక

**ISSN No. : 2456-4702**

**RNI No. APTEL/2003/12253**
**UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35**

| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణ | : | **25 ఫిబ్రవరి 2020** |
| ప్రతులు | : | **500** |
| కాపీలకు | : | ప్రిన్సిపాల్, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), కర్నూలు, ఆంధ్రప్రదేశ్. |
| | : | డా॥. ఎం. షామీదాబేగం, శాఖాధిపతి, తెలుగు విభాగం, శ్రీమతి వి. వింధ్యావాహిని దేవి అధ్యాపకులు, తెలుగు విభాగం, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), కర్నూలు, ఆంధ్రప్రదేశ్. |
| | : | శ్రీ బి. ప్రకాష్, అధ్యాపకులు, చరిత్ర విభాగం, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), కర్నూలు, ఆంధ్రప్రదేశ్. |
| గమనిక | : | ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం. |
| ఎడిటోరియల్ చిరునామా | : | హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు - 522 002. |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, లేమల్లె, అమరావతి మండలం, గుంటూరు జిల్లా. సెల్ : 9494 660 509. |

| | | |
|---|---|---|
| 55. ధూర్జటి రచనలు - వర్ణనల వాకిళ్లు | - డా॥. బి. నాగశేషు | 265 |
| 56. జాతీయోద్యమ సాహిత్యంలో పలు కోణాలు - ఆవశ్యకత | - డా॥. కె.విజయభాను | 269 |
| 57. తెలుగు సాహిత్యం - ప్రసిద్ధ బౌద్ధ కావ్యాలు | - మామిడి మౌనిక | 275 |
| 58. వరంగల్ జిల్లా గిరిజన గేయ సాహిత్యం | - మూడ్ రాజు | 279 |
| 59. ఆలూరి బైరాగి 'నూతిలో గొంతుకలు' - ప్రతీకలు | - డా॥. బూసి వెంకటస్వామి | 283 |
| 60. పుట్టపర్తి మేఘదూతము - పరిశీలన | - ఎమ్. రంగస్వామి | 286 |
| 61. కవిత్వంలో సరికొత్త చిరునామా "ఫెండో" | - డా॥. గంధం అరుణ | 291 |
| 62. మల్లెమాల కవిత్వం - సమాలోచన | - యస్. గంగాధర రెడ్డి | 295 |
| 63. మల్లవరపు రాజేశ్వరరావు సాహిత్యం - చారిత్రకాంశాలు | - దిట్టకవి తిరుమల శ్రీనివాస్ | 299 |
| 64. మలిదశ తెలంగాణ ఉద్యమం 'పాట'కు స్వర్ణయుగం | - భానోత్ రమేష్ | 303 |
| 65. చలం మైదానం - సమాలోచన | - డా॥. కడియాల వెంకటరమణ | 306 |
| 66. "నడుస్తున్న కథ" - నవల విశ్లేషణ | - బోగిని మహేష్ | 309 |
| 67. మానవీయ విలువల నిధి - 'వంశ వృక్షం' | - డా॥. నల్లపనేని విజయలక్ష్మి | 315 |
| 68. చింతలపూడి ఎల్లన విష్ణుమాయా నాటకము - వర్ణనలు | - డా॥. పట్టపు శివకుమార్ | 322 |
| 69. జాతీయోద్యమ స్ఫూర్తి ప్రతీకలు - పత్రికలు | - డా॥. జడా సుబ్బారావు | 327 |
| 70. కర్నూలు జిల్లా శతక సాహిత్యం - వస్తువైవిధ్యం | - డా॥. బిర్రు అశోక్ | 330 |
| 71. జాతీయ కవి జాషువ | - ఎం. కృష్ణ | 336 |
| 72. కొప్పర్తి వెంకటరమణ మూర్తి కవిత్వం - సాంఘిక స్పృహ | - పోతుల శివాజీ | 340 |
| 73. జాతీయ ఉద్యమంలో తెలుగు సాహిత్యం | - డా॥. కె.లక్ష్మీనారాయణ | 344 |
| 74. జాషువ గబ్బిలం - సమకాలీన సామాజిక జీవిత చిత్రణ | - మావిళ్ళపాటి సుధేష్ణ | 348 |
| 75. చారిత్రక పొందు, కావ్య సీసాల విందు 'ఆంధ్ర ప్రశస్తి' | - డా॥. జె. సీతాపతి రావు | 354 |
| 76. కర్నూలు జిల్లా - జానపదుల పండుగలు | - యం. నాగమ్మ | 363 |
| 77. బీసీవాద కవిత్యం | - అట్టెం దత్తయ్య | 366 |
| 78. భాగవతంలోని గజేంద్రమోక్షం - ప్రతీకాత్మకత | - బి. ఈరనారప్ప | 373 |
| 79. నెల్లుట్ల రమాదేవి కథలు - సామాజిక జీవిత చిత్రణ | - బానోతు క్రిష్ణ | 377 |
| 80. భాస్కర రామాయణము - అయోధ్యకాండ - వర్ణనా వైశిష్ట్యము | - డా॥. డి. సుశీల | 380 |
| 81. చాటు కవిత్వములో కనిపించే సాంఘిక చారిత్రక విశేషాలు | - డా॥. ఏ.వెంకటప్రసాదు | 383 |
| 82. జూలూరు గౌరిశంకర్ కవిత్వం - సామాజిక స్పందన | - దండెం రాజశేఖర్ | 388 |

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# భాగవతంలోని గజేంద్రమోక్షం – ప్రతీకాత్మకత

- బి. ఈరనారప్ప, పరిశోధక విద్యార్థి, తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

సాహిత్యంలో ప్రతీకలు మొదట వేదాలు, ఉప నిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలలో కనిపిస్తాయి. అదేవిధంగా ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలంలో నేటి వరకు కూడా కవులు తమతమ రచనలలో ప్రతీకలు ద్వారా రచనలోని అంతరార్థాన్ని తెలియజేస్తున్నారు. అంతే కాకుండా మనం ప్రతిదినం మాట్లాడే మాటల్లో కూడా ప్రతీకలు చోటు చేసుకుంటాయి. ప్రతీక అంటే 'గుర్తు' అని 'సింబాలిజం' అని అర్థం. ఒకప్పుడు కవులు చీకటిని అజ్ఞానానికి ప్రతీకగా భావించారు. తర్వాత కాలంలో అన్యాయానికి, మూఢత్వానికి ప్రతీకగా ఉపయోగించారు. కవి సమాజానికి ప్రతినిధి. కలంతో సమాజాన్ని ప్రభావితం చేస్తాడు. తన రచనలలోని అంతరార్థాన్ని ఈ ప్రతీకలు ద్వారా తెలియజేస్తే పాఠకులు వాటిని అర్థవంతంగా అర్థం చేసుకుంటారు.

ఒక భావాన్ని సంకేతంగా చెప్పడానికి అనుగుణంగా ప్రతీకలు చోటుచేసుకుంటాయి. ఉదాహరణకు పురాణేతి హాసాలలో దేవతామూర్తులను ప్రతీకాత్మకంగా వర్ణించారు. శివుడు హాలాహలాన్ని కంఠంలో దాచడానికి ప్రతీకగా కష్టాలను, దు:ఖాలను కూడా భగవంతుడు స్వీకరించ డానికి ప్రతీకగా చెప్పవచ్చు. శ్రీకృష్ణుని పిల్లనగ్రోవి కూడా వెదురుతో తయారుచేయబడినది. వెదురులో ఏమీ లేదు. అంటే శ్రీకృష్ణుని పిల్లనగ్రోవి శూన్యత్వానికి ప్రతీక. ఇది కేవలం శ్రీకృష్ణుని పెదవుల మధురిమను స్పృశించడానికి వచ్చింది. అదేవిధంగా వినాయకుని ముఖం శాంతికి, సహనానికి ప్రతీక. ఈయన ఉదరం కూడా విశాలమైన ప్రపంచానికి ప్రతీక. లేకపోతే దేవతలు అందరి ఉదరాలు సమానంగా ఉండడమేమి? వినాయకుని ఉదరం పెద్దగా ఉండడమేమి. ఇది విశ్వవిస్తృతికి గుర్తు. దుర్గాదేవి సింహ వాహనంపై అనేక చేతులతో మనకు దర్శనం ఇస్తుంది. సింహం క్రూరత్వానికి ప్రతీక. అదేవిధంగా అనేక చేతులు బలాధిక్యానికి ప్రతీక. ఇదేవిధంగా స్త్రీమూర్తి గడ్డిపోచను అడ్డుపెట్టుకొని పురుషునితో మాట్లాడుతున్నట్లు వర్ణిం చారు. ఆ వర్ణన స్త్రీ పాతివ్రత్యానికి ప్రతీకగా భావిం చాలి. పతివ్రతలు పరపురుషున్ని నేరుగా చూడరాదనే నియమం పూర్వకాలంలో ఉండేది. ఈ విధంగా ప్రతీకలు సందర్భా నికి అనుగుణంగా, అవసరాన్నిబట్టి, నిత్యజీవితంలో కూడా ఉపయోగిస్తున్నాము.

పోతనామాత్యుని చేత రచింపబడిన భాగవతం అనేకమైన ఉపకథలతో, ప్రతీకాత్మక వైభవంతో ప్రధాన మైన భాగవత కథను బలపరుస్తుంది. భాగవతం పురాణం అయినప్పటికీ కావ్యంగా కూడా ప్రసిద్ధి పొందింది. అలంకారాల ద్వారా, ప్రతీకల ద్వారా, ఆలోచించడం వల్ల కావ్యం యొక్క అంతరార్థాన్ని తెలుసుకోవచ్చు. ఈ భాగవతం కూడా అందంగా, ప్రతీకలతో, అర్థ గాంభీర్యం తోనూ విలసిల్లుతూ ఉంది. ఈ భాగవతం వల్లనే మోక్షాన్ని పొందవచ్చు అని సాక్షాత్తు శ్రీకృష్ణుడే తెలిపినట్లు పోతన గారు చెప్పారు. పోతనగారు కారణజన్ముడు. ఎందుకంటే? సాక్షాత్తు ఆ శ్రీకృష్ణుడు భాగవత రచన చేసి తనకే అంకితం ఇవ్వమని అడగడం జరుగుతుందా, కాబట్టి పోతనా మాత్యుడు నిజంగా కారణజన్ముడే.

భాగవతంలో భగవతత్త్వమే ప్రధాన కాండం. చెట్టు కాండానికి కొమ్మలు లేకుంటే బలముండదు. కాబట్టి భాగ వతానికి కూడా ఉపకథలు లేకపోతే బలముండదు. ప్రధాన కథలలోని పరమార్థాన్ని చెప్పడానికి ఈ ఉపకథలు తోడ్పడుతాయి. పోతనగారు భాగవతంలోని ప్రధాన కథల లోని సత్యాన్ని ఉపకథల ద్వారా తెలిపాడు. గజేంద్ర మోక్షం ద్వారా శరణాగతి పొందడం, అంబరీషోపా ఖ్యానంలో విష్ణుభక్తి తత్త్వానికి అంబరీషుడు నిదర్శనం. ప్రహ్లాదుని కథ ద్వారా విష్ణుభక్తి గొప్పతనం, ధ్రువో

పాఖ్యానం ద్వారా పట్టుదలను తెలిపాడు. ఉపకథలలో స్త్రీ-పురుషులే కాకుండా సముద్రాలు, నదులు, జంతువులు మొదలైన వాటిద్వారా కూడా కథను నడిపించాడు.

## గజేంద్రమోక్షం - ప్రతీకాత్మకత :

భాగవతంలోని అనేకమైన ఉపకథలు ఉన్నాయి. వీటిలో గజేంద్రమోక్షం కూడా ముఖ్యమైనది. మనిషి తనలో ఉన్న శక్తిని నమ్ముకొని ఉన్నప్పుడు లేదా తాను సంశయాత్ముడై ఉన్నప్పుడు అతన్ని భగవంతుడు రక్షించడానికి చాలా కాలం పడుతుంది. కానీ, నిర్మలమైన, నిశ్చయాత్మకమైన బుద్ధితో భగవంతున్ని పూర్తిగా నూటికి నూరుశాతం శరణాగతితో వేడుకుంటే ఆ భగవంతుడు తన భక్తున్ని రక్షించడానికి ఆలస్యం చేయడు అని భాగవతంలోని ఈ గజేంద్రమోక్షం ద్వారా తెలుసుకోవచ్చు. అంతేకాని దేవుడు ఉన్నాడా? ఉంటే నన్ను కాపాడతాడే? అనే సంశయాత్మకంలో ఉండకూడదని పోతనగారు తెలిపారు.

క్షీరసాగరంలో త్రికూటమనే అందమైన పర్వతము ఉంది. ఆ పర్వతం మీద ఉండే అడవిలో అనేక రకాలైన క్రూరజంతువులు, సాధుజంతువులతో పాటు కొన్ని వేల ఏనుగులు కూడా ఉన్నాయి. ఆ ఏనుగులు గుంపులో కొన్ని ఆనందంగా ఆడుకుంటూ దారితప్పి నీరు దప్పికగొని సుదూరంలోని ఒక కొలను దగ్గరికి వెళ్ళాయి. ఆ ఏనుగుల గుంపు నాయకుడైన గజేంద్రుడు తన భార్య, మిగతా ఏనుగులతో జలక్రీడలు ఆడుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు. ఆ కొలనులోనే నీరుద్రావి విశ్రాంతి తీసుకుంటున్న మొసలి గజేంద్రున్ని పట్టుకొంది. సంసారి అయిన గజేంద్రుడు మొసలి పట్టులో చిక్కుకొని గజగజలాడిపోయాడు. విడిపించుకోవడానికి చాలా సమయం పట్టింది. తోటి ఏనుగులు, భార్యాపిల్లలు అందరూ దూరం నుండి చూస్తున్నారు. కానీ ఎవ్వరూ సహాయం చేయలేకపోయారు. బ్రహ్మ, ఇంద్రులు మొదలైన దేవతలు వచ్చికూడా ఆ గజేంద్రుని కాపాడలేకపోయాయి. కారణం ఈయనకు, మొసలికి పూర్వజన్మ శాపం వల్ల. అదేవిధంగా గజేంద్రుడు, మొసలితో వేయి సంవత్సరాలు పోరాడాడు. మొసలి తన స్థావరం అయిన నీటిలో ఇంకా పట్టుచిక్కుతోంది. గజేంద్రుడు అలసిపోతున్నాడు. చివరకు గజేంద్రుడు అలసిపోయి, పూర్వజన్మలోని జ్ఞానంవల్ల పరమాత్మున్ని 'రావే ఈశ్వరా కావవే వరదా సంరక్షించు భద్రాత్మకా'' అని శరణు కోరాడు. ఆ భగవంతుడు భక్తుల కోరికలు తీర్చడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఆయన్ను పూర్తిగా శరణాగతితో పిలవాలేగాని భక్తులను రక్షించడానికి తన ఆనందం, సుఖం, భార్య, సైన్యం, తన ఆయుధాలు అన్నీకూడా వదిలిపెట్టి వచ్చి భక్తులను రక్షిస్తాడు. ఆ విధంగానే గజేంద్రుని పిలుపు మేరకు ఆ మహావిష్ణువు అన్నీ వదలి తన భక్తున్ని కాపాడాడు. మొసలి కంఠాన్ని ఖండించడం ద్వారా మొసలికి పూర్వరూపం వచ్చింది. గజేంద్రునికి కూడా విశ్రాంతి కలిగించాడు. ఈ గజేంద్రుడు పూర్వజన్మలో ఇంద్రద్యుమ్నుడనే మహారాజు. ఈయన శ్రీమహావిష్ణువుని భక్తితో ధ్యానించే సమయంలో అగస్త్య మహామునిని చూడకుండుట వల్ల శాపం పొంది గజేంద్రుడిగా జన్మించాడు. గజేంద్రునికి అజ్ఞానం నశించి శ్రీమహావిష్ణువు చక్రం తాకడంతో పాపం, అగస్త్యుల వారి శాపం రెండూ పోయాయి. ఇతడు వైకుంఠాన్ని చేరుకున్నాడు. అదేవిధంగా మొసలి ''హూహూ'' అనే గంధర్వుడు. ఈయన కూడా దేవుని శాపం వల్ల మొసలిగా జన్మించాడు. శ్రీహరి చేతితోనే ముక్తి పొంది, పూర్వరూపం ధరించడం జరిగింది. ఇది భాగవతంలోని గజేంద్రమోక్షం కథ.

గజేంద్రమోక్షం అనే భాగవత ఉపకథలో త్రికూట పర్వత వర్ణన కలదు. దీనికి మూడు శిఖరాలున్నాయి. ఆ త్రికూట పర్వతాన్ని శరీరంగా భావిస్తే-

బంగారు శిఖరం - రజస్సు

కలదౌత శిఖరం - సత్త్వము

ఆయస్మార శిఖరం - తమస్సు లకు ప్రతీకలుగా వించవచ్చు. సత్త్వము, రజము, తమస్సు అ మూడు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గుణాలమయమైన దేహం జీవునిది. ఈ గుణత్రయమే మాయ. కాబట్టి జీవుడు మాయావృత్తుడు అయి వుంటాడు. గజేంద్రుని మోక్షం కథలోని గజేంద్రుడు కూడా తన భార్యలమాయ, వారికోసం ఆనందంగా వ్యక్తం చేయడమనే మాయలో పడినాడు. ఆ గజేంద్రుడు జీవునికి ప్రతీక. చెరువులోని మొసలి సంసారంలోని ఇల్లాలికి ప్రతీక. సంసారంలో స్త్రీ పెత్తనం, సరస్సులో మొసలిపెత్తనం. నీటి బయట మొసలిని నిర్లక్ష్యం చేస్తారు. అదే నీటిలో అయితే దానికి భయపడతారు. ఇంట్లో ఉండే ఇల్లాలు కూడా అంతే మొసలిలాగా ఇంట్లో ఆమె చెప్పిందే జరగాలి. ఇంట్లో భార్యభర్తలతోపాటు పిల్లలు, ఇరుగుపొరుగువారు స్నేహితులు మొదలగు వారితో ఆ ప్రాంతం అంతా సందడిగా ఉంటుంది. ఆ సన్నివేశం గజేంద్రుడు ఆనందంగా జలక్రీడలు ఆడిన కొలనుకి ప్రతీక. సంసారంలో భార్య, భర్తను బంధిస్తుంది. దీనికి ప్రతీకగా నీళ్ళలో మహాబలశాలియైన గజేంద్రున్ని మొసలి బంధించడం వీరిద్దరూ విముక్తికోసం ఆరాటపడుతారు.

గజేంద్రుడు తన పరివారంతో విహరించు సమయంలో వీటికి భయపడి అడవిలోని మిగతా జంతువుల భయపడి దాక్కోవడానికి ప్రతీకగా కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్య, ఈర్ష్య, అసూయాదులు వాటి అధిదేవతలయందు దాక్కొనుటకు ప్రతీకగా చెప్పవచ్చు. ఇక్కడ అడవిని సంసారముగా కూడా చెప్పవచ్చు. గజేంద్రుడు తన పరివారం దారి తప్పుటకు ప్రతీకగా జీవుడు తన స్వస్థానమును తప్ప, అన్నమయాది కోశంబులతో జ్ఞాన, విజ్ఞానాలను మర్చిపోవుటకు ప్రతీకగా చెప్పవచ్చు. గజేంద్రుని భార్యలకు ప్రతీకగా మానవుని మనస్సును భావించవచ్చు. అదేవిధంగా ఏనుగుల గుంపు దారితప్పుటకు మనిషి అనేక జన్మంబులు జీవించుటకు సమర్థుడూ కష్టసుఖాలను ఎదుర్కొనడానికి ప్రతీక.

గజరాజు తన ప్రియురాళ్ళతో జలక్రీడలు ఆడుచున్న సందర్భానికి మానవుడు కామక్రోదాలతో అహంకారములతో ఉండుట ప్రతీకగా భావించవచ్చు. సరస్సులోని మొసలిని కష్టాలకు ప్రతీకగా చెప్పవచ్చు. మొసలిచేత గజేంద్రుడు పట్టుబడుటకు అంతవరకు జీవుడు ఆనందించిన కామమునకు ప్రతీక. గజరాజు మొసలి నుండి తప్పించుకొనుటకు మానవుడు/జీవుడు సంసార సాగరమనే కష్టాల కడలి నుండి బయట పడుటకు ప్రతీకగా చెప్పవచ్చు. గజేంద్రుడు, మొసలి యుద్ధం చేయుటకు జీవుడు కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలతో యుద్ధం చేయుటకు, ఇంకా సంసారబంధంలోని కష్టాలను ఎదుర్కోవడానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఏనుగు పడుతున్న కష్టాన్ని చూస్తున్న మిగతా ఏనుగులు గుంపునకు ప్రతీకగా సమాజంలోని మానవులను వర్ణించవచ్చు. ఇంకా కామ విముక్తికై పోరాడు జీవున్ని విడువలేక పూర్వపు వాసనలు చూచుచుండెనని భావం.

మొసలి యొక్క బలము పెరిగిపోవుటకు, గజరాజు బలము తగ్గిపోయి బాధపడుటకు కష్టాలు, ఆపదలు, దు:ఖములు వచ్చినప్పుడు మానవుని యొక్క సుఖ సంతోషాలు తగ్గిపోయి, బాధపడిపోతాడని ప్రతీక. మొసలి మడుగులో అంతకంతకు విజృంభించుటకు, ఏనుగు అంతకంతకూ తగ్గిపోవుటకు అనువుగానిచోట బాధపడి పోవుట అని చెప్పవచ్చు. గజేంద్రుడు మొసలితో పోరాట సమయంలో బాధపడుటకు ఒక ప్రాణి ఎక్కువ అవివేకముతో, బుద్ధిని నిలుపలేక సంసార విషయముల గురించి బధపడుతున్నట్లు గజరాజు, మొసలి చేతిలో చిక్కుకొనుటకు మానవుడు కష్టాల వలయంలో చిక్కుకొనుటకు అలాగే సంసారిక జీవితంలో చిక్కుకొనుటకు ప్రతీక. గజేంద్రుడు, మొసలి వెయ్యేళ్ళయుద్ధం చేయుటకు అనేక సంవత్సరాలు లేదా ఎక్కువ కాలం అష్టకష్టాలు పడడానికి ప్రతీక. లోకంబులో మానవులు కూడా కామక్రోదమోహామద మాత్సర్యాల వల్లనే ఎక్కువగా కష్టపడుతున్నారని పోతన భాగవతంలోని గజేంద్ర మోక్షం అనే చిన్న ఉపకథ ద్వారా అనేక ప్రతీకలతో తెలియజేశాడు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

**ముగింపు :**

ఈ విధంగా ప్రతీకలు ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు అంటే ప్రస్తుతం ఈ రోజు వరకు కూడా అనేక చోట్ల ఉపయోగిస్తున్నాము. ఈ ప్రతీకల ద్వారా కావ్యం లేదా రచనలోని అంతరార్థాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు. అందుకోసం సాహిత్యంలోని అంతరార్థాన్ని తెలుసుకోవడానికి ఈ ప్రతీకలు ప్రయోగిస్తున్నాము.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమదాంధ్ర మహాభాగవతము - బమ్మెర పోతన
2. గజేంద్ర మోక్షణ రహస్యార్థము - చదువుల వీరాజు శర్మ
3. ఆంధ్రభాగవత విమర్శ - డా. ప్రసాదరాయ కులకవి
4. ప్రాచీన తెలుగు సాహిత్యం - ఆధునికుల పునర్మూల్యాంకనం - ఆచార్య జి. బాలసుబ్రమణ్యం (సంపాదకత్వం)

❖ ❖ ❖

# దాక్షిణాత్య సాహిత్యం - సామాజిక స్పృహ

# Daakshinathya Saahithyam - Saamajika Spruha

## మూడు రోజుల అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

## Three Days Online International Conference Special Issue

Volume - III



Edited & Published by


డా॥ ఎన్.ఆర్. సదాశివ రెడ్డి, Ph.D.

Dr. N.R. Sadasiva Reddy, Ph.D.












*Dr. N.R. Sadasiva Reddy*
Assistant Professor
Dept of Telugu & Comparative Literature
**Sri Krishna Devaraya University**
**Ananthapuram - (AP) - 515003**



ISBN 978-93-5416-812-3

**64. సాహిత్యంలో కొత్త లాంతరు "వ్యంజకాలు" - సామాజిక చింతన** - - డా. వైరాగ్యం ప్రభాకర్ **296-299**

**65. "నమ్ముకున్న నేల" కథ - సామాజిక దృక్పథం** - డా॥ కొణిదల శోభ **300-302**

**66. స్త్రీవాద కథలు - సామాజిక స్పృహ** - డా. ఉడుము ఝాన్సీ **303-306**

**67. శతక వాఙ్మయము - సామాజిక స్పృహ** - రామకృష్ణ ఇదుకుల్ల **307-314**

**68. భాగవతంలోని గజేంద్రమోక్షం - సామాజిక స్పృహ** - బి. ఈరనారప్ప **315-318**

# 68. భాగవతంలోని గజేంద్రమోక్షం - సామాజిక స్పృహ

బి. ఈరనారప్ప
పరిశోధక విద్యార్థి
తెలుగు & తులనాత్మక సాహిత్య శాఖ
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం
అనంతపురం

ఉపోద్ఘాతం :

తెలుగు సాహిత్యంలో పురాణ, ఇతిహాసాలు చాలా ప్రాచీనమైనవి. నేటి ఆధునిక కాలంలో అనేక సాహిత్య ప్రక్రియలు ఎంతో ఆదరణ పొందాయి. రామాయణం, మహాభారతాలను ఇతిహాసాలు అంటారు. రామాయణంను సంస్కృతంలో వాల్మీకి మహర్షి రచించగా, తెలుగులో అనేకమంది అనేక విధాలుగా రామాయణాన్ని రచించారు. మహాభారతాన్ని సంస్కృతంలో వేదవ్యాసుడు రచించగా, తెలుగులో కవిత్రయం నన్నయ, తిక్కన, ఎర్రన రచించారు. ఇక భాగవతాన్ని సంస్కృతంలో వేదవ్యాసుడు రచించగా, దీన్ని భక్తకవి పోతనగారు తెలుగులోకి అనువదించారు.

పురాణం, పురాణ పరుషుడైన భగవల్లీలకు ఆలవాలమైనది. పురాణం మాతృక వంటిది అయితే ఇతిహాసం పుత్రిక వంటిది. అనేక కథలు, ఉపాఖ్యానాలు, మనోహరంగా, భక్తియుతంగా, సంస్కారయుతంగా పురాణ ప్రక్రియలో చెప్పబడుతాయి. అట్టి పురాణం శ్రీభాగవతం. భక్తకవి పోతన రచించిన భాగవతంలో కూడా అనేక కథలు, ఉపాఖ్యానాలు, మనోహరంగా, భక్తియుతంగా ఉన్నాయి. బమ్మెర పోతన భాగవతంలోని ద్వాదశ స్కందాలలో హృదయం వంటిది దశమస్కంధం. మొత్తంగా భాగవతాన్ని అనువదించిన పోతనామాత్యుడు తెలుగువారికి ఒక పుణ్యపేటి. తెలుగువారి ఆరాధ్య గ్రంథం శ్రీమహాభాగవతం.

మహాభారత పురాణము అత్యంత ప్రాచీనమైనది. భాగవతం భక్తిరస ప్రధాన కావ్యం. ఇందులో భక్తి గురించి, విష్ణుమూర్తి అవతారాల గురించి, హిందూ సంస్కృతీ సంప్రదాయాంలో ఉన్న అనేక మంది రాజుల కథల గురించి చెప్పబడింది. ప్రధానంగా శ్రీకృష్ణుని అవతార విశేషములన్నీ భాగవతంలో వివరంగా చెప్పబడ్డాయి. భగవంతుని అవతారములలో శ్రీకృష్ణావతారము చాలా విశిష్టమైనది. ఆ కృష్ణావతారము దశమ స్కందంలో విపులంగా చెప్పబడింది. భాగవత గ్రంథంలో ఈ దశమ స్కంధం దాదాపు నాలుగవ వంతు వుంటుంది. ఈ భాగవత కథను వ్యాసుని కుమారుడైన శుకమహర్షి పరీక్షిత్తు మహారాజుకు చెప్పాడు.

భారతము మాదిరిగానే భాగవతం కూడా మూడు దశలలో విస్తరించింది. మొదట వేదవ్యాసునిచే రాయబడింది. తర్వాత శుక మహర్సి చేత పరీక్షిత్తునకు చెప్పబడింది. తర్వాత సూత పౌరాణికునిచేత శౌనికాది మునులకు చెప్పబడింది.

భాగవతం కేవలం భక్తి ప్రధానమైన గ్రంథం. ఇందులో వివిధ రకాల వ్యక్తులు, వివిధ రకాల భక్తి మార్గాలను అనుసరించారు. వాటిని విపులీకరించాడు వ్యాసుడు. భక్తికి కావ్యంలోని నిర్మలమైన మనస్సు, స్వచ్ఛమైన అంత:కరణ, తాను నమ్మిన దేవుడి మీద అచంచల విశ్వాసము, నీవే తప్ప ఇత: పరంబెరుగ అనే రీతిలో దేవుడికి పూర్తిగా అధీనమై పోవడం ఇదే భక్తి అంటే. ఈ భక్తి మనస్సును అట్టడుగు పొరలలో నుంచి రావాలే గానీ, పైన చెప్పిన ఆడంబరాల వల్ల రాదు. ఈ భక్తికి ధనం అవసరం లేదు. ఆర్భాటం అంతకన్నా అవసరం లేదు. కటిక పేదవాడి దగ్గర నుంచి సంపన్నుడి వరకూ ఆచరించదగినది ఈ భక్తి.

భక్తి మనుషులలోనే కాదు జంతువులలో కూడా ఉంటుందని స్పష్టంగా తెలియజేశాడు వ్యాసుడు. అదే గజేంద్రమోక్షం కథ. ఒక ఏనుగు తన కాలును మొసలి పట్టుకొని నీటిలోకి లాగుతూ వుంటే, తన శాయశక్తులా పోరాడింది. కానీ లాభం లేకపోయింది. అప్పుడు నిర్మలమైన మనస్సుతో శరణాగతితో భగవంతున్ని ప్రార్థించింది. అప్పుడు భగవంతుడు వైకుంఠం నుండి భార్యకు కూడా చెప్పకుండా దిగి వచ్చాడు. తన చక్రంతో నీటిలోని మొసలిని వధించి ఏనుగును కాపాడాడు. అలాంటి శరణాగతి దైవభక్తి అనేది కేవలం మానవులకే కాదు, జంతువులకి కూడా ఉంటుందని చెప్పడమే భాగవతంలోని గజేంద్రమోక్షం కథ.

భాగవత పురాణం మనకు భక్తి తత్త్వమును, నీతిని బోధించినట్టు శాస్త్ర విజ్ఞానమును కూడా అంతర్గతంగా బోధించింది అని కూడా చెప్పవచ్చును. శాస్త్రవిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా కొంతమంది భూమి చదునుగా ఉందని నమ్ముతున్నారు. డార్విన్ మహాశయుడు ప్రతిపాదించిన పరిణామ సిద్ధాంతాన్ని కూడా వీరు నమ్మరు. కానీ వేల సంవత్సరాల కిందట రాయబడ్డ భాగవతంలో ఈ పరిణామ సిద్ధాంతం సూత్రప్రాయంగా చెప్పబడింది. అదీ కథల రూపంలో చెప్పబడింది అంటే అతిశయోక్తి కాదు.

ఇంకా కృష్ణుడు వేదములను, ఉపనిషత్తులను ఔపోసన పట్టినవాడు. అనితర సాధ్యమైన గీతను లోకానికి అందించిన వాడు. అదీ కాకుండా గొప్ప రాజనీతిజ్ఞుడు. ఈ ప్రకారంగా మానవుడు పరిపూర్ణ మానవుడిగా పరిణామం చెందాడు అని భాగవతం అంతర్లీనంగా పరిణామ సిద్ధాంతాన్ని లోకానికి తెలియజేసింది. అర్థం చేసుకోవాలేగానీ, భాగవతంలో ఏ విషయం తీసుకున్నా అది సందేశాత్మకమే కానీ వృథాగా ఏ విషయమూ చెప్పబడలేదు.

గజేంద్రమోక్షంలోని ఏనుగులు గుంపుతో గజేంద్రుడు ఇంద్రాది దేవతలను జయించడానికి వస్తున్నట్లుగా సంచరిస్తున్నాయి. అవి ఆకలిదప్పులు, శోకమోహములు  అడవిలో తిరుగుతున్నాయి. సమాజంలో మనుషులు ఇతరులను ఇచ్చింది పెడుతూ, అంతా తమకే తెలుసునని, తామే గొప్పవాళ్ళమని, తమకి మించినవారు లేరని, గజేంద్రుడిలాగా ప్రవర్తిస్తుంటారు. గజేంద్రమోక్షంలోని అజ్ఞానంతో కూడిన గజేంద్రుడిలాగా నేటి సమాజంలో మానవులు ప్రవర్తిస్తున్నారు.

ఇంకా ఆ ఏనుగులు కొండంత కష్టం వచ్చినా ధైర్యం విడనాడకుండా కామాదులను జయించుటకు సింహం వంటి పట్టుదల కలవి. అదే విధంగా పిడుగులు మీదపడినా తట్టుకుంటాయి కానీ చలించవు. ఇలాగే సమాజంలోని కొంతమంది కూడా ఆ ఏనుగులు మాదిరిగానే ఎంత కష్టమొచ్చినా తట్టుకుంటారు. కానీ వారు చేయాల్సిన పనులు మాత్రం ఆపరు. నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు వారు. ఎంత ప్రతికూల పరిస్థితులు ఎదురైనను ఆ గజేంద్రుని మాదిరిగానే చలించరు.

ఆ ఏనుగులు అడవిలో ఏ విధంగా ప్రవర్తిస్తున్నాయో సమాజంలోని మానవులు కూడా ఆహార, విహారాలతో ఆనందిస్తూ, మధ్యమధ్యలో ఎండమావుల లాగా కనిపించే కోరికలు, అవసరాలను ఆనందిస్తూ, సంసార సాగరాన్ని ఈదుతున్నారు. ఇలా కొంతమంది ఆ ఏనుగుల గుంపు మాదిరి లేని దాని కోసం ప్రాకులాడుతూ ఆనందాన్ని కోల్పోయి అలౌకిక సుఖాల కోసం ప్రాకులాడుతూ ఇదే ప్రపంచం, ఈ ప్రపంచాన్ని జయించినట్లుగా భ్రమపడి పోతుంటారు.

ఇతరులు ఎవ్వరూ తిరగని ఆ నిర్మలమైన పద్మాల సరస్సును చూసి ఆ మదగజాలు ఎంతో ఆనందపడ్డాయి. అలాగే మానవులు కూడా ఎవ్వరూ చేయనిది తాను చేసి, ఆనందపడుతున్నాడు. మానవుడు సమాజంలో మరో రకంగా కూడా ఆనందపడుతుంటాడు.

ఏవిధంగా అంటే ఆ మదగజాలు పద్మాల సరస్సును చూచి, ఏవిధంగా ఆనందించాయో ఎదుటి వ్యక్తుల సంతోషాలను చూసి ఆనందించేవారు, అదేవిధంగా ఎదుటి వారి కష్టాలను చూచి కూడా ఆనందించేవారు

ఉన్నారు. ఈ సమాజంలో ఆ సరస్సులో గజేంద్రుడు తన ప్రియురాళ్ళతో ఏ విధంగా సరస సల్లాపాలతో విహరిస్తున్నాడో సమాజంలోని మానవులు కూడా ఆనందం, బాధ, కష్టం, సుఖం వంటి వాటితో జీవనం కొనసాగిస్తున్నారు.

సరోవరంలోని రాజు మొసలి ఆ మడుగులో ఒక మూల దాక్కొని గజరాజుని చూశాడు. భుగభుగమని చప్పుళ్ళతో పెద్దపెద్ద బుడగలు పుట్టి అలలు ఆకాశానికి ఎగిసి పడేలా పైకి ఎగిరాడు. రాహువు సూర్యుడిని పట్టుకున్నట్లుగా ఆ మొసలి రాజు ఆ గజేంద్రున్ని ఒడిసి పట్టుకున్నాడు. ఇదే విధంగానే సమాజంలోని మానవులకు కష్టాలు గాని, సుఖాలుగా ఆ మొసలి మాదిరిగానే పట్టుకొని వెంటాడుతూ ఉంటాయి.

మనిషి తన బలాన్ని నమ్ముకొని ఉన్నప్పుడు లేదా సంశయాత్ముడై ఉన్నప్పుడు అతన్ని రక్షించడానికి చాలా కాలం పడుతుంది. కానీ నిశ్చయాత్మక బుద్ధితో, భగవంతునికి తనను తాను పూర్తిగా సమర్పించుకున్నప్పుడు అతని రక్షణకు ఆలస్యం ఉండదనే విషయాన్ని శ్రీమన్నారాయణుడు గజేంద్రమోక్షం కథా ఘట్టంలో గజేంద్రున్ని సరస్సులోని మొసలి ద్వారా రక్షించి తెలియజేశాడు.

మదపుటేనుగులు పంచేంద్రియాల వ్యవహారాలను మరచి, సరస్సులోకి ప్రవేశించి జలక్రీడలాడాయి. ఆ సమయంలో ఆ మడుగులో మకరేంద్రుడు చెరువులో విహరిస్తున్న గజేంద్రున్ని ఒడిసి పట్టుకున్నాడు. అది ఎలాగంటే సంసారివలె గజేంద్రుడు మకరేంద్రుని పట్టులో  చిక్కుకొని గజగజలాడిపోయాడు. సంసారాన్ని మోస్తున్న వారు కూడా అనేక సమస్యలతో గజగజలాడిపోతున్నారు.

గజేంద్రుడు మకరేంద్రునితో వేయి సంవత్సరాలు పోరాడాడు. చివరకు గజేంద్రుడు అలసిపోయి, పూర్వ పుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో పరమాత్మున్ని శరణు కోరాడు. భగవంతుడు భక్తపాలన కళాసంరంభకుడు కనుక గజప్రాణావనోత్సాహియై తన సుదర్శన చక్రంతో మొసలి కంఠాన్ని ఖండించాడు. గజేంద్రునికి చక్కని విశ్రాంతిని కల్పించాడు. అదేవిధంగా మానవులు కూడా అనేక కష్టాలలో చిక్కుకొని గజేంద్రుడి మాదిరిగా అలసిపోయి ఆ భగవంతుని లీలతో ఆ భగవంతున్ని సంపూర్ణ శరణాగతితో వేడుకొంటే కచ్చితంగా ఆ నారాయణుడు కాపాడుతాడనే విషయాన్ని గజేంద్రున్ని రక్షించడం ద్వారా తెలియజేశాడు.

సత్త్వరజోతమోగుణమయం జీవునిది. ఈ గుణత్రయం అంతా మాయ. కాబట్టి మానవుడు మాయావృత్తుడై ఉంటాడు. అందువల్ల మానవులలో అరిషడ్వర్గాలు పెరుగుతాయి. ఈ అరిషడ్వర్గాలలోనే గజేంద్రుడు, మానవులు చిక్కుకున్నాడు. ఆ సమయంలోనే భగవంతున్ని శరణు వేడాలి గజేంద్రుని మాదిరి. అప్పుడే జీవునికి చక్కని విశ్రాంతి కలిగిస్తాడు ఆ శ్రీహరి.

సంఆరం అన్నది సాగరం లాంటిది. ఈదడం కష్టం కొందరికి ఇంట బాగుంటుంది. మరికొందరికి ఇంటా, బయటా బాగుంటుంది.  కొందరికి రెండింటా బాగుండదు. ఇలా చాలా చిత్రంగా ఉంటుది మానవుని స్థితి. వేదాంతులు మాత్రం ఇంటిని మోక్షానందానికి ప్రతీకగా పేర్కొన్నారు. బయట అలసి సొలసి వస్తే విశ్రాంతి కలిగేది ఇంట్లో, అందుకని ఇల్లు మోక్షం ఇక ఇంట్లోనే అశాంతి ఏర్పడితే జీవునికి దైవమే శరణ్యం గజేంద్రుని  మాదిరి.

కొందరు విజ్ఞులు సంసారాన్ని ప్రవాహమని, అరణ్యమని కూడా చెబుతారు. అంటే ఈ సంసారం అన్యోన్యత లేనందువల్ల కొందరికి దుర్భరమైనదని అర్థం, మరికొందరికి మధురమైనదని కూడా. కొన్ని సంసారాలు మొదట ఆకర్షణీయంగా, చివరకు దుస్సహంగా ఉంటాయి. గజేంద్ర మోక్షం ఘట్టంలో  గజేంద్రుడు కూడా మొదట తన పరివారంతో ఆనందంగా గడిపి చివరకు మొసలిచేత కష్టాలు పడతాడు.

చెరువులోని మొసలి సంసారంలోని ఇల్లాలు ప్రతీక. సంసారంలో స్త్రీ పెత్తనం, సరస్సులో మొసలి పెత్తనం బయట మొసలి నిర్లక్ష్యానికి గురి అవుతుంది. నీటిలోనే దాని ఆధిక్యం. ఇల్లాలు కూడా బయట కొన్ని

సందర్భాల్లో నిర్లక్ష్యానికి గురవుతుంది. చివరకు ఇల్లాలికి ఇంటిలో తిరుగులేదు.

ఇంటిలోని పోరు ఇంతింత కాదయా చెడు అయినా, మంచి అయినా ఆమె చెప్పిందే జరగాలి. ఇల్లాలే కాకుండా ఇంకా పిల్లా, జల్లా ఇరుగు, పొరుగు అమ్మలక్కలు, బంధువులు, స్నేహితులు, సేవితులు, పరిచారికలు మొదలగువారు చాలామంది ఉంటారు. ఇల్లాంతా సందడి ఈ దృశ్యం చెఱువుకు ప్రతీక. సంసారంలో భార్యభర్తను బంధిస్తుంది. మహాబలశాలియైన ఏనుగును నీళ్ళల్లో మొసలి బంధిస్తుంది విముక్తి కోసం ఇరువురూ ఆరాటపడుతారు.

ఇలాంటి స్థితిలో జీవుడు హరినామస్మరణ చేస్తాడు. "కలదు కలండనెడు వాడు కలడో లేడో" అనే సందేహాన్ని విడిచి, "నీవే తప్పనిత:పరంబెఱుగ మన్నింపందగున్ దీనునిన్" అంటూ ఆర్తితో దైవాన్ని ప్రార్థిస్తాడు. ఇలా కృత నిశ్చయంతో జీవుడు శ్రీహరిని శరణువేడగానే భగవంతుడు తక్షణమే స్పందించి, గజేంద్రునికి విముక్తి ప్రసాదించినట్లు, జీవునికి సంసార బంధం నుంచి విముక్తి కలిగిస్తాడు.

సంసారం అన్నది ఏ రూపంగానైనా జీవున్ని బాధించవచ్చు. అదొక వ్యాధి వంటిది. వ్యాధి నివారణకు ఔషధం అవసరం. సంసార వ్యాధి నివారణకు హరినామస్మరణమే పరమౌషధం. ఇదే గజేంద్రమోక్షం కథా పరమార్థం.

## ఆధార గ్రంథాలు


1. శ్రీమదాంధ్ర మహాభాగవతం - బమ్మెర పోతనామాత్యుడు, తి.తి.దే. ప్రచురణ
2. గజేంద్రమోక్షణ రహస్యార్థము - చదువుల వీర్రాజు శర్మ
3. అంతరార్థ భాగవతం - డా॥ వేదుల సూర్యనారాయణశర్మ